డిసెంబర్
2014

# 104

సంపుటి : 9 సంచిక : 8 వెల రు. 10/-

## ఈ సంచికలో........

మతం - మతోన్మాదం
భారతదేశంలో వ్యవసాయ సమస్య పరిష్కారానికి సిపిఎం కృషి
టిఆర్ఎస్ ప్రభుత్వ విధానాలెటువైపు?
జి20 సమావేశాలు : ప్రమాద సూచికలు
ఉపాధి హామీపై ఎందుకీ దాడి?
చైనాలో చతుర్భుగ్మతలపై 'మాస్ లైన్' ఉద్యమం : ఒక పరిశీలన
కార్మిక హక్కులపై ముప్పేటదాడి
వీరనారి ఆరుట్ల కమలాదేవి

స్ఫూర్తి

# వీరనారి ఆరుట్ల కమలాదేవి

యు. రామకృష్ణ

నిజాం నిరంకుశత్వానికీ.. వెట్టి చాకిరికీ వ్యతిరేకంగా ఉవ్వెత్తున సాగిన తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటం ఎంతోమంది మహిళలను వీరయోధులుగా తీర్చిదిద్దింది. అయిలమ్మ, మల్లు స్వరాజ్యం, పద్మ, కమలమ్మ, రాములమ్మ, ఇలా ఎందరో.. వారిలో ఆరుట్ల కమలాదేవి కూడా ఒకరు. నిర్దాక్షిణ్య నిజాం నిరంకుశ పాలనను అంతం చేయడానికీ, అమాయక ప్రజల ధన, మాన, ప్రాణాలను దోచుకుంటున్న పాశవిక శక్తులను నిర్మూలించడానికీ సాయుధ పోరాటమే లక్ష్యమని.. తన ప్రాణాన్ని గడ్డిపోచగా భావించి.. సమర వ్యూహంతో పాలకుల గుండెలను గడగడలాడించిన తెలంగాణా వీరనారి ఆరుట్ల కమలాదేవి.

నల్గొండ జిల్లా ఆలేరు మండలం మంతపురిలో ఓ మధ్యతరగతి రైతు కుటుంబంలో 1920లో జన్మించారు కమలాదేవి. ఆమె అసలు పేరు రుక్మిణి. తల్లిదండ్రులు లక్ష్మీ నర్సమ్మ, ఎల్లా వెంకట్రామిరెడ్డి. ఆ రోజుల్లో గ్రామాల్లో పాఠశాలల్లేవు. అసలు ఆడపిల్లలు చదువుకునే ఆలోచనే లేదు. అందువల్ల పనులు చూస్తూ రుక్మిణి ఇంట్లోనే ఉండేది. పదకొండేళ్ల వయసులో మేనమామ కొడుకు ఆరుట్ల రామచంద్రారెడ్డితో ఆమె వివాహం జరిగింది. రామచంద్రారెడ్డిది కొలనుపాక. హైదరాబాద్‌లో రెడ్డి హాస్టల్లో ఉంటూ చదువుతుండేవారు.

ఆనాడు దేశమంతటా స్వాతంత్రోద్యమం ముమ్మరంగా సాగుతోంది. ఓవైపు గాంధీగారి శాసనోల్లంఘనోద్యమం.. మరోపక్క భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌కు ఉరిశిక్ష.. మీరట్ కుట్రకేసు.. దేశమంతటా సంచలనం కలిగిస్తున్న కాలమది. ఆ సమయంలోనే హైదరాబాద్ సంస్థానంలో నిజాం నిరంకుశత్వం, దొరలు, దేశ్‌ముఖ్‌లు, పెత్తందార్ల దోపిడీ సాగుతోంది. మాతృభాషకు విలువే లేదు. ఉర్దూలోనే చదువు. అదీ అందరికీ అందుబాటులో లేదు.

ఆ నేపథ్యంలో రామచంద్రారెడ్డి జాతీయోద్యమానికి ఆకర్షితులయ్యారు. దేశభక్తి,



ఆదర్శ భావాలు అలవర్చుకున్నారు. కనుకనే ఆనాడు ప్రముఖ జాతీయ మహిళా నేతగా ఉన్న 'కమలాదేవి ఛటోపాధ్యాయ'పై గౌరవంతో పెళ్లిలో రుక్మిణి పేరును 'కమలాదేవి'గా మార్పు చేశారు. ఆనాటి నుంచి ఆమె కమలాదేవిగానే సుపరిచితులు. తనతో పెళ్లి.. వైదిక మంత్రోచ్చారణలతో కాకుండా ఆర్య సమాజ పద్ధతిలో జరగాలనీ, పెళ్లయ్యాక తాను చదువుకోవాలనీ రామచంద్రారెడ్డి రెండు షరతులు పెట్టారనీ, వీటికి తమ వాళ్లు అంగీకరించారని కమలాదేవి చెబుతుండేవారు.

పెళ్లయ్యాక ఆమెను హైదరాబాద్‌లో మాడపాటి హనుమంతరావుగారు స్థాపించి, నడుపుతున్న 'ఆంధ్ర గరల్స్ హైస్కూలు'లో చేర్పించారు. ఆ హైస్కూలును నిజాం ప్రభుత్వం గుర్తించలేదు. దీంతో మహారాష్ట్రలోని కార్వే యూనివర్సిటీకి అనుబంధంగా నడుస్తుండేది. ఆ రోజుల్లో బాలురకేగానీ బాలికలకు ప్రత్యేకంగా వసతి గృహాలుండేవి కావు. రెడ్డి హాస్టల్ నిర్మించి, నడుపుతున్న వెంకట్రామిరెడ్డిని ఒప్పించి ఆ హాస్టల్‌కు అనుబంధంగా బాలికల వసతి గృహాన్ని ఏర్పాటు చేయించారు రామచంద్రారెడ్డి.

అందులో కమలాదేవి మొదటి విద్యార్థిని అయ్యారు. ఆ తర్వాత ఆమెతోపాటు 15 మంది విద్యార్థినులు ఉండేవారు. వారంతా రాజకీయ చైతన్యం పొందినవారి కుటుంబాల నుంచి ప్రయత్నించి, చేర్పించబడినవాళ్లే. కమలాదేవి చదుకునేనాటికే రామచంద్రారెడ్డి 'ఆంధ్ర మహాసభ'లో ముఖ్యమైన కార్యకర్త. రాజకీయాల్లో తీరికలేకుండా పనిచేస్తున్నారు.

దానివల్ల 1934 నుంచీ 'ఆంధ్ర మహాసభ' సమావేశాలకు కమలాదేవిని తీసుకు వెళుండేవారు. ఆమె వలంటీర్‌గా పనిచేస్తుండేవారు. రామచంద్రారెడ్డికి ఆమెను తన జీవిత భాగస్వామినిగానే కాకుండా రాజకీయాల్లోనూ భాగస్వామిని చేయాలనే కోరిక ఉండేది. ఆ మహాసభల సందర్భంలోనే రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి మొదలైన వారితో పరిచయం కలిగింది.

కమలాదేవి స్కూలు ఫైనల్, హెచ్ఎస్‌సి ఉత్తీర్ణురాలయ్యాక కొలనుపాక వెళ్లారు. అప్పటికా ఊళ్లో బడి లేదు. అది జాగీరు గ్రామం. బడి పెట్టాలన్నా, గ్రంథాలయం స్థాపించాలన్నా నిషేధం. అందువల్ల రామచంద్రారెడ్డి చొరవతో రహస్య గ్రంథాలయాన్ని స్థాపించారు. గ్రంథాలయమంటే నిషేధం ఉంది కాబట్టి 'వంటశాల'నే పేరు పెట్టారు. దానికి దర్వాజాలూ, తలుపులూ ఉండేవి కాదు. అక్కడే ఆమె విద్యార్థులను పోగేసి, పాఠాలు చెబుతూ గ్రంథాలయాన్ని నడిపేవారు.

కొంతకాలానికి 'అది వంటశాల కాదు, గ్రంథాలయమని' జాగీర్దారు కనిపెట్టాడు. ప్రభుత్వం దాన్ని మూసేసింది. జాగీర్దారు చేసిన పనిని జైన్ మందిరం నిర్వాహకులు తెలుసుకొని, తమ మందిరంలో స్థలమిచ్చి పాఠశాల నిర్వహించడానికి అనుమతించారు. ఏడాదిపాటు అక్కడే స్కూలు నడిపారామె.

నిజాం సంస్థానంలో ముఖ్యంగా తెలంగాణా ప్రాంతంలో.. అందులోనూ నల్గొండ జిల్లాలో 'ఆంధ్ర మహాసభ' ఒక ఉద్యమంగా మారింది. స్త్రీలకు ఆత్మరక్షణ అవసరమని భావించిన కమ్యూనిస్టు పార్టీ 1943లో విజయవాడలో 'మహిళా ఆత్మరక్షణ శిక్షణా శిబిరం' ఏర్పాటు చేసింది. దీనిలో ఆమె పాల్గొన్నారు. ఫాసిస్టు ప్రమాదం, జపాన్ దండయాత్ర ప్రమాదం దృష్ట్యా కర్రసాము, ఆత్మరక్షణోపాయాలు, విమానదాడి రక్షణలు,

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...

**1. వీరనారి ఆరుట్ల కమలాదేవి**
– యు. రామకృష్ణ 2

**2. మతం - మతోన్మాదం**
– బి.వి. రాఘవులు 4

**3. భారతదేశంలో వ్యవసాయ సమస్య పరిష్కారానికి సిపిఎం కృషి**
– రామచంద్రన్ పిళ్లై 10

**4. టిఆర్ఎస్ ప్రభుత్వ విధానాలెటువైపు?**
– ఎస్. వీరయ్య 14

**5. జి20 సమావేశాలు : ప్రమాద సూచికలు**
– ఎస్. వెంకట్రావు 16

**6. ఉపాధి హామీపై ఎందుకీ దాడి?**
– బి. వెంకట్, కొండూరి వీరయ్య 20

**7. చైనాలో చతుర్రుగ్మతలపై 'మాస్ లైన్'ఉద్యమం : ఒక పరిశీలన**
– డా॥ కె. రవీంద్ర బాబు 27

**8. కార్మిక హక్కులపై ముప్పేటదాడి**
– టి.కె. రాజాలక్ష్మి 30

**సంపాదకుడు:**
**ఎస్. వెంకట్రావు**

**సంపాదక వర్గం:**
**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరుపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్. వెంకట్రావు**
**ముద్రణ :** ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, ప్లాట్ నెం 21/1, అజామాబాద్, హైదరాబాద్-20
**ఫోన్:** ఎడిటోరియల్ **0866-2573822**
**మేనేజర్: 040-27673787**
EMail:svenkatarao_1958@yahoo.com
Visit cpi(m) site at : cpim.org

# గురివింద

**మా**నవహక్కులు, ప్రజాస్వామ్యం గురించి నిత్యం సుద్దులు చెబుతూ, ఆ పేరుతో అనేక దేశాల్లో జోక్యం చేసుకుంటున్న అమెరికాలో మానవహక్కుల బండారం బయటపెట్టే ఘటనలు ఇటీవల వరుసగా జరిగాయి. ఆగస్టు 9న అమెరికాలోని మిస్సోరీ నగరంలో 18 ఏళ్ల నల్లజాతి యువకునిపై తెల్లజాతీయుడైన పోలీసు అధికారి పెద్ద కారణం లేకుండా కాల్పులు జరిపి, ప్రాణాలు తీశాడు. ఆ యువకుడు దొంగతనానికి పాల్పడ్డాడనీ, పట్టుకోడానికి వస్తే తనమీదకు వచ్చాడనీ, అందుకు కాల్చేశాననీ పోలీసు అధికారి న్యాయస్థానంలో చెబితే న్యాయస్థానం 'నిజమేనని నమ్మి' అతనిపై విచారణ జరపనవసరం లేదని తీర్పు ఇచ్చింది. రెండో ఘటన ఇటీవలే జరిగింది. నవంబర్ 22న క్లీవ్‌లాండ్‌లో 12 ఏళ్ల బాలుడు పార్కులో బొమ్మతుపాకి పట్టుకుని ఆడుకుంటుంటే ఏవరో ఒక అపరిచిత వ్యక్తి పోలీసులకు ఫోన్ చేసి కుర్రాడు 'బొమ్మతుపాకిలాంటిది' మావైపు చూపిస్తున్నాడు, మాకు భయమేస్తోందని చెబితే వెంటనే పోలీసులు కారులో వచ్చి, పార్కులో దిగి అరనిమిషంలోనే బాలుని కాల్చి చంపేశారు. ఆ బాలుడు కూడా నల్లజాతీయుడే. రెండు ఘటనల పట్ల అమెరికాలో తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. ఫెర్గూసన్ ఘటన జరిగినప్పుడూ, న్యాయస్థానం తీర్పు సందర్భంగానూ అమెరికా అంతటా ప్రజాగ్రహం కట్టలు తెంచుకుంది.

ఈ రెండు ఘటనలు అమెరికా సంస్కృతిలోని రెండు అనాకారి వైఖరులును వెల్లడిస్తున్నాయి. ఒకటి, అక్కడి నల్లజాతి ప్రజలపై జరుగుతున్న తీవ్రమైన వివక్ష. రెండవది, ప్రజల ప్రాణాలన్నా, మానవ హక్కులన్నా పాలనాయంత్రాంగానికి లెక్కలేని తనం. అమెరికాలో జరిగిన ఈ ఘటనలతోనే ఇటువంటి నిర్ధారణకు రానవసరం లేదు. కానీ అక్కడ అనేక సంవత్సరాలుగా జరుగుతున్న అనేకానేక ఘటనలు దీన్నే తెలియజేస్తున్నాయి.

ప్రపంచంలో జాతి వివక్ష, మానవహక్కుల హరణం అత్యధికంగా జరుగుతున్న దేశాల్లో అమెరికా అగ్రస్థానంలో ఉంది. ప్రపంచంలోనే అత్యధిక ప్రజలు జైళ్లలో మగ్గుతున్నది అమెరికాలోనే. అక్కడ ప్రతి లక్షమందికి 707 మంది జైళ్లలో మగ్గుతున్నారు. ప్రపంచ జనాభాలో అమెరికన్లు 4 శాతం ఉన్నారు. కానీ జైళ్లలో మగ్గుతున్నవారిలో వారు 25 శాతం ఉన్నారంటే అక్కడ మానవ హక్కుల పరిస్థితి ఎలా ఉందో తెలుస్తుంది. మానవహక్కులు లేవని అమెరికా నిత్యం ప్రచారం చేస్తున్న చైనా ఈ విషయంలో 124వ స్థానంలో ఉండగా, సిరియా 188వ స్థానంలో, మ్యాన్మార్ 132వ స్థానంలో ఉన్నాయి. అమెరికా జైళ్లలో ఉన్న వారిలో కూడా నల్లజాతివారూ, ఇతర వర్ణాలవారూ అధికం. ప్రతి లక్షమంది తెల్లజాతీయుల్లో 380 మంది జైళ్లలో ఉండగా, ప్రతి లక్షమంది నల్లజాతీయుల్లో 2207 మంది జైళ్లలో మగ్గుతున్నారు. ఉపాధి అవకాశాలు కూడా నల్లజాతివారికీ, ఇతర వర్ణాలవారికీ చాలా తక్కువ. ఇళ్లులేనివారిలో వారే ఎక్కువ. పేదరికం వారిలోనే అధికం. అందుకే వారిలో తీవ్రమైన నిరాశ, నిస్పృహ నెలకొని ఉంది. ఇటీవలి ఘటనల్లో ఈ నిరాశే నిరసనగా బయటపడింది.

తనకు ఇష్టంలేని, తన మాట వినని, తన దోపిడీకి తలవంచని దేశాల్లో ప్రభుత్వాలను లొంగదీసుకోడానికి, లేదా మార్చడానికి మానవహక్కుల సమస్యలను సాధనంగా ఉపయోగించుకునే అమెరికా తన దేశంలోని కుళ్లును గురించి మాట్లాడదు. ఇతర దేశాల్లో ప్రజాస్వామ్యం గురించి పుంఖానుపుంఖాలుగా రాసే సామ్రాజ్యవాద ప్రసారసాధనాలు అమెరికాలో మానవ హక్కుల సమస్యకు మసిపూసి మారేడుకాయ చేస్తాయి. ఫెర్గూసన్‌లో నల్లజాతీయుల నిరసనను అణచివేయడానికి మిలటరీ యంత్రాంగం యుద్ధ సన్నాహాలతో దిగింది. మొత్తం నగరాన్ని బారికేడ్ చేసింది. దాని గురించి సామ్రాజ్యవాద మీడియాలో పెద్దగా రిపోర్టుకాలేదు. కానీ హాంగ్‌కాంగ్‌లో కొద్దిమంది నిరసన కారుల కార్యక్రమాలను రోజుకు 24 గంటలు ప్రసారం చేశాయి. చైనాలో సోషలిజానికి వ్యతిరేకంగా ప్రచారం చేయడానికి దాన్నో సాధనంగా ఉపయోగించుకున్నాయి. ఇదీ సామ్రాజ్యవాదపు నిజస్వరూపం. ఫెర్గూసన్ ఘటన ఆ రూపాన్ని లోకానికి కొంచెం వెల్లడించింది అంతే.

**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.10,** సంవత్సర చందా:**రూ.100,** పోస్టు ద్వారా **రూ. 120**

పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**

**మేనేజర్,**
**మార్క్సిస్టు**
**(సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.హెచ్ భవన్ (ప్రజాశక్తి కార్యాలయం),**
**అజామాబాద్, హైదరాబాద్- 20**

# మతం - మతోన్మాదం



రచయిత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) పొలిట్‌బ్యూరో సభ్యులు

**బి.వి. రాఘవులు**

బి.జె.పి. ఈ ఎన్నికలలో సంపూర్ణమైన మెజార్టి సాధించి కేంద్రంలో అధికారంలో కొచ్చింది. గతంలో మిత్రులతో కలిసి అధికారంలో ఉండటంతో తమ మతోన్మాద ఎజెండాను అమలు జరపటానికి కృషి చేయలేక పోయారు. ఇపుడు పూర్తి మెజారిటి సాధించారు కాబట్టి హిందుత్వ విధానాలను వేగంగా అమలు జరిపే ప్రయత్నం చేస్తున్నారు.

బి.జె.పి. ప్రభుత్వ మతోన్మాద విధానాలను ఏ మేరకు ఎదుర్కొని, తిప్పికొట్టగలం అనేది మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజల చైతన్యాన్ని పెంచటంపై ఆధారపడి ఉంటుంది. మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజల చైతన్యాన్ని పెంచాల్సిన బాధ్యత మనపై ఉంది. గతంలో మిత్రులతో కలిసి అధికారంలో ఉండటంతో మతోన్మాద విధానాలను అమలు జరపటానికి కొన్ని పరిమితులు ఉన్నాయి. ఈనాడు మిత్రులతో కలిసి అధికారంలో ఉన్నా, తనకు పూర్తి మెజారిటి ఉంది కాబట్టి తన మతోన్మాద ఎజెండాను అమలు జరపటానికి ఎటువంటి ఆటంకాలు లేవు. ప్రజలపై భారాలు మోపే, ఆర్థిక స్వావలంబనకు నష్టం కలిగించే నిర్ణయాలు తీసుకుంటున్నది. పాలనా యంత్రాంగంలోకి మతోన్మాద శక్తులను చొప్పించే ప్రయత్నం ప్రారంభించింది. విద్యావ్యవస్థను కాషాయీకరణ చేస్తున్నది. సంఘపరివార్, బి.జె.పి. నాయకులు, సంస్థలు మత వైషమ్యాలను రెచ్చగొట్టే ప్రకటనలు చేస్తున్నారు. అనేకచోట్ల మత ఘర్షణలను సృష్టిస్తున్నారు. ఇది దేశ లౌకిక పునాదులకు తీవ్ర నష్టం కలిగించే పరిణామం. అభ్యుదయ శక్తులకు, కార్మికవర్గ, కష్టజీవుల ఉద్యమాలకు అపార నష్టం జరుగుతుంది. మతతత్వ శక్తులను బలహీనం చేయకపోతే, లౌకిక, అభ్యుదయ శక్తులను సమీకరించకపోతే దేశ భవిష్యత్తుకు, కష్టజీవుల భవిష్యత్తుకు, తీవ్ర హాని జరుగుతుంది. వామపక్షవాదులు, లౌకిక వాదులు, అభ్యుదయవాదులందరూ సమైక్యంగా మతోన్మాదాన్ని ప్రతిఘటించాల్సిన సమయం ఆసన్నమైంది. ప్రతిఘటించాలంటే మతోన్మాదాన్ని గురించి కొన్ని విషయాలను మనం తెలుసుకోవాలి.

హిందుత్వ శక్తుల ప్రమాదాన్ని ఎదుర్కోవాలంటే వాటి భావజాలం పట్ల, వ్యూహాలపట్ల, నిర్మాణ పద్ధతులపై తగిన అవగాహన ఉండాలి. సంఘ పరివార్ భావజాలం సాధారణ ప్రజల ఆలోచనలలోకి విస్తృతంగా ప్రవేశించింది. అబద్ధాలు, అసత్యాలు, వక్రీకరణలతో కూడిన ప్రచారాన్ని ఇందుకు వినియోగిస్తున్నది. సంఘ పరివార్ ప్రయత్నాలు సఫలం కావటానికి దారితీసిన పరిస్థితులను అర్థం చేసుకొని, వాటిని తిప్పికొట్టేందుకు అవసరమైన పద్ధతులను రూపొందించుకోవాలి.

హిందుత్వ శక్తులకు వ్యతిరేకంగా పోరాడాలంటే మతతత్వం, లౌకికతత్వం, జాతీయ వాదం అన్న భావాల పట్ల సరియైన అవగాహన ఉండాలి. చాలా సందర్భాలలో మతతత్వ వాదులు ఈ మూడు భావాల్ని కలిపి మనల్ని గందరగోళపరుస్తారు. మతతత్వవాదులు తాము మతతత్వవాదులమని అంగీకరించరు. తామే నిజమైన లౌకికవాదులమని, మిగతావారు కుహనా లౌకికవాదులని చూపించే ప్రయత్నం చేస్తుంటారు. లౌకికవాదం, మతోన్మాదం పూర్తిగా విరుద్ధమైనవి. దీన్ని కప్పిపెట్టి, తాము చెప్పే మతతత్వానికి లౌకికవాదమనే ముసుగు వేసి, లౌకికవాదులైన ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తారు. తమ హిందుత్వమే నిజమైన లౌకికవాదమని, లౌకికవాదులైన వారందరూ తమను సమర్థించాలని హిందుత్వవాదులు చెబుతారు. లౌకికవాదం తప్పు, మా హిందుత్వమే గొప్ప అంటే వారిని ఓడించటం తేలిక. మా హిందుత్వమే అసలైన లౌకికవాదం. మా హిందుత్వను సమర్థించే వాళ్ళే లౌకికవాదులని అంటారు. ఈ వాదనను ఓడించటానికి కష్టపడి అధ్యయనం చేయాలి. అందువలన లౌకికవాదం అంటే ఏమిటనేది స్పష్టంగా అవగాహన చేసుకుంటేనే మతోన్మాదుల కుతర్కాన్ని బయటపెట్టగలం.

హిందూ మతోన్మాదం జాతీయవాదం ముసుగులో చలామణి అవుతూ తామే అసలైన దేశభక్తులమని నమ్మించే ప్రయత్నం చేస్తుంది. కమ్యూనిస్టులు, ఇతరులు చెప్పేది జాతీయవాదం కాదు, దేశద్రోహవాదం. కమ్యూనిస్టులు అంతర్జాతీయవాదులు. అంతర్జాతీయవాదులకు దేశభక్తి ఉండదు. కీలక సమయాలలో ఇతర దేశాలకు సహాయం చేస్తారు. కాబట్టి నిజమైన జాతీయ వాదులైతే హిందుత్వను బలపరచాలని చెబుతారు. గతంలో తమది సమ్మిశ్రిత జాతీయవాదం అనిచెప్పారు. ఇపుడు సాంస్కృతిక జాతీయ వాదం అని చెబుతున్నారు. వారుజెప్పే జాతీయ వాదంలో దేశ ప్రయోజనాలకు ఉపయోగపడే, ప్రజలందరినీ ఐక్యంజేసే అంశం ఈషన్మాత్రం లేకపోయినా ప్రజలను మభ్యపెట్టే వాదనలు జేస్తుంటారు. అందువలన మతోన్మాదం, లౌకిక వాదం, జాతీయవాదం అన్న భావాలను సక్రమంగా అర్థం చేసుకుంటేనే మతోన్మాదశక్తుల తప్పుడు వాదనలను తిప్పికొట్టగలం.

### మతోన్మాదం

మతోన్మాదం అంటే మతంపై ఆధారపడిన బూటకపు రాజకీయ సిద్ధాంతం. హిందూ మతానికో సిద్ధాంతం, క్రైస్తవ మతానికో సిద్ధాంతం, ముస్లీం మతానికో సిద్ధాంతం రాన్నాయి. ఈ సిద్ధాంతాలను నమ్మడం, నమ్మక పోవడం వ్యక్తుల ఇష్టాయిష్టాలకు సంబంధించిన విషయం. కాని మతాన్ని రాజకీయ ప్రయోజనాలకు వినియోగించుకోవటం అనేది పబ్లిక్ విషయం అందుకే దాన్ని మనం వ్యతిరేకిస్తున్నాం. మత ఘర్షణలు ఇప్పుడే కాదు వందల సంవత్సరాల క్రితం కూడా జరిగాయి. శైవులు, వైష్ణవులు మేం గొప్ప అంటే మేం గొప్ప అని జరిపిన ఘర్షణల్లో వేల మంది చనిపోయారు. జైనులు, బౌద్ధులకు ఇతరులకు మధ్య జరిగిన ఘర్షణల్లోనూ వేలాదిమంది ప్రాణాలు కోల్పోయారు. ఇవి మత ఘర్షణలు. మా మతం గొప్ప అంటే మా మతం గొప్ప అనేది వీటికి

> **“ మతోన్మాదం పాలకవర్గాల ప్రయోజనాలకు ఉపయోగ పడుతుంది. మతోన్మాదం తమ ప్రయోజనాలకు అవసర మనుకున్నపుడే పాలకవర్గాలు దాన్ని ప్రోత్సహిస్తాయి. ఇంతకుముందు కూడా దేశంలో మత ఘర్షణలు జరిగాయి. కానీ ఎప్పుడూ ఇంత తీవ్ర స్థాయిలో మతోన్మాదం బలపడటం జరగలేదు. ఇప్పుడు పాలక వర్గాలకు ప్రయోజనం కాబట్టే మతోన్మాదం పెరగటానికి అవకాశం కలిగింది. ”**

మూలం. కాని మా మతమే రాజ్యాధికారంలో ఉండాలి అనేది ఈ ఘర్షణలకు కారణం కాదు. మతాన్ని రాజకీయ ప్రయోజనాలకు వినియో గించుకోవటం, తమ మతంపైనే రాజ్యం ఆధార పడాలనే వాదన ఆధునిక పరిణామం మాత్రమే. హిందూత్వవాదులు ఆదిమ కాలం నుండి హిందూమతం రాజ్యంపై ఆధిపత్యాన్ని చెలా యించింది. మధ్యలో రాజ్యాన్ని, మతాన్ని కృత్రిమంగా విడగొట్టేశారు. ఇపుడు తిరిగి కలపాలని డిమాండ్ చేస్తున్నారు. ముస్లీం మతోన్మాదులు కూడా ఇదే డిమాండ్ చేస్తున్నారు. నాజర్ కాలంలో ఈజిప్ట్‌లో, సద్దాం హుస్సేన్ కాలంలో ఇరాక్‌లో, తరాకీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆఫ్ఘనిస్థాన్‌లో, ఇరాన్‌లో మసూ ద్ ‌లున్నపుడు, అంతకు ముందు షా అధికా రంలో ఉన్నపుడు, ఇప్పటికీ టర్కీలో రాజ్యం, మతం వేరుగానే ఉన్నాయి. అందువలన మతోన్మాదం అనేది ఆధునిక పరిణామమే కాని పూర్వకాలం నుండి ఉన్నది కాదని మనం అర్థం చేసుకోవాలి.

మతోన్మాదాన్ని బూటకపు సిద్ధాంతమని ఎందుకంటున్నాం? మార్క్సిజం కూడా సిద్ధాం తమే. అది ఆర్థిక, రాజకీయ, సామాజిక వాస్త వాలపై ఆధారపడి రూపొందించుకున్న సిద్ధాం తం. మతోన్మాదం పూర్తిగా అవాస్తవాలపై, అబద్ధాలపై, ఊహాజనిత అంశాలపై ఆధారప డినది కాబట్టి బూటకపు సిద్ధాంతం అంటున్నాం. వాస్తవాల మీద, చారిత్రక వాస్తవాలమీద ఆధారపడితే హిందూత్వానికి ఒక రాజకీయ సిద్ధాంతంగా ఉండే అవకాశం లేదు. ఇస్లాంది కూడా అదే పరిస్థితి. వాస్తవాలపై ఆధారపడితే ఏ మతానికి కూడా ఒక రాజకీయ సిద్ధాంతంగా మనగలిగే అవకాశం లేదు. హిందూత్వ హిందూ మతాన్ని వినియోగించుకొని అధికారానికి రావాలని ప్రయత్నిస్తున్నది. ‘హిందువులంతా ఒకటి. హిందువుల ఆర్థిక, సామాజిక, రాజకీయ ప్రయోజనాలు ఒకటే’ అని చెబుతుంది. ముస్లిం మతోన్మాదులు ముస్లింలందరి ప్రయోజనాలు ఒకటే అని చెప్పినా మత ప్రాతిపదికన ప్రస్తుతం మన దేశంలో అధికారంలోకి రాగలిగిన శక్తి వారికి లేదు. అందువలన మతోన్మాదాలన్నీ ప్రమాదకరమే అయినా మెజారిటీ ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్నానని చెప్పుకొనే హిందూ మతోన్మాదం మరింత ప్రమాదకరమైనది.

మతోన్మాదం పాలకవర్గాల ప్రయోజనా లకు ఉపయోగపడుతుంది. మతోన్మాదం తమ ప్రయోజనాలకు అవసరమనుకున్నపుడే పాలక వర్గాలు మతోన్మాదాన్ని ప్రోత్సహిస్తాయి. ఇంతకుముందు కూడా దేశంలో మత ఘర్షణలు జరిగాయి. గోద్రా ఘటన, ముంబాయిలో దాడి, పార్లమెంటుపై దాడి, బివాండీలో మత కలహాలు, ఇంకా అనేక చిన్నా, పెద్దా మత ఘర్షణలు, దాడులు జరిగాయి. దేశ విభజన సందర్భంలో 1947 – 50 మధ్య పెద్ద ఎత్తున మత కలహాలు జరిగి లక్షలాది మంది చనిపో యారు. అయినా ఆ సందర్భాలలో ఎపుడూ ఇంత తీవ్ర స్థాయిలో మతోన్మాదం బలపడటం జరగలేదు. ఇప్పుడు పాలక వర్గాలకు ప్రయోజనం కాబట్టే మతోన్మాదం పెరగటానికి అవకాశం కలిగింది. మతోన్మాదం పాలక వర్గాలకు ఉపయోగపడే సిద్ధాంతం కాబట్టి పాలక వర్గాలపై సాగే పోరాటంలో మతోన్మా దంపై జరిగే పోరాటం కూడా ముఖ్యభాగంగా ఉండాలి. కాబట్టి పాలక వర్గాలకు వ్యతిరేకం గా జరిగే పోరాటానికి మతోన్మాదానికి వ్యతిరేకం గా జరిగే సైద్ధాంతిక పోరాటం ఒక్కటే సరి పోదు. పాలక వర్గాలంటే పెట్టుబడిదారులు, భూస్వాములు, సామ్రాజ్యవాదులు. వీరికి వ్యతిరేకంగా ఆర్థికరంగంలో ప్రధానమైన పోరా టం జరగాలి. సామాజిక, సాంస్కృతిక, రాజ కీయ రంగాలలోనూ జరగాలి. అందువలన పాలక వర్గాలకు వ్యతిరేకంగా ఉద్యమాలను నిర్మించాలి. వర్గ పోరాటాలు చేయాలి. అప్పుడే మతోన్మాదాన్ని బలహీనపరిచి, ఓడించగలం.

బి.జె.పి.మతోన్మాద పార్టీ. కాంగ్రెస్, టి.డి.పి, సమాజ్‌వాదిపార్టీ, తృణమూల్ కాంగ్రెస్ తదితరపార్టీలు మతోన్మాదం పట్ల అవకాశ వాదంతో వ్యవహరిస్తున్నా, ఓట్ల కోసం ఎన్నికల్లో మతోన్మాదాన్ని వినియోగించుకోవడానికి వెనకాడకపోయినా వాటిని లౌకికవాద పార్టీల గానే పరిగణించాలి. అంటే పాలకవర్గాలలో అత్యధికులు వ్యతిరేకించినా మతోన్మాద శక్తులు అధికారంలో కొచ్చాయనే అభిప్రాయానికి కూడా కొందరు రావచ్చు. ఈనాడు మతోన్మాదం మనక వసరం అని భావించిన పాలక వర్గాలు, కార్పొరే ంట్, పెట్టుబడిదారీ, భూస్వామ్య శక్తులు కాంగ్రె స్, ఇతర పార్టీలను వదిలేసి బి.జె.పి. వెనుక చేరారు. ఈ వర్గాలన్నీ పోతున్నపుడు వీరులే కుండా మనం బతికేదెలా అని చంద్రబాబు లాంటి వారు బి.జె.పి. వైపుకుపోయారు. అలా చేరకపోయినా కొందరు ఒకరోజు ఇటు, మరో రోజు అటూ ఉంటూ అవకాశవాదంగా వ్యవహ రిస్తున్నారు. కాబట్టి పాలకుల ప్రయోజనాలను అనుసరించి మతోన్మాద పెరుగుదల ఉంటుందని గమనంలో ఉంచుకోవాలి.

### లౌకికవాదం

ఇంతకు ముందు చెప్పుకున్నట్లు మతోన్మా దులు తాము మతోన్మాదులమని అంగీకరించరు. ‘మా హిందూత్వయే అసలైన లౌకికవాదం’ అని చెపుతారు. అందువలన లౌకికవాదం అంటే ఏమిటనేది మనం అర్థం చేసుకుంటే హిందూత్వ వాదులు చెబుతున్న నకిలీ లౌకికవాద బండారం బయటపడుతుంది. మతతత్వానికి వ్యతిరేక మైనది, పూర్తి భిన్నమైనది లౌకికవాదం. లౌకిక వాదుల్లో కూడా మూడు రకాలైన అభిప్రా యాలున్న వాళ్లున్నారు. మార్క్సిస్టులుగా మనం ఏ విధంగా చూస్తున్నామో అర్థం చేసుకోవాలి. మొదటిది లౌకికవాదం అంటే రాజ్యానికీ, మతా నికీ మధ్య సంబంధం ఉండకూడదు. మతం, రాజ్యం ఒకదానికొకటి సంబంధం లేకుండా వేరుగా ఉంటేనే అది లౌకికరాజ్యం అవుతుంది. అయితే వేరుగా ఉండటం అంటే అర్థం ఏమిటి? మతం విషయంలో ప్రభుత్వం ఏమీ జోక్యం చేసుకోకూడదా? ఉదాహరణకు సతీసహగమనం ఉంది. అది మతానికి సంబంధించిన విషయం. రాజ్యం, మతం వేరుగా ఉన్నపుడు సతీ సహగ మనాన్ని నిషేధిస్తూ ప్రభుత్వం చట్టం చేయవచ్చా? అలాగే బాల్య వివాహాలను నిషేధిస్తూ 18 సంవ త్సరాలు దాటిన తర్వాతనే వివాహం చేయాలని చెప్పింది. ఇది మత విషయాలలో జోక్యం చేసుకోవటం కాదా? దేవాలయాలలోకి దళితులు ప్రవేశించకూడదని, ఆడవారికి ఆస్తి హక్కు లేదని మతం చెపుతుంది. దళితులు దేవాలయాలలోకి ప్రవేశించ వచ్చుననీ, ఆడవారికి ఆస్థిహక్కు ఉ

> **❝ లౌకికవాదం అంటే రాజ్యం, మతం వేర్వేరుగానే ఉండాలి. కాని ఏమతానికి సంబంధించి అయినా ఆ మతం లో ప్రజాస్వామిక మార్పులకోసం ఉద్యమాలు జరిగేటపుడు అందుకు దోహదం చేసే పద్ధతిలో రాజ్యం జోక్యం చేసుకో వచ్చు. అలా కాకుండా ప్రభుత్వమే నేరుగా జోక్యం చేసు కొంటే ప్రతికూల ఫలితాలొస్తాయి. ❞**

ండాలనీ చట్టం చెబుతున్నది. ఇది రాజ్యం మత విషయాలలో జోక్యం చేసుకోవటం అవుతుందా? హిందూ వివాహచట్టంలో పురుషుడు ఏక పత్నీవ్రతుడుగా ఉండాలని చట్టం చెబుతున్నది. ముస్లీంలలో పురుషుడు తలాక్ అని విడాకులిచ్చి, విడాకులివ్వకుండా కూడా వేరే వివాహం చేసుకోవచ్చు. హిందువులలో ఏకపత్నీ వ్రతాన్ని తప్పనిసరి చేస్తూ చట్టం చేసినపుడు ముస్లీంలకు కూడా ఏకపత్నీ వ్రతాన్ని తప్పనిసరి చేస్తూ చట్టం ఎందుకు చేయరని చర్చలు వస్తున్నాయి. హిందూమతంలో ప్రభుత్వం జోక్యం చేసుకుంటున్నది, ముస్లీం మతంలో జోక్యం చేసు కోవటం లేదని ప్రచారం జరుగుతున్నది.

లౌకికవాదం అంటే రాజ్యం, మతం వేర్వేరుగానే ఉండాలి. కాని ఏమతానికి సంబంధించి అయినా ఆ మతంలో ప్రజాస్వామిక మార్పుల కోసం ఉద్యమాలు జరిగేటపుడు అందుకు దోహదం చేసే పద్ధతిలో రాజ్యం జోక్యం చేసుకోవచ్చు. రాజారామ్మోహనరాయ్, కందుకూరి వీరేశలింగం తదితరులు సంఘ సంస్కరణల కోసం ఉద్యమాలు చేశారు. ఆ విధమైన ఉద్యమాలు వచ్చిన సందర్భాలలో ప్రభుత్వం జోక్యం చేసుకొని చట్టాలలో ప్రగతిశీల మార్పులు తీసుకురావాలి. అలా కాకుండా ప్రభుత్వమే నేరుగా జోక్యం చేసుకొంటే ప్రతికూల ఫలితాలొస్తాయి. హిందూమత విధానాలకు కొన్ని సవరణలు తెస్తూ అంబేద్కర్ హిందూ కోడ్ బిల్లును తెచ్చినపుడు దాదాపుగా కాంగ్రెస్ వారంతా ఆ బిల్లును వ్యతిరేకించారు. ఆ అసంతృప్తితోనే అంబేద్కర్ మంత్రిపదవికి రాజీనామా చేశాడు.

ముస్లిం మత పద్ధతుల్లోనూ అటువంటి మార్పులు జరగాలి. సంస్కరణలను అనేకమంది కోరుకుంటున్నారు. ఇస్లాం మతంలో విడాకులు తీసుకున్న మహిళలకు భరణం ఇవ్వాల్సిన అవసరం లేదని చట్టం చేశారు. బహుభార్యాత్వానికి సంబంధించి మార్పులు చేయలేదు. ఇటువంటి మార్పులు జరగాల్సివుంది. కాబట్టి అక్కడ సంఘర్షణ లేకుండా, ప్రజాస్వామిక ఉద్యమం లేకుండా ఆ మతానికి సంబంధంలేని వారు ప్రభుత్వంలో కూర్చొని నిర్ణయాలు చేయకూడదని మనం చెబుతున్నాం. భారతదేశ చరిత్రలో హిందూమతంలో సంస్కరణోద్యమాలు జరిగాయి తప్ప ముస్లిం మతంలో సంస్కరణోద్యమాలు తగినంతగా జరగలేదు. జాతీయోద్యమ కాలంలో సయ్యద్ అహ్మద్ ఖాన్ ద్వారా సంస్కరణోద్యమాలు ప్రారంభం అయినా ప్రారంభంలోనే ఆగిపోయాయి. 1947 దాకా సంస్కరణోద్యమాలు జరగలేదు. దేశ విభజన తర్వాత ఎక్కువ మంది ముస్లింలు పాకిస్థాన్ వెళ్ళటంతో ఇక్కడ మైనారిటి అయ్యారు. మైనారిటి మతాలలో అంతర్గత మార్పులు, సంస్కరణలు జరగటానికి అవకాశాలు తక్కువగా ఉంటాయి. హిందూమతంలో కూడా అభ్యుదయ మార్పులను నిరోధించాలని, ఇప్పటివరకు జరిగిన మార్పులను వెనక్కు తిప్పాలని హిందూత్వవాదులు ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటివరకు జరిగిన మార్పులను మరింత ముందుకు తీసుకెళ్ళేలా మన కృషి ఉండాలి.

ఇక లౌకికవాదానికి రెండో నిర్వచనం ఏమిటంటే రాజ్యం అన్ని మతాలను సమానంగా చూడాలి. అన్ని మతాలను సమానంగా గౌరవించటం, సమానంగా ప్రోత్సహించటం చేయాలి. హిందూత్వశక్తులు, కమ్యూనిస్టులను మినహాయిస్తే మిగతా రాజకీయ పార్టీలు లౌకికవాదానికి చెబుతున్న నిర్వచనం ఇది. భారతరాజ్యాంగం కులాల మధ్య అసమానత్వాన్ని గుర్తించింది, కాని మతాల మధ్య అసమానత్వాన్ని గుర్తించలేదు. అన్ని మతాలకు సమానావకాశాల పేరుతో ప్రభుత్వం అన్ని మతాల్ని ప్రోత్సహిస్తున్నది. అన్ని మతాల ప్రచారానికి దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియోలలో ప్రచారానికి అవకాశం కల్పిస్తున్నారు. దీనిలో హిందూమతానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రభుత్వ డబ్బుతో అన్ని మతాల్ని ప్రోత్సహిస్తున్నది. కాబట్టి బూర్జువా రాజకీయ పార్టీల లౌకికవాదం అన్ని మతాలను ప్రోత్సహిస్తూ, మెజారిటి మతోన్మాదం పెరగటానికి అవకాశం కల్పిస్తున్నది. బూర్జువా రాజకీయ పార్టీలలో రెండు రకాలున్నాయి. మతాన్ని సాధనంగా చేసుకొనే పార్టీలు, మతాన్ని ఉపయోగించుకొనే పార్టీలు. బి.జె.పి, శివసేన, ముస్లీంలీగ్, యం.ఐ.యం, ఇవి మత పార్టీలు. మతాన్ని సాధనంగా చేసుకొని రాజకీయాలు నడుపుతూ, అధికారాన్ని సాధించటానికి ప్రయత్నం చేస్తున్నాయి. కాంగ్రెస్, తెలుగుదేశం లాంటివి మతాన్ని ఉపయోగించుకొనే పార్టీలు. ఇందిరాగాంధీ హత్య తర్వాత కాంగ్రెస్ అనుయాయులు సిక్కులను ఊచకోత కోయడం ద్వారా హిందూ మత భావనలను ఉపయోగించుకొని భారీ మెజారిటితో కాంగ్రెస్ అధికారంలోకొచ్చింది. ఇతర పార్టీలు కూడా తమకవసరమైనపుడు ఇదేవిధంగా మతాలను వినియోగించుకొంటున్నాయి. అందువలన బూర్జువా రాజకీయ పార్టీల లౌకికవాదం లోపభూయిష్టంగా ఉంటూ ఆచరణలో మతోన్మాదం పెరగటానికి తోడ్పడుతున్నది.

మతాల్ని అసమానంగా చూస్తేనే నిష్పక్షపాతమౌతుంది. బలహీనమైన మతాల విషయంలో జాగ్రత్తలు తీసుకొని రక్షణ కల్పిస్తేనే అది ప్రజాస్వామ్యమౌతుంది. ఇక్కడ ముస్లింలు కావచ్చు, పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లలో హిందువులు కావచ్చు. ఎక్కడ ఎవరు మైనారిటీగా ఉన్నా అక్కడ ప్రజాస్వామ్యం ఉంటే వారికి రక్షణ కల్పించాలి. మతం పేరుతో మైనారిటీలు రాజ్యాధికారాన్ని స్వాధీనం చేసుకొనే అవకాశమే ఉండదు. కాని మెజారిటి మతం వారుకానీ, మెజారిటి భాషకు చెందినవారు కానీ రాజ్యాధికారాన్ని స్వాధీనం చేసుకొనే అవకాశం ఉంటుంది. ఇటువంటి పరిస్థితుల్లో మైనారిటీలకు రక్షణ కల్పిస్తేనే అది నిజమైన ప్రజాస్వామ్యం అవుతుంది.

ఇక మూడో నిర్వచనం ఆధునికానంతరవాదులు మెజార్టీ, మైనార్టీ ఏ మతోన్మాదాన్నయినా ఓడించటం సాధ్యం కాదని చెబుతారు. మతం ప్రజలందరి మనసుల్లోనూ ఉంది కాబట్టి మతాన్ని ఓడించటం, మతాన్ని రాజ్యాన్ని వేరు చేయటం సాధ్యం కాదు. అందువలన మతంలో ఉన్న చెడ్డ అంశాలను వేరు చేసి, మంచి విషయాలను తీసుకొని దానిపై ఆధారపడి ప్రభుత్వాన్ని నడపాలని చెబుతారు. దీనికి, హిందూత్వానికి తేడా ఏమిటి? హిందూత్వవాదులు మెజారిటి మతతత్వంపై ఆధారపడి రాజ్యాన్ని నడపాలని చెబుతుంటే, వీరు అన్ని మతాలలోని మంచిని తీసుకొని రాజ్యాన్ని

నడపాలని చెబుతున్నారు. బి.జె.పి.వారు, ఆధునికానంతరవాదులు చెప్పేదానిలో ఉమ్మడి అంశం ఏమిటంటే లౌకికవాదం భారతదేశానికి సంబంధించినది కాదు. ఇది యూరప్‌లో పుట్టింది. అక్కడి పరిస్థితులకు మాత్రమే సరిపోతుంది. మన దేశ పరిస్థితులకు సరిపోదని చెబుతారు.

కమ్యూనిజం, ప్రజాస్వామ్యం, లౌకికవాదం యూరప్‌లో ముందుగా అభివృద్ధి చెంది వుండ వచ్చు. బూర్జువా వ్యవస్థ అభివృద్ధి చెందేకాలంలో రాజ్యం, మతం వేరుగా ఉండాలనే భావన వచ్చింది. యూరప్‌లో మతం ఆధీనంలో రాజు ఉండేవాడు. రాజు, ప్రజలు మతాధిపతి చెప్పిందే చేసేవారు. రాజుకు, పోప్‌కు ఘర్షణలు జరిగి, క్రమంగా పోప్ అధికారాలన్నీ రాజుకు సంక్ర మించాయి. మతానికి, రాజ్యానికి సంబంధం లేకుండా చేయటమనేది ఫ్రెంచి విప్లవం తర్వాత తీవ్రమైంది. ఆ విధంగా రాజ్యానికి, మతానికి మధ్య జరిగిన ఘర్షణలో నుండి లౌకికవాదం పుట్టింది.

భారతదేశంలో ఏనాడూ రాజు మతానికి లోబడి లేడు. మతమే రాజుకు లోబడి ఉంది. మొదటి నుండీ రాజును దైవాంశ సంభూతునిగా భావించారు. ఎంత గొప్ప పురోహితులైనా రాజుకు లోబడే ఉండేవారు. బ్రాహ్మణుడు రాజైనా అతను రాజుగానే ఉండేవాడు కాని బ్రాహ్మణుడుగా ఉండేవాడు కాదు. భారత దేశంలో రాజుకన్నా ఆధిక్యం కలిగిన మతం లేదు. కాబట్టి రాజుకు మతానికి మధ్య ఘర్షణ లేదు కాబట్టి లౌకికవాదం సమస్య ఇక్కడలేదు. రెండో అంశం. బలమైన మతాలు రావటంతో మతాల మధ్య ఘర్షణలు వచ్చాయి. అందువలన మత సామరస్యాన్ని ఎక్కువగా బోధించుతూ వచ్చారు. అశోకుడు మత సామరస్యాన్ని బోధించాడు. సూఫీ మతం, భక్తి ఉద్యమాలు ఈవిధంగా మత సామరస్యాన్నే బోధించాయి. కాబట్టి భారతదేశంలో మత సామరస్యాన్ని సాధించాలంటే లౌకికవాదం తప్పనిసరి అవసరం.

హిందూమతం మత సహనం పాటిస్తుంది. కాబట్టి హిందూమతం అధికారంలోకి రావటమే నిజమైన లౌకికవాదమని చెబుతారు. ఇస్లాం మతం దురుసుగా వ్యవహరిస్తుందంటారు. దీనిలో వాస్తవం లేదు. హిందూమతంలో శైవులు, వైష్ణవులకు మధ్య జరిగిన ఘర్షణలు. ద్వైతం, అద్వైతం, విశిష్టాద్వైతంల మధ్య జరిగిన గొడవల్లో వేలమంది ఊచకోత కోయబడ్డారు. ఆలయాలు, ఆశ్రమాలు నాశనం చేశారు. చరిత్ర చూస్తే మత సామరస్యం విషయంలో

> **“ భారతదేశంలో ఏనాడూ రాజు మతానికి లోబడి లేడు. మతమే రాజుకు లోబడి ఉంది. మొదటి నుండీ రాజును దైవాంశ సంభూతునిగా భావించారు. ఎంత గొప్ప పురోహితులైనా రాజుకు లోబడే ఉండేవారు. బ్రాహ్మణుడు రాజైనా అతను రాజుగానే ఉండేవాడు కాని బ్రాహ్మణుడుగా ఉండేవాడు కాదు. భారతదేశంలో రాజుకన్నా ఆధిక్యం కలిగిన మతం లేదు. కాబట్టి రాజుకు మతానికి మధ్య ఘర్షణ లేదు కాబట్టి అప్పుడు లౌకికవాదం సమస్య ఇక్కడలేదు. ”**



కత్తిపట్టి వీరంగం వేస్తున్న భజరంగ్ దళ్ కార్యకర్త : మతాల మధ్య చీలిక తేవడానికి మతఘర్షణలను ఒక సాధనంగా ఉపయోగించు కుంటున్నారు

హిందూమతానికి అంత ఘన చరిత్ర ఏమీలేదు. కుల వ్యవస్థలో వేల సంవత్సరాల నుండి దళితులను అణచివేసి, ఊచకోత కోశారు. మనుషులుగా చూడకుండా, చదువుకోనీయకుం డాదారుణమైన అణచివేతకు, హింసాకాండకు గురిచేసిన తర్వాత సామరస్యం గురించి, సహనం గురించి మాట్లాడతారు. ఇటువంటి తగాదాలు ఘర్షణలు ఇతర మతాల్లో సైతం చరిత్రలో చూస్తాం.

హిందూమతానికి ఒక భిన్నత్వం వుంది. అది ఒక గ్రంథం మీదనో, మాట మీదనో ఆధారపడి నిర్మించక బడిన మతం కాదు. క్రైస్తవులకు బైబిల్, ముస్లింలకు ఖురాన్, సిక్కులకు గురుగ్రంథ సాహిబ్ ఉన్నాయి. హిందూమతంలో వేదాలా, పురాణాలా, ఉపనిషత్తులా, బ్రాహ్మణాలా, భగవద్గీతా లేక మనుధర్మ శాస్త్రమా? దేన్ని అనుసరించాలి అనేది సమస్య. వీటిలో ఒకదానికి మరోదానికి పోలికలే కాక తేడాలు కూడా ఎక్కువే. రాముడు, కృష్ణుడు, శివుడు ఏ దేవుని పూజించాలి? ఇటువంటి వైరుధ్యాలనేకం ఉన్నాయి. ఇపుడు హిందూత్వవాదులు ఈ భిన్నత్వాలను కలిపి, ఒకేవిధమైన హిందూత్వ భావనను రుద్దటానికి ప్రయత్నం చేస్తున్నారు. హిందువులు చేతకానివారిలా ఉంటున్నారని, మగతనాన్ని పెంచుకోవాలని, శత్రువుల తలలు నరికే శక్తి రావాలని ప్రచారం చేస్తున్నారు. మగతనం రావాలంటే ఒకే దేవుడ్ని నమ్మాలి. అందుకే రాముడ్ని ముందుకు తెస్తున్నారు. కాబట్టి కుహనా లౌకికతత్వం, కుతర్కం హిందూత్వవాదులలోనే ఉంది తప్ప లౌకికవాదులలో లేదు.

### జాతీయవాదం

ఇక మతతత్వానికి జాతీయవాదంతో ఉన్న సంబంధాన్ని పరిశీలించాలి. మతతత్వంతో మాత్రమే అధికారంలోకి రావటం సాధ్యం కాదు. జాతి మొత్తానికి ప్రాతినిధ్యం వహించే సిద్ధాంతంగా జాతీయవాద ముసుగు వేసుకోకపోతే ప్రజలు ఆ పార్టీని నమ్మి ఓట్లు వేసే పరిస్థితి ఉండదు. బి.జె.పి. హిందూత్వశక్తిగానే చలామణి అయితే క్రైస్తవులు, ముస్లింలు దూరంగా ఉంటారు. హిందూత్వను వ్యతిరేకించేవారిని, క్రైస్తవులనైనా, ముస్లీములనైనా హిందూత్వ వ్యతిరేకులుగా ముద్ర వేయగలరు. కాని దేశద్రోహిగా ముద్ర వేయలేరు. జాతీయవాద ముసుగు వేసుకొంటే హిందూత్వను వ్యతిరేకించే వారినందరిని దేశద్రోహులుగా ముద్ర వేయగలరు. అందుకని హిందూమతోన్మాదం జాతీయవాద ముసుగు వేసుకొని ముందుకు వస్తుంది.

హిందువులు ఈ గడ్డమీదే పుట్టారని హిందూత్వవాదులు చెబుతారు. ముస్లింలు బయటి నుండి వచ్చారు. హిందువులు మూల

**❝ హిందూజాతి ఆర్యుల కాలం నుండి వుందని హిందూత్వవాదులు చెబుతారు. కానీ ఆర్యులు మూల వాసులనేది తప్పుడు వాదన. ఆర్యులు బయటి నుండి వచ్చారని చరిత్ర చెబుతున్నది. ఆర్యులు బయటినుండి వచ్చారని అంగీకరిస్తే హిందూత్వవాదులు చెబుతున్న కట్టుకథలు పేకమేడల్లా కుప్పకూలిపోతాయి. అందుకని చరిత్రనే తిరగరాయాలని ప్రయత్నం చేస్తున్నారు. ❞**

వాసులైనపుడు భారతదేశానికి వారసులు హిందువులు. మిగతా వారందరూ వలస వచ్చారు. వలస వచ్చినవారు ఈ జాతిలో కలిసైనాపోవాలి. లేదా ఈజాతికి అణిగి మణిగి అయినా ఉండాలి. హిందువులు మూలవాసులు కాబట్టి హిందూ సంస్కృతి మూల సంస్కృతి. కాబట్టి ఆ సంస్కృతిపై ఆధారపడితేనే జాతి బలోపేతమౌతుంది. అందువలన హిందూ సంస్కృతే జాతీయ సంస్కృతి అని చెబుతారు. కాబట్టి తమది సాంస్కృతిక జాతీయవాదం అని చెబుతారు. సాంస్కృతిక జాతీయవాదమంటే దేశంలోని మైనారిటీలందరూ ద్వితీయశ్రేణి పౌరులుగా ఉండాలి. వారినెప్పుడూ అనుమానంతో చూడాలి. భారతదేశంలో ఉండే దేశద్రోహులు వీరు. ఇస్లాం అంతర్జాతీయ మతం. ముస్లింలు దేశంకన్నా మతానికే ప్రాధాన్యత ఇస్తారు కాబట్టి వీరు దేశద్రోహానికి పూనుకుంటారు. అందువలన వీరందరిని ఐ.యస్.ఐ. ఏజంట్లనే అనుమానంతో చూడాలని చెబుతారు. ముస్లీంలు మతరీత్యా వేరుగా ఉండదలచుకుంటే జాతీయ సంస్కృతిలో మిళితం కావాలి. మిళితం కావటమంటే రాముని జాతీయదేవునిగా అంగీకరించాలి. హిందూ పండుగలన్నింటిలోనూ పాల్గొనాలి.

హిందూజాతి ఆర్యుల కాలం నుండి వుందని హిందూత్వవాదులు చెబుతారు. కానీ ఆర్యులు మూలవాసులనేది తప్పుడు వాదన. ఆర్యులు బయటి నుండి వచ్చారని చరిత్ర చెబుతున్నది. ఆర్యులు బయటినుండి వచ్చారని అంగీకరిస్తే హిందూత్వవాదులు చెబుతున్న కట్టుకథలు పేకమేడల్లా కుప్పకూలిపోతాయి. అందుకని చరిత్రనే తిరగరాయాలని ప్రయత్నం చేస్తున్నారు. హిందూజాతీయవాదం అనాది నుండి ఉన్నదనేది అబద్ధం. హిందూమతమే అనాది నుండి లేదు. క్రైస్తవం, ఇస్లాం కూడా అనాది నుండి లేవు. ఆ రెండు మతాలు మేమిక్కడే పుట్టాం అని చెప్పలేవు. ఇక్కడే పుట్టాం, ఇక్కడే పెరిగాం అని చెప్పుకోకపోతే హిందూత్వవాదులకు భవిష్యత్ లేదు. అందువలన హిందూమతం భారతదేశంలోనే పుట్టిందని నమ్మించటానికి ప్రయత్నిస్తున్నారు. ఇపుడు క్రైస్తవ, ఇస్లాం మతాలలాగా ఒకే గ్రంథం, ఒకే దేవునిపై ఆధారపడే మతాన్ని రూపొందించ టానికి హిందూత్వవాదులు ఒక ప్రయత్నం చేస్తున్నారు.

హిందూమతమనేదాన్ని ఒక మతంగా, ఒకసంస్కృతిగా, ఒక జాతిగా తీసుకురావటం అంత సులభం కాదు. హిందూమతమనేది ఎప్పుడూ ఏక ఖండ మతంగా లేదు. కులవ్యవస్థ రీత్యా, గ్రంథాల రీత్యా, దేవుళ్ళ రీత్యాగానీ ఏకీభావం లేదు. ఏక ఖండ మతంగా తీసుకురావాలంటే చరిత్రను వక్రీకరించటం, అబద్ధాలు రాయటం మినహా మరో మార్గం లేదు. మతతత్వాన్ని ఒక జాతీయ భావంగా ముందుకు తీసుకురావటానికి తీవ్రమైన ఆటం కాలున్నాయి.

సంఘపరివార్ చరిత్రకు సంబంధించి తప్పుడు భావాల్ని ఎక్కించటానికి ప్రయత్నం చేస్తున్నారు. పిల్లలకు ఈ భావాల్ని ఎక్కించటానికి మొదటిది సాధనంగా కుటుంబాన్ని ఎంచుకుంటున్నారు. రెండు స్కూలు, మూడు పండుగలు, నాలుగు స్నేహితులు. ఇటువంటి చోట్ల వారు పాత భావాలను, అలవాట్లను నేర్ప టానికి ప్రయత్నిస్తున్నారు. కుటుంబం మీద కేంద్రీకరణ అంటే ఆడవాళ్ళ మీద కేంద్రీకరణ చేస్తున్నారు. వీరత్వం ఉన్న పురుషులను తయారు చేసేవారు గొప్ప తల్లులని ప్రచారం చస్తున్నారు. వీరత్వం అంటే ముస్లింలను వ్యతిరేకించటం, వారిపై దాడులు చేయటంగా చిత్రీకరిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలు లౌకికవాద కేంద్రాలు కాబట్టి వాటిని బలహీనపరచటానికి ప్రయత్నిస్తున్నారు. పండుగలు ఇంతకు ముందు గృహ కార్యక్రమాలుగా ఉండేవి. ఇప్పుడు పండుగలను, శ్రీరామనవమి, రాఖీ పండుగలాంటి వాటిని బహిరంగ కార్యక్రమాలుగా ప్రోత్సహిస్తున్నారు. దసరా అంటే ఆయుధపూజ కాబట్టి వీరత్వం పెంచటానికని దసరా పండుగను విస్తృతంగా నిర్వహిస్తున్నారు.

అయితే గతంలోలేని స్పందన ఇప్పుడు ఈ కార్యక్రమాలకు రావటానికి కారణం సామాజిక పునాదిలో కొంత మార్పు వచ్చింది. జాతీయోద్యమం ప్రజల మధ్య వైషమ్యాలను తగ్గించి, బ్రిటిష్ వ్యతిరేక పోరాటంలో ఐక్యంగా ముందుకు నడిపింది. ముస్లింలను, దళితులను కూడా కలుపుకొని ముందుకెళ్ళటానికి ప్రయత్నించింది. జాతీయోద్యమ నాయకులు అనేక సందర్భాలలో మతోన్మాదంతో రాజీ పడినప్పటికీ, మతతత్వాన్ని పెంచటం ద్వారా ప్రజలను ఐక్యం చేయలేమనీ, లౌకికవాదాన్ని అనుసరించటం ద్వారానే ప్రజలను ఐక్యం చేయగలమనీ గుర్తించారు. 1967 తర్వాత జాతీయోద్యమ భావజాలం క్రమంగా బలహీనపడింది. జాతీయవాదానికి ప్రధాన ప్రతినిధిగా వున్న కాంగ్రెస్ బలహీనపడి, 1967 ఎన్నికల్లో అనేక రాష్ట్రాలలో ఓడిపోయింది. పాకిస్థాన్‌తో యుద్ధం, కాశ్మీర్‌లో వేర్పాటువాద భావాలు రెచ్చగొట్టటం, ఆర్థిక సంక్షోభాలు, వివిధ రాష్ట్రాలలో వేర్పాటువాద ఉద్యమాలు, రిజర్వేషన్ల కోసం, రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఉద్యమాలు తదితరాలతో ప్రజల మధ్య ఐక్యత బలహీనపడింది. వామపక్షొద్యమాలు బలం పుంజుకోలేని పరిస్థితుల్లో బి.జె.పి జాతీయవాద ప్రతినిధిగా ముందుకు వచ్చింది.

ఎమర్జెన్సీలో జయప్రకాష్ నారాయణ నాయకత్వంలో సాగిన వుద్యమంలో భాగస్వాములు కావటంతో హిందూత్వవాదులకు ప్రజాస్వామ్యశక్తిగా ముద్ర వేసుకొనే అవకాశం వచ్చింది. తర్వాత అయోధ్యను, రాముడ్ని ముందుకు తెచ్చారు. ఈ సమయంలోనే ప్రపంచంలో సోషలిజం దెబ్బతినటం, కమ్యూనిస్టు భావజాలం వెనుకపట్టు పట్టటం వారికి కలిసి వచ్చింది. సరళీకరణ విధానాలు ప్రారంభం అయిన తర్వాత జాతీయవాద భావాలు పూర్తిగా అడుగంటాయి. సామ్రాజ్యవాద వ్యతిరేకత, సోషలిజం పట్ల సానుకూలత తగ్గింది. ఇటువంటి స్థితిలో భారతదేశంలోని పెట్టుబడిదారులకు దేశాన్ని ఏకీకృత మార్కెట్‌గా ఉంచగలిగిన రాజకీయశక్తి కావాల్సి వచ్చింది. హిందూత్వశక్తులు దేశాన్ని ఏకీకృత మార్కెట్‌గా ఉంచి, తమ దోపిడీకి సహకరించగలవని పెట్టుబడిదారులు భావించారు. ఆర్థికంగా అభివృద్ధి చెందిన అగ్రకులాలకు చెందిన మధ్య తరగతి పట్టణాలకు చేరింది. వీరిలో సామ్రాజ్యవాదం పట్ల సానుకూలత పెరిగింది. ఈ విధమైన సానుకూల పరిస్థితుల్లో మతతత్వాన్ని వినియోగించుకొని దేశ, విదేశీ కార్పొరేట్ శక్తుల మద్దతుతో బి.జె.పి. అధికారంలోకి రాగలిగింది.

## హిందూత్వ శక్తులను ఎలా ఎదుర్కోవాలి?

ఇంతకుముందు మనం చర్చించినట్లే హిందూత్వశక్తులను అడ్డుకోగల అంశాలున్నాయి. మొదటి బలహీనత హిందుత్వం కులవ్యవస్థను సమర్థిస్తున్నది. చరిత్రను ఎన్ని వంకర్లు తిప్పినా వాస్తవ చరిత్రను పూడ్చిపెట్టటం సాధ్యంకాదు. కులవ్యవస్థను సమర్థించినంత కాలంలో అన్ని కులాలనూ ఏక ఖండంగా ఐక్యం చెయ్యడం సాధ్యంకాదు. ప్రేమ వివాహాలను వ్యతిరేకిస్తున్నారు. మతాంతర ప్రేమ వివాహాలు జరగకుండా అడ్డుకోవటానికి 'లవ్ జిహాద్' పేరుతో దాడులు చేస్తున్నారు. అయినా ఈనాటి పరిస్థితుల్లో ప్రేమ వివాహాలను అడ్డుకోవటం సాధ్యం కాదు. భారత పాలకవర్గాలు మతతత్వం తమకు ఉపయోగపడుతుందని అధికారానికి తీసుకొచ్చాయి. మతోన్మాదంతో అవసరం తీరిపోయిందనుకుంటే వెంటనే పక్కన పెట్టేస్తారు. ఇటువంటి అంశాలు ఒక దశ దాటిన తర్వాత దానికే ఆటంకంగా తయారౌతాయి. కాబట్టి మనం పట్టుదలగా పోరాటం చేస్తే హిందూ మతోన్మాదశక్తులపై విజయం సాధించగలం.

దేశంలో హిందూ మతోన్మాదం బలహీనపడితే ముస్లిం మతోన్మాదం కూడా బలహీనపడుతుంది. ముస్లింలలోనూ అభివృద్ధికరమైన మార్పులు వస్తున్నాయి. ఆధునిక విద్య కావాలని, అభివృద్ధి కావాలనే కోర్కెలు పెరుగుతున్నాయి. సాంస్కృతిక ఉద్యమాలు ప్రారంభించి, ఉధృతం చేయగలిగితే హిందూ, ముస్లిం మతతత్వాలు బలహీనపడి, ఒకరినొకరు శత్రువులుగా చూయించే స్థితి లేకుండా పోతుంది. ఈ కృషిలో మన ఆలోచనలోనూ, పోరాటంలోనూ ఏవైనా లోపాలుంటే సరిచేసుకోవాలి. మొదటి లోపం ప్రచారం ద్వారా దీన్ని ఓడించటం సాధ్యం అనుకోవడం. ప్రచారానికి వర్గపోరాటాన్ని కూడా తోడు చేయాలి. ప్రస్తుతం సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటాన్ని ఏమాత్రం అశ్రద్ధ చేసినా మతోన్మాదాన్ని ఓడించలేం. మనం టి.డి.పి, సమాజ్‌వాది పార్టీ తదితర పార్టీలతో సర్దుబాట్లు చేసుకోవటంతో సరళీకరణ వ్యతిరేక పోరాటాలలో వెనుకబడ్డాం. ఫలితంగా సరళీకరణ విధానాల అమలు వలన ప్రజలలో వచ్చిన అసంతృప్తిని మతోన్మాదులు వినియోగించుకున్నారు. రెండవ అంశం మనం రాజకీయ పోరాటాన్ని కూడా ఎన్నికల పొత్తులు, సర్దుబాట్లకే పరిమితం చేస్తున్నాం. మతోన్మాదానికి వ్యతిరేకంగా ఒక రాజకీయ ఉద్యమాన్ని మనమే ప్రారంభించాలి. కలిసొచ్చే లౌకికశక్తులన్నింటినీ కలుపుకొని దేశవ్యాపిత ఉద్యమం చేయాలి. మూడవ అంశం సాంస్కృతిక రంగంలో మనం జోక్యం చేసుకోకుండా మతతత్వాన్ని ఓడించటం సాధ్యం కాదు. సంస్కృతి అన్నపుడు అనేక అంశాలు ముందుకొస్తాయి. మాతృస్వామిక సంస్కృతా, పితృస్వామిక సంస్కృతా? శ్రీరాముని సంస్కృతా లేక జాబాలి సంస్కృతా, ద్రోణాచార్య సంస్కృతా లేక ఏకలవ్యుని సంస్కృతా? కులవవ్యవస్థలో, విద్యావ్యవస్థలో, కుటుంబ వ్యవస్థలో మనం సరైన సంస్కృతి కోసం పోరాడాలి. సంస్కృతిలో సానుకూలంగా ఉపయోగపడే అంశాలను ముందుకు తెస్తూ, మతశక్తులు దుర్వినియోగం చేస్తున్న అంశాలపై పోరాడాలి. విదేశీ దురాక్రమణదారులకు సహకరించాడు కాబట్టి జయచంద్రుడ్ని ద్రోహి అంటున్నాం. మరి బహుళజాతి సంస్థల దోపిడీకి సహకరిస్తున్న నీది దేశభక్తా అని మనం ప్రశ్నించాలి. వాళ్ళు సాంస్కృతిక జాతీయ వాదాన్ని ముందుకు తెస్తే మనం సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయవాదాన్ని ముందుకు తేవాలి.

> **"దేశంలో హిందూ మతోన్మాదం బలహీనపడితే ముస్లిం మతోన్మాదం కూడా బలహీనపడుతుంది. ముస్లింలలోనూ అభివృద్ధికరమైన మార్పులు వస్తున్నాయి. ఆధునిక విద్య కావాలి, అభివృద్ధి కావాలి అనే కోర్కెలు పెరుగుతున్నాయి. సాంస్కృతిక ఉద్యమాలు ప్రారంభించి, ఉధృతం చేయగలిగితే హిందూ, ముస్లిం మతతత్వాలు బలహీనపడి, ఒకరినొకరు శత్రువులుగా చూపించే స్థితి లేకుండా పోతుంది."**

మైనారిటీలలో మన కృషిని పెంచాలి. వారినుండే అంతర్గతంగా సంఘ సంస్కరణోద్యమాలు వచ్చేలా ప్రోత్సహించాలి. హిందూ మతంలో వచ్చిన సంస్కరణోద్యమాల స్థాయిలో అక్కడా రావాలి. అలా రాకుండా ముస్లిం మతోన్మాదాన్ని బలహీనపరచటం సాధ్యంకాదు. రెండో అంశం ముస్లింలలో వర్గపోరాటాన్ని కూడా ఉధృతం చేయాలి. వీరిలోనూ వర్గాలున్నాయి. భూస్వాములున్నారు. పెట్టుబడిదారులున్నారు. వారు చాలా దారుణంగా తమ సోదర ముస్లింలను అణచివేస్తుంటారు. తమను మరింతగా దోపిడి చేయటం కోసం హిందువులపై ద్వేషం పెంచుతున్నారని వారు అర్థం చేసుకొనేలా చేయాలి. సేవా కార్యక్రమాలు కూడా పెద్ద ఎత్తున చేయాలి. ట్యూషన్ సెంటర్లు, వృత్తిదారుల నైపుణ్యం పెరిగేలా శిక్షణా కేంద్రాలు పెట్టవచ్చు. చివరి అంశం హిందువులలో అంత గా కాకపోయినా ముస్లింలలోనూ కులవ్యవస్థ ఉంది. ఈ కులాల మధ్య కులాంతర వివాహాలు జరగవు. కులవ్యవస్థ ఉన్నచోట దానికి వ్యతిరేకంగా పోరాడాలి.

ముస్లిం యువకులను ఉగ్రవాదులుగా ముద్ర వేసి వేధించటం ముఖ్యమైన సమస్యగా ఉంది. ఉగ్రవాద కార్యకలాపాలు మధ్యతరగతిలో ముస్లింలపై వ్యతిరేకతను పెంచుతున్నాయి. అమెరికా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడుతుంది కాబట్టి అమెరికాకు సహకరించాలని భావిస్తున్నారు. ముస్లింలలో పేద ముస్లింలకు సహాయం చేయగల నాయకత్వం లేదు. గతంలో కాంగ్రెస్‌పై ఆధారపడి ఉన్నారు. ఇప్పుడు కాంగ్రెస్‌పై నమ్మకం పోయింది. తర్వాత ఆయా రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీల వెనుక చేరారు. ఇపుడు వారిపైనా నమ్మకం కోల్పోయి స్వంతంగా పార్టీలు పెట్టుకుంటున్నారు. ఆ పార్టీలు కూడా ఏమీ చేయలేని పరిస్థితి వచ్చింది. మనం వారిలో పని చేస్తే మనవైపు వచ్చే అవకాశం ఉంది. లేకపోతే గ్రామాలలో దళిత పేటలలాగే పట్టణాలు, గ్రామాలలో ముస్లిం పేటలు ప్రత్యేకంగా ఏర్పడే పరిస్థితి ఉంది. అలా ముస్లిం పేటలు ప్రత్యేకంగా ఏర్పడిన తర్వాత లౌకికవాదం అభివృద్ధి చెందటం సాధ్యం కాదు.

మరో ముఖ్య విషయం, ప్రభుత్వాన్ని మత ప్రయోజనాలకు వినియోగించుకోవటానికి వ్యతిరేకంగా నికరంగా పోరాడాలి. మనం సర్పంచ్‌గా ఉన్నా, మండలాధ్యక్షుడుగా ఉన్నా, యం.పి.టి.సి, జడ్.పి.టి.సి.గా ఉన్నా మతానికీ, రాజ్యానికీ సంబంధం లేకుండా వ్యవహరించాలి. మనల్ని వ్యతిరేకించి చేసుకెళితే వేరే విషయం. కానీ మనంగా రాజీపడరాదు. ఇప్పుడు మనది సగం లౌకిక రాజ్యంగా ఉన్నది. దీన్ని పూర్తి మత రాజ్యంగా మార్చాలని హిందూత్వవాదులు ప్రయత్నం చేస్తున్నారు. మనం పూర్తి లౌకికరాజ్యంగా మార్చాలని పోరాడుతున్నాం. అన్ని స్థాయిల్లో పోరాటం చేయాలి. ఈ అవగాహనతో ముందుకు పోవాలి.

సిపిఐ(ఎం) స్వర్ణోత్సవ ప్రత్యేకం

# భారతదేశంలో వ్యవసాయ సమస్య పరిష్కారానికి సిపిఎం కృషి



రచయిత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) పొలిట్‌బ్యూరో సభ్యులు

**రామచంద్రన్ పిళ్లై**



పెట్టుబడిదారీ విధానాభివృద్ధి, అనంతరం సామ్రాజ్యవాద ప్రపంచీకరణ తరుణంలో వ్యవసాయరంగంలో అనేక మార్పులు జరుగుతున్న క్రమంలో వ్యవసాయ సమస్య పరిష్కారానికి సిపిఎం చేస్తున్న కృషిని గురించి ఈ వ్యాసంలో క్లుప్తంగా వివరిస్తాను. ఈ అంశానికి సంబంధించిన సమగ్ర చర్చను మరో సందర్భంలో చేస్తాను.

వ్యవసాయ సమస్య అనే దానిలో మూడు ముఖ్యమైన అంశాలున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోకి పెట్టుబడిదారీ విధానం ఎంత లోతుగా చొచ్చుకెళ్ళింది, ఎంత విస్తృతంగా చొచ్చుకెళ్ళింది, దాని స్వభావం ఏమిటి అనేది మొదటి అంశం. రెండవ అంశం, వ్యవసాయ రంగంలో పెట్టుబడిదారీ విధానాభివృద్ధి వలన రూపొందుతున్న వర్గాలు, వాటి స్వభావానికి సంబంధించినది. వ్యవసాయ సమస్య పరిష్కారానికి సాగించే వర్గ పోరాటంలో ఏ వర్గాలను, ఏవిధంగా, ఏ విధానాల ద్వారా ఐక్యం చేసి పోరాటాలలోకి సమీకరించాలనేది మూడవ అంశం. వ్యవసాయ సమస్య పరిష్కారం అంటే వ్యవసాయరంగంలో ఉత్పత్తి సంబంధాలను, గ్రామీణ ప్రాంతంలోని సామాజిక, ఆర్థిక సంబంధాలను కూడా అభ్యుదయం వైపుకు మార్చటం జరగాలి. కాబట్టి వ్యవసాయ సమస్య అంటే దానిలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి అవుతున్న ప్రత్యేక పరిస్థితులు, వర్గాలు రూపు దిద్దుకోవటం, వర్గ సంఘటన, వర్గ పోరాటం కలిసి వుంటాయి.

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) గత 50 సంవత్సరాలలో వ్యవసాయ సమస్యకు సంబంధించిన వివిధ అంశాలను పరిశీలించటానికి ఏడుసార్లు ముఖ్యమైన ప్రయత్నాలు చేసింది. అవి 1964 పార్టీ కార్యక్రమం, 1987 వ్యవసాయ రంగంలో కర్తవ్యాలపై కేంద్రకమిటీ తీర్మానం, 1973లో 'కొన్ని వ్యవసాయ సమస్యలపై కేంద్రకమిటీ తీర్మానం', 1976లో 'సిపిఐ (ఎం) విధాన ప్రకటన, సమస్యలు' కేంద్రకమిటీ తీర్మానం, 'వ్యవసాయ రంగంలో కృషిపై సమీక్ష, భవిష్యత్ కర్తవ్యాలు,' 1993లో కేంద్ర కమిటీ తీర్మానం, 2000 సం॥లో పునర్వీకరించిన పార్టీ కార్యక్రమం, 'రైతు, వ్యవసాయ కార్మిక రంగాలలో కృషిపై సమీక్ష, భవిష్యత్ కర్తవ్యాలు' 2003లో కేంద్రకమిటీ ఆమోదించిన తీర్మానం.

భారతదేశ ప్రజల ముందు వ్యవసాయ సమస్య అత్యంత ప్రాధాన్యతగల జాతీయ సమస్యగా వుందని సిపిఐ (ఎం) భావిస్తున్నది. దేశంలో ఇతర రంగాలకన్నా వ్యవసాయ సమస్యను అభ్యుదయ, ప్రజాస్వామిక దృక్పథంతో అర్థం చేసుకోవటం, పరిష్కరించటంలో విఫలం కావటం బూర్జువా-భూస్వామ్యవర్గాల పాలన యొక్క దివాళాకోరుతనాన్ని స్పష్టం చేస్తున్నదని పార్టీ దృఢంగా భావిస్తున్నది.

1964లో ఆమోదించిన పార్టీ కార్యక్రమం భారతదేశ వ్యవసాయ రంగంలో జరిగిన ప్రత్యేక తరహా పెట్టుబడిదారీ అభివృద్ధిని పరిశీలించి, దిగువ నిర్ణయాలకు వచ్చింది. "భారతదేశంలో పెట్టుబడిదారీ అభివృద్ధి పశ్చిమ యూరప్, ఇతర అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల్లో జరిగిన అభివృద్ధిలాంటిది కాదు. పెట్టుబడిదారీ మార్గంలో అభివృద్ధి చెందుతున్నప్పటికీ, భారత సమాజంలో ఇప్పటికీ పెట్టుబడిదారీ పూర్వ సమాజానికి చెందిన అవశేషాలు బలంగా వున్నాయి. అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల్లో అభివృద్ధి అవుతున్న బూర్జువా వర్గం కూల్చివేసిన పెట్టుబడిదారీ పూర్వ సమాజ అవశేషాలపై పెట్టుబడిదారీ విధానాన్ని నిర్మించినట్లు కాకుండా భారతదేశంలో పెట్టుబడిదారీ పూర్వ సమాజంపై పెట్టుబడిదారీ విధానాన్ని పైనుండి రుద్దారు. దేశాన్ని శతాబ్దానికి పైగా పరిపాలించిన బ్రిటీష్ వలస పాలకులుగాని, 1947లో అధికారంలోకొచ్చిన భారత బూర్జువా వర్గంగాని పెట్టుబడిదారీ పూర్వ సమాజంపై చావుదెబ్బ కొట్టలేదు. పెట్టుబడిదారీ పూర్వ

**“1964లో ఆమోదించిన పార్టీ కార్యక్రమంలో... రైతుల ప్రయోజనాలకోసం తీవ్రమైన వ్యవసాయ సంస్కరణలు చేసి,వ్యవసాయరంగంలో ఉత్పత్తి శక్తులకు ఆటంకంగా వున్న ఫ్యూడల్, అర్థ ఫ్యూడల్ సంబంధాలను పూర్తిగా రద్దుచేయటం మొట్టమొదటి, అతి ముఖ్యమైన కర్తవ్యమని చెప్పింది.”**

సమాజాన్ని నాశనం చేస్తేనే పెట్టుబడిదారీ విధానం స్వేచ్ఛగా అభివృద్ధి చెందుతుంది. ఆ తరువాత దాన్ని తొలగించి,ఆస్థానంలో సోషలిస్టు సమాజం వస్తుంది. కాబట్టి ప్రస్తుత భారత సమాజం గుత్త పెట్టుబడిదారుల ఆధిపత్యాన గల కుల, మత, ఆదివాసీ సంస్థలతో కూడి వుంది. కాబట్టి పెట్టుబడిదారీ పూర్వ సామాజిక వ్యవస్థను కూల్చివేయటంలో ఆసక్తి వున్న విప్లవ శక్తులన్నింటినీ సమీకరించి, ప్రజాస్వామిక విప్లవాన్ని త్వరితంగా పూర్తిచేసి, సోషలిజానికి మార్గాన్ని సుగమం చేయాల్సిన కర్తవ్యం కార్మికవర్గం, కార్మికవర్గ పార్టీ అయిన కమ్యూనిస్టుపార్టీపై పడింది.

1964లో ఆమోదించిన పార్టీ కార్యక్రమంలో రైతుల ప్రయోజనాలకోసం తీవ్రమైన వ్యవసాయ సంస్కరణలు చేసి,వ్యవసాయరంగంలో ఉత్పత్తి శక్తులకు ఆటంకంగా వున్న ఫ్యూడల్, అర్థ ఫ్యూడల్ సంబంధాలను పూర్తిగా రద్దు చేయటం మొట్టమొదటి, అతి ముఖ్యమైన కర్తవ్యమని చెప్పింది. దీనితోపాటుగా గ్రామాలను వెనుకబాటుతనంలో ఉంచుతున్న పెట్టుబడిదారీ పూర్వ సామాజిక సంబంధాలైన కులం, ఇతర వ్యవస్థల్ని, సమాజాన్ని పూర్తిగా సంస్కరించే చర్యలు కూడా దీనికనుగుణంగా తీసుకోవాలి. సామ్రాజ్యవాద వ్యతిరేక, గుత్త పెట్టుబడిదారీ వ్యతిరేక కర్తవ్యాల్ని పూర్తి చేయాల్సిన అవసరాన్ని కూడా కార్యక్రమం చెప్పింది.

వ్యవసాయ సమస్య పరిష్కారానికి సమీకరించవలసిన వర్గాలు, తరగతుల్ని గురించి కూడా కార్యక్రమం చెప్పింది. పెట్టుబడిదారీ విధానం లోతుగా చొచ్చుకుపోవటం వలన రైతాంగం ఒకేవర్గంగా లేరు. రైతాంగంలో వర్గ విభజన జరిగింది. వ్యవసాయ సమస్య పరిష్కారంలో రైతాంగంలోని వివిధ వర్గాలు వివిధ పాత్రలు నిర్వహిస్తాయి. గ్రామీణ ప్రాంతంలో 70 శాతం వున్న వ్యవసాయ కార్మికులు, పేద రైతులు కార్మికవర్గానికి అత్యంత నమ్మకమైన మిత్రులుగా వుంటారు. మధ్య తరగతి రైతులు నమ్మకమైన మిత్రులుగా వుంటారు. వివిధ కారణాల వలన ధనిక రైతుల్ని కూడా ప్రజాతంత్ర సంఘటనలోకి తీసుకొచ్చి, జనతా ప్రజాతంత్ర సంఘటనలో మిత్రులుగా ఉంచుకోవచ్చు.

పార్టీ కార్యక్రమం ఆధారంగా కేంద్రకమిటీ 1967లో 'వ్యవసాయరంగంలో కర్తవ్యాలు' డాక్యుమెంటును రూపొందించింది. ఇందులో రైతు ఉద్యమంలో నిర్వహించాల్సి కర్తవ్యాల్ని గురించి చెప్పింది. ఉమ్మడి పార్టీ నుండి సంక్రమించిన, పార్టీలో బలంగా పాతుకుపోయిన తీవ్రమైన సంస్కరణవాద అవగాహనను కేంద్రకమిటీ తీర్మానం ఎత్తిచూపింది. వ్యవసాయ సమస్యపై మితవాద దృక్పథం అనేక విధాలుగా వ్యక్తమౌతున్నది. వ్యవసాయ పరిస్థితిని అవగాహన చేసుకొని, ప్రత్యేకాంశాలైన ఫ్యూడల్ దోపిడీ, రైతులలో జరుగుతున్న వర్గ విభజన, వ్యవసాయ రంగంలో పెట్టుబడిదారీ విధానం చొచ్చుకొనిపోవటం, దాని స్వభావం, విస్తరణ తదితరాలను అర్థం చేసుకొని, సరైన నినాదాలను రూపొందించటం జరగలేదు. పొరపాటు అవగాహన వలన ఫ్యూడల్ వ్యతిరేక పోరాటంలో గ్రామీణ కార్మికులు, పాక్షిక కార్మికులు నిర్వహించగల విప్లవకర పాత్రను తక్కువచేసి, మధ్యతరగతి, ధనిక రైతులకు అధిక ప్రాధాన్యం ఇవ్వటం జరిగింది. వ్యవసాయ కార్మికులు, పేద రైతుల ప్రత్యేక సమస్యలను తీసుకొని ఉద్యమించటంలో అయిష్టతను చూపింది. సకల రైతాంగ ఐక్యత అనే సరైన భావాన్ని వక్రీకరించి, వ్యవసాయ కార్మికులు, పేద రైతాంగం కేంద్రంగా రైతాంగాన్ని ఐక్యం చేయటానికి బదులుగా, మధ్యతరగతి,ధనికరైతాంగం కేంద్రంగా రైతాంగాన్ని ఐక్యంచేయటానికి ప్రయత్నించింది. రైతురంగంలో జరగవలసిన కృషికి సరైన వర్గ దృక్పధాన్ని కల్పించటంలో విఫలం కావటాన్ని కేంద్రకమిటీ తీర్మానం తీవ్రంగా విమర్శించి, ఆ లోపాల్ని సరిదిద్దుకోవటానికి నిర్దిష్టమైన మార్గదర్శకాలను రూపొందించింది.

కొన్ని ప్రశ్నలకు సంబంధించి అభిప్రాయ భేదాలు తలెత్తాయి. 1. భూ సీలింగ్ పరిమితి 2. వ్యవసాయం చేయని రైతులు. ముఖ్యంగా చిన్న రైతులు, వారి భూముల్లో చట్టబద్ధ హక్కులు లేని కౌలు రైతుల హక్కుల గురించి. 3. భూమి, వేతనాలకు సంబంధించిన వ్యవసాయ కార్మికులు చేసే పోరాటాలకు సంబంధించిన అంశాలు. 4. ట్రాక్టర్లు, ఇతర యంత్రాలను వ్యవసాయంలో ప్రవేశపెట్టటంపై రైతాంగ ఉద్యమం ఏ దృక్పథంతో వ్యవహరించాలి. 5. రైతుల ఉత్పత్తులకు న్యాయమైన ధరలను ఏ ప్రాతిపదికపై నిర్ణయించాలి. 6. భూ సంస్కరణ చట్టాలు, తక్షణ నిర్దిష్ట సమస్యలపై చేసే ప్రజాపోరాటాలకు,పార్టీ కార్యక్రమంలో పొందుపరచబడి,ప్రస్తుతదశలో ప్రచారనినాదాలుగా ఉన్నవాటిమధ్య ఎలాంటి సంబంధాలుండాలనే అంశాలు 1960వ దశాబ్దం చివరిలో పార్టీలో చర్చకు వచ్చాయి.

1973లో ముజఫర్‌పూర్‌లో సమావేశమైన కేంద్రకమిటీ ఈ సమస్యలను పరిష్కారం చేయటానికి ప్రయత్నం చేసి, కొన్ని వ్యవసాయ సమస్యలపై తీర్మానాన్ని ఆమోదించింది. వ్యవసాయ రంగంలో ఎదురౌతున్న సమస్యలను పరిష్కారం చేసుకొని ముందుకు పోవటానికి ఈ తీర్మానం ఉపయోగపడలేదు. కేంద్రకమిటీ తీర్మానం ఈ విభేదాలను పరిష్కారంచేయకపోగా, వామపక్ష, అతివాదానికి దారితీసి, సమస్యలను మరింత తీవ్రం చేసింది. ఈ కేంద్ర కమిటీ తీర్మానం భూస్వామ్య విధానం రద్దు, భూ పంపకాలను తక్షణ సమస్యలుగా ముందుకు తీసుకు వచ్చింది. రైతాంగ ఐక్యతను నిర్మించటానికి రైతాంగం ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యలను తీసుకొని వ్యవసాయ కార్మికులు, పేద రైతులు కేంద్రంగా రైతాంగ ఐక్యతను నిర్మించటానికి ప్రాధాన్యతనివ్వటంలో ఆ తీర్మానం విఫలమైంది. 1973 నవంబర్‌లో కలకత్తాలో జరిగిన కేంద్రకమిటీ సమావేశంలో ఈ అంశాలు చర్చకు వచ్చాయి. కొన్ని వ్యవసాయ సమస్యలపై తీర్మానానికి కొన్ని సవరణలు చేశాం.

1976లో కేంద్రకమిటీఆమోదించిన తీర్మానం పార్టీలో కొనసాగుతున్న ఈ పొరపాటు అవగాహనలను చాలావరకు సరిదిద్దింది. గ్రామీణ ప్రాంతంలో పెరుగుతున్న పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాల్ని, ఫలితంగా రైతాంగంలో జరుగుతున్న వర్గ విభజనను సమీక్షించింది. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొస్తున్న వ్యవసాయ సంస్కరణల ఫలితాల్ని కూడా సమీక్షించింది.

> **❝ 2000 సంవత్సరంలో ఆధునీకరించబడిన పార్టీ కార్యక్రమంలో వ్యవసాయరంగంలో పెరుగుతున్న పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలు, సామ్రాజ్యవాదం ముందుకు తెస్తున్న ప్రపంచీకరణ, సరళీకరణ విధానాలను, గ్రామీణ ప్రాంతంలో రూపొందుతున్న వర్గ వైరుధ్యాల గురించి చర్చించింది. ❞**

వ్యవసాయరంగంపై ప్రభావం చూయిస్తున్న వ్యవస్థాగత మార్పుల్ని పరిగణనలోకి తీసుకొని, మన సంఘం యొక్క నిర్మాణశక్తిని, రైతాంగ చైతన్యాన్ని, వారిలో ఐక్యతా స్థాయిని పరిగణనలోకి తీసుకొని, భూస్వామ్య విధానాన్ని సంపూర్ణంగా రద్దుచేయటం, వ్యవసాయ కార్మికులకు, పేద రైతులకు భూమిని ఉచితంగా పంచిపెట్టటం అనేవి ప్రచార నినాదాలుగా వుంటాయని చెప్పింది. ప్రభుత్వ బీడు భూములు, అటవీ భూములు, సీలింగ్ చట్టాలననుసరించి మిగులు భూముల కోసం పోరాటాలు చేస్తూనే వ్యవసాయకార్మికులు, గ్రామీణ కార్మికులకు కూలిరేట్లు పెంపుదల, కౌలురేట్ల తగ్గింపు, రైతాంగ రుణాల్ని రద్దుచేయటం లేదా రుణభారం తగ్గించటం, వ్యవసాయోత్పత్తులకు న్యాయమైన ధరలు, పన్నుల భారం తగ్గింపు, పోలీసు జులుంకు అవినీతికి వ్యతిరేకంగా తదితర సమస్యలన్నింటినీ కలిపి, పెద్ద వ్యవసాయోద్యమ ప్రవాహంగా రూపొందించాలి. గరిష్ట రైతాంగ ఐక్యతను సాధించటానికి, కొద్దిమందిగా ఉన్న భూస్వాముల్ని, వారి కిరాయి మూకల్ని ఓడించటానికి ఇది అవసరం అని చెప్పింది.

సానుకూలమైన పరిస్థితులున్నా, వ్యవసాయ కార్మిక, రైతాంగ ఉద్యమాలు బలహీనంగా ఉండటం దేశంలో ప్రజాస్వామిక ఉద్యమం బలహీనంగా ఉండటానికి ఒక ప్రధాన కారణమని 1993లో కేంద్రకమిటీ చేసిన తీర్మానం పునరుద్ఘాటించింది. ఈ బలహీనతలను అధిగమించకుండా పార్టీ పెరుగుదలకు సానుకూల పరిస్థితులను సృష్టించటం సాధ్యం కాదని చెప్పింది. గరిష్ట రైతాంగ ఐక్యతను సాధించటానికి వ్యవసాయ కార్మికులు, పేద రైతులు కేంద్రంగా రైతాంగ ఐక్యతను సాధించటానికి కృషి చేయాలని కూడా కేంద్రకమిటీ తీర్మానం చెప్పింది. రైతాంగానికి ఎదురవుతున్న విభిన్న సమస్యలైన భూమి, భూమికి సంబంధించిన సమస్యలు, వ్యవసాయ కార్మికుల కూలిరేట్లు, సామాజిక రక్షణ చర్యలు, సాగునీరు, విద్యుచ్ఛక్తి, శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం, మౌలిక సదుపాయాలు, తక్కువ వడ్డీకి రుణాలు, మార్కెట్ శక్తులనుండి రక్షణ, వ్యవసాయోత్పత్తులకు గిట్టుబాటు ధరలు, ప్రజాపంపిణీ వ్యవస్థ, ప్రభుత్వ విద్య, ప్రభుత్వ వైద్యం, ప్రభుత్వ పాలనలో అవినీతి, సామాజిక అత్యాచారాలు, సహకార సంస్థల్ని అభివృద్ధి చేయటం, పంచాయతీ సంస్థలను బలపర్చటం, పాల ఉత్పత్తిని అభివృద్ధి చేయటం, పర్యావరణం తదితర సమస్యలన్నింటిపై రైతాంగ ఉద్యమం కృషి చేయాలని చెప్పింది. పెరుగుతున్న పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలపైనా, ఫలితంగా రైతాంగంలో పెరుగుతున్న వర్గ విభజనపైనా కేంద్ర కమిటీ తీర్మానం తీవ్రంగా చర్చించి, అంచనా వేయటానికి ప్రయత్నం చేసింది. భారతదేశంలో వివిధ ప్రాంతాల్లో పరిస్థితులు విభిన్నంగా వున్నాయని, సమస్యలను తీసుకోవటం, డిమాండ్లను రూపొందించటంలో ఈ వైవిధ్యాన్ని పరిగణనలోకి తీసుకొని ఉద్యమాన్ని నిర్మించటానికి, విస్తరించటానికి కృషి చేయాలనే నిర్ణయానికి వచ్చింది. పెట్టుబడిదారీ విధాన పెరుగుదల, ఉత్పత్తి సంబంధాల స్వభావం, అర్ధ భూస్వామ్య సంబంధాల ఆధిపత్యం, భూ సంస్కరణల చట్టాల అమలు, చారిత్రక పరిస్థితులు, ఇతర అంశాల్ని పరిగణనలోకి తీసుకొని, దేశాన్ని మూడు విభాగాలుగా విభజించాలని చెప్పింది. ఈ తీర్మానం నయా సరళీకరణ ఆర్థిక విధానాల వలన ఎదురౌతున్న సమస్యలను గుర్తించి, వ్యవసాయ కార్మికులను, రైతులను బహుళజాతి సంస్థలకు, సామ్రాజ్యవాద ఒత్తిడులకు, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సమీకరించాలని చెప్పింది.

2000 సంవత్సరంలో ఆధునీకరించబడిన పార్టీ కార్యక్రమంలో వ్యవసాయరంగంలో పెరుగుతున్న పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలు, సామ్రాజ్యవాదం ముందుకు తెస్తున్న ప్రపంచీకరణ, సరళీకరణ విధానాలను, గ్రామీణ ప్రాంతంలో రూపొందుతున్న వర్గ వైరుధ్యాల గురించి చర్చించింది. వ్యవసాయంలో పెరుగుతున్న పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలు అఖిలభారతస్థాయిలో ఒక ప్రధానాంశంగా ఉందని, పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాల పెరుగుదల, ఉత్పత్తి మారకాలలో ప్రాంతీయ, ఉప ప్రాంతీయ వైవిధ్యాలు, అసమానతలున్నాయని పార్టీ కార్యక్రమం చెప్పింది. వ్యవసాయంలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి అయి, వ్యవసాయసరుకుల వాణిజ్యం, డబ్బు మారకం గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ఆధిపత్యం వహిస్తున్న ప్రాంతాలున్నాయి. పాత పద్ధతుల్లో భూస్వామ్య వ్యవస్థ, కౌలుదారీ విధానం, కాలం చెల్లిన పురాతన శ్రమదోపిడీ, కట్టుబానిసత్వం, శ్రామికులను అణచివేయటం తదితరాలు వ్యవసాయ సంబంధాలలో ముఖ్యమైన పాత్ర వహిస్తున్న ప్రాంతాలు కూడా వున్నాయి. కుల విభజన, కుల అణచివేత, మహిళలపై దారుణమైన అణచివేత, పేదలను వడ్డీవ్యాపారులు, వ్యాపార పెట్టుబడి దోపిడీ

## 'మార్క్సిస్టు' పై
## మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తు న్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక

ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

చేయటం దేశవ్యాపితంగా కొనసాగుతున్నాయి. వ్యవసాయంలో పాత ఉత్పత్తి సంబంధాల్ని నాశనం చేయకుండానే పెట్టుబడిదారీ పూర్వ ఉత్పత్తి సంబధాలు, సామాజిక నిర్మాణంపై పెట్టుబడిదారీ విధానం రుద్దబడి అభివృద్ధి అవుతున్నదని పార్టీ కార్యక్రమం పునరుద్ఘాటించింది. ఆధునికత,అభివృద్ధి పాత సంబంధాలు కొనసాగకుండా నిరోధించలేదు.

భూస్వాములు, ధనిక రైతులు, కాంట్రాక్టర్లు, బడా వ్యాపారులు, ధనికులు శక్తివంతమైన ముఠాలుగా ఏర్పడుతున్నారని పార్టీ కార్యక్రమం చెప్పింది. వామపక్షాలు ఆధిక్యంలో వున్న రాష్ట్రాలలో మినహా మిగతా రాష్ట్రాలలో వారు పంచాయతీ సంస్థల్ని, సహకార సంఘాలు, గ్రామీణ బ్యాంకులు, రుణాలిచ్చే సంస్థలపై ఆధిపత్యం చెలాయిస్తున్నారు. గ్రామాలలో బూర్జువా–భూస్వామ్య పార్టీలకు వారే నాయకత్వం వహిస్తున్నారు. వారు సంపాదించిన అదనపు ధనాన్ని వడ్డీ వ్యాపారం, రియల్ ఎస్టేట్, అధిక లాభాలు సంపాదించటం కోసం వివిధ రకాల వ్యాపారాలు, వ్యవసాయాధారిత పరిశ్రమల్లో పెట్టుబడులు పెడుతున్నారు. వారు తమకు మద్దతు సమీకరించుకోవటానికి, గ్రామీణ పేదలు తమకు అణిగిమణికి వుండేలా భయభ్రాంతుల్ని చేయటానికి కులసంబంధాల్ని ఉపయోగించుకుంటున్నారు.

గ్రామీణ ఆర్థికవ్యవస్థ వేగంగా వాణిజ్యీకరణ కావటం గురించి కూడా పార్టీ కార్యక్రమంలో చెప్పబడింది. ఆహారధాన్యాలు, వ్యవసాయ సరుకులకు మార్కెట్ విపరీతంగా పెరిగింది. వ్యవసాయ ఉత్పత్తులపై గుత్త వ్యాపారుల పట్టు మరింత పెరిగింది. ప్రపంచ మార్కెట్‌పై పట్టు కలిగి వున్న బహుళజాతి సంస్థలు వ్యవసాయ ఉత్పత్తుల ధరలను అదుపు చేస్తున్నాయి. వ్యవసాయోత్పత్తుల ధరలలో తీవ్రమైన ఒడిదుడుకులు, ఇతర రంగాలతో పోల్చినప్పుడు వాణిజ్య విధానాలు వ్యవసాయానికి ప్రతికూలంగా వుండటం రైతాంగాన్ని దోపిడీ చేయటాన్ని తీవ్రం చేస్తున్నాయి.

వ్యవసాయంలో పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలు పెరగటం, సామ్రాజ్యవాద ప్రపంచీకరణ, సరళీకరణల ప్రభావాల వలన రైతాంగంలో పెరుగుతున్న వర్గ విభజనను పరిగణనలోకి తీసుకున్న తర్వాత, రెండు ముఖ్యమైన వైరుధ్యాలు ముందుకొస్తున్నాయని పార్టీ కార్యక్రమం చెప్పింది. మొదటిది భూస్వాములు, పెట్టుబడిదారీ రైతులు, ధనిక రైతులు, వారి మిత్రులు కలిసిన గ్రామీణ ధనికులు ఒకవైపు,

**❝ గ్రామీణ ఆర్థికవ్యవస్థ వేగంగా వాణిజ్యీకరణ కావటం గురించి కూడా పార్టీ కార్యక్రమంలో చెప్పబడింది. ఆహారధాన్యాలు, వ్యవసాయ సరుకులకు మార్కెట్ విపరీతంగా పెరిగింది. వ్యవసాయ ఉత్పత్తులపై గుత్త వ్యాపారుల పట్టు మరింత పెరిగింది. ప్రపంచ మార్కెట్‌పై పట్టు కలిగి వున్న బహుళజాతి సంస్థలు వ్యవసాయ ఉత్పత్తుల ధరలను అదుపు చేస్తున్నాయి. వాణిజ్య విధానాలు వ్యవసాయానికి ప్రతికూలంగా వుండటం రైతాంగాన్ని దోపిడీ చేయటాన్ని తీవ్రం చేస్తున్నాయి. ❞**



గ్రామీణ సమస్యలపై నిర్విరామ కృషి: సిపిఎం నల్గొండ జిల్లా కార్యదర్శి నంద్యాల నర్సింహారెడ్డి ప్రభృతులు

రెండోవైపున ప్రధానంగా వ్యవసాయ కార్మికులు, పేద రైతులు, చేతివృత్తుల వారు కలిసిన రైతాంగ సమూహం మధ్య తీవ్రమైన విభజన ఏర్పడుతున్నది. రెండవది సామ్రాజ్యవాద ప్రపంచీకరణ, ప్రభుత్వం అమలు చేస్తున్న సరళీకరణ విధానాలకు రైతాంగం నుండే కాకుండా, ధనికులలోని కొన్ని తరగతుల నుండి కూడా వ్యతిరేకత పెరుగుతున్నది.

2003లో కేంద్రకమిటీ తీర్మానం రైతు, వ్యవసాయ కార్మిక రంగాలలో కృషిని పార్టీ కార్యక్రమంలో పేర్కొన్న మార్పుల ఆధా రంగా సమీక్షించి, భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించింది. భవిష్యత్‌లో ప్రజాతంత్ర ఉద్యమం, పార్టీ అభివృద్ధి రైతు, వ్యవసాయ కార్మికరంగాలలో పనిలోని లోపాలను, పొర పాట్లను, ఎంత త్వరగా శక్తివంతంగా అధిగమించగలం అనే దానిపై ఆధారపడి వుంటుందని చెప్పింది. వ్యవసాయ రంగంలో పెరుగుతున్న సంక్షోభాన్ని ఎదుర్కోవటానికి, వ్యవసాయ విప్లవాన్ని జయప్రదం చేయాలనే కర్తవ్యాన్ని నిర్వహించటానికి వ్యవసాయ కార్మికుల్ని, రైతుల్ని ఎంత త్వరగా, శక్తివంతంగా నిర్మాణంలోకి తీసుకురాగలమనే దానిపైన ఉద్యమ అభివృద్ధి ఆధారపడి వుంటుంది. ఈ కర్తవ్యాల్ని నిర్వహించటంలో విఫలమైతే వ్యవసాయరంగంలో పెరుగుతున్న అసంతృప్తిని విచ్ఛిన్నమార్గాలలోకి మళ్ళించే అవకాశం, కుల, మత, విచ్ఛిన్నకరశక్తులకు వస్తుంది. అందువల్ల వ్యవసాయ కార్మికులు, రైతుల కష్టాలు, బాధలు మరింత పెరుగుతాయని కూడా చెప్పింది. వ్యవసాయ సంక్షోభం తీవ్రం కావటం, శక్తివంతమైన రైతాంగ ఉద్యమాన్ని నిర్మించటానికి మరిన్ని అవకాశాల్ని కల్పిస్తున్నది.

2014 జూన్‌లో జరిగిన కేంద్రకమిటీ సమావేశం నయా సరళీకరణ విధానాలు వివిధ వర్గాలపై చూయిస్తున్న ప్రభావం, ఆ వర్గాలలో వస్తున్న వర్గవ్యత్యాసాల్ని పరిశీలించాలని నిర్ణయించింది. ఇందుకోసం పొలిట్‌బ్యూరో, కేంద్ర కమిటీ సభ్యులు, ఈ రంగంలో నిపుణులతో కూడిన స్టడీ గ్రూపును ఏర్పాటు చేసింది. స్టడీ గ్రూపు రిపోర్టును కేంద్రకమిటీకి అందజేసింది. కేంద్రకమిటీ ఆ రిపోర్టును చర్చించి, తగిన నిర్ధారణలకు వస్తుంది.

**(అనువాదం : ఎ. కోటిరెడ్డి)**

సమకాలీనం

# టిఆర్‌ఎస్ ప్రభుత్వ విధానాలెటువైపు?



రచయిత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కేంద్ర కమిటీ సభ్యులు, ప్రజాశక్తి తెలంగాణా సంపాదకులు

**ఎస్. వీరయ్య**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఆరు మాసాలు గడిచింది. ఎన్నికలకు ముందు టిఆర్ఎస్ అనేక వాగ్దానాలు చేసింది. అధికారంలోకి వచ్చిన తర్వాత భారీ పథకాలనే ప్రకటించింది. ప్రజల్లో ఆశలూ పెరిగాయి. ఈ ప్రభుత్వం మాట నిలబెట్టుకుంటుందా? ఎన్నికలకు ముందు కాంగ్రెస్, బిజేపీలకు వ్యతిరేకంగా స్పష్టమైన రాజకీయ వైఖరి తీసుకున్నది. ఈ సూత్రబద్ధమైన వైఖరి కొనసాగిస్తుందా? కాంగ్రెస్ విధానాలతో విసుగెత్తిన జనం టిఆర్‌ఎస్‌కు పట్టం గట్టారు. గత ప్రభుత్వ విధానాలతో టిఆర్‌ఎస్ ప్రభుత్వం విడగొట్టుకుంటుందా? ఇవన్నీ ప్రజలు పరిశీలిస్తున్నారు. ఈ ఆరుమాసాల అనుభవాలతో ప్రజలకు అనుమానాలు కలుగుతున్నాయి.

ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రకటించింది. వృద్ధాప్య, వికలాంగుల పెన్షన్ల మొత్తం పెంచింది. దళితులు, గిరిజనులకు మూడెరకాల సాగుభూమి కొనుగోలు చేసైనా ఇస్తామని ప్రకటించింది. కుటుంబ సభ్యుల సంఖ్యతో నిమిత్తం లేకుండా ఒక్కొక్కరికి 6 కిలోల బియ్యం ఇస్తామని ప్రకటించింది. మంచినీటి సమస్య పరిష్కారానికి తాగునీటి గ్రిడ్ ప్రకటించింది. ఇవన్నీ మంచివే. కానీ, అనేక మంది అర్హులకు పెన్షన్లు అందడం లేదని వృద్ధులు, వికలాంగులు ఆందోళన చెందుతున్నారు. జాబితాలో పేర్లు లేవని అక్కడికక్కడే కొందరు చనిపోతున్నారు. ఎస్సీ, ఎస్టీలకు భూమి పంపకం మొదటిరోజుతోనే ఆగిపోయింది. కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ ఇంకా ఆచరణ రూపు దాల్చలేదు. బీడీ కార్మికులకు రు.1000 భృతి వాగ్దానం చేసి వున్నారు. బీడీ కార్మికులు ఉన్న 40 నియోజకవర్గాల్లో 25 స్థానాలు టిఆర్ఎస్ గెలుపొందింది. అయినా వాగ్దానం అమలు జరగలేదు. మరోవైపు హుస్సేన్‌సాగర్‌ను మంచినీటి సరస్సుగా మారుస్తామని, దాని చుట్టూ 100 ఎకరాల్లో ఆకాశహర్మ్యాలు నిర్మిస్తామని ప్రకటించారు. రు.100 కోట్ల నిధులు కూడా కేటాయించారు. ఎంత ఖర్చు పెట్టయినా మెట్రో అలైన్‌మెంట్ మారుస్తామన్నారు. ఎల్ & టీ యాజమాన్యాన్ని కూడా ఒప్పించారు. స్కైవేలు, ఎక్స్‌ప్రెస్ హైవేలు, మల్టీలేయర్ ఫ్లైవోవర్లు, ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్ హైవేలు నిర్మిస్తామని ప్రకటించారు. ఈ అభివృద్ధి నమూనా ఇప్పుడవసరమా? ఇది ఎవరి ప్రయోజనాలకోసం? విమానాల్లో ప్రయాణించేవారికోసమా? కూడూ, గుడ్డాలేని పేదలకోసమా? ప్రజా సమస్యల మీద స్పందన కూడా ఆశాజనకంగా లేదు. రైతుల ఆత్మహత్యల విషయంలో బాధ్యతగా వ్యవహరించలేదు. ఐకెపీ, వివోఏలతో మంత్రి స్పందన బాధ్యతగా లేదు. వేలాది మంది వివిధ రంగాలకు చెందిన కార్మికులు శాసనసభా సమావేశాల సందర్భంగా ఆందోళనలు చేసినా వారి వైపు చూసిన నాథుడు లేడు. జిల్లాల నుండి ఆందోళనకు వచ్చేవారిని అనేక చోట్ల పోలీసులు అడ్డుకున్నారు. పెద్దపెద్ద పారిశ్రామికవేత్తలతో సంప్రదింపుల్లో ముఖ్యమంత్రి బిజీగా ఉన్నారు. సత్యానాదెండ్ల దగ్గర నుండి, టాటా, బిర్లా, అంబానీ, అదానీల వరకు అడిగిందేతడవుగా సమయం కేటాయించారు. అడగకున్నా రాయితీలు ప్రకటిస్తున్నారు. కార్మికుల సమస్యలు, హక్కులు, చట్టాల విషయంలో నోరుమెదపడం లేదు. ప్రభుత్వ విధానాలు ఎటుపోతున్నాయనేది ప్రశ్నగానే మిగిలింది. ప్రభుత్వ ప్రాధాన్యతలేమిటి? నూతన పారిశ్రామిక విధానంలో పెట్టుబడిదారులను అందలమెక్కించారు. కార్మికుల హక్కులను పాతాళానికి తోసారు. స్వయం ధృవీకరణపత్రాలతోనే పెట్టుబడిదారులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. వారిమీద ప్రభుత్వానికి అంతనమ్మకం! మరోవైపు కార్మిక చట్టాల అమలు తీరును పరిశీలించడానికి రెండు లేదా మూడు సంవత్సరాలకు ఒకసారి తనిఖీలు చేస్తే సరిపోతుందన్నారు. దీనికి 'తక్కువ తనిఖీలు, ఎక్కువ సౌకర్యాలు' అని ముద్దుపేరు పెట్టారు. తనిఖీలు ఉండవని చెప్పిన తర్వాత పెట్టుబడిదారులు కార్మిక చట్టాలను అమలు చేస్తారా? రానున్న కాలంలో తెలంగాణ రాష్ట్రంలో కార్మిక వర్గానికి పరీక్షా సమయమే. హక్కుల పరిరక్షణకు ఐక్య ఉద్యమాలు తప్ప మరో మార్గంలేని పరిస్థితిని ప్రభుత్వం సృష్టిస్తున్నది.

అధికారంలోకి వచ్చి ఆరు మాసాలైనప్పటికీ టిఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యమకాలం నాటి ఎత్తుగడలే వేస్తున్నది. ప్రత్యేక తెలంగాణ - సమైక్యాంధ్ర పేరుతో ఆనాడు వివిధ పార్టీలు వారి విధానాలకు అనుగుణంగా ప్రజలను సమీకరించేందుకు భావోద్వేగాలను వినియోగించుకున్నాయి. తెలంగాణకోసం పోరాడిన టిఆర్ఎస్ కూడా అందులో అగ్రభాగాన నిలిచింది. కానీ ఇప్పుడది అధికారంలో ఉన్నది. సమస్యలు పరిష్కరించాల్సిన స్థానంలో ఉన్నది. అయినా, భావోద్వేగాల మీదనే ఇంకా ఆధారపడుతున్నది. ప్రజల దృష్టిని మళ్లించే ఎత్తుగడలే వేస్తున్నది. ఇవే ఎత్తుగడలు అటు ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ప్రభుత్వం కూడా ప్రజల దృష్టిని మళ్లించడానికి వినియోగించుకోగలుగుతున్నది. మరోవైపు టిఆర్ఎస్ నాయకత్వం, ప్రభుత్వమూ కేంద్రం పట్ల మెతకవైఖరిని అనుసరిస్తున్నాయి. బిజేపీతో స్నేహానికి కూడా అవకాశం అట్టిపెట్టుకున్నట్టు కనిపిస్తున్నది. 2009 ఎన్నికల సందర్భంగా కూడా బిజేపీకి వ్యతిరేకంగా పోటీ చేసినప్పటికీ ఎన్నికలైన వారం రోజులకే బిజేపీకి దగ్గరైన విషయం తెలిసిందే.

హైదరాబాదు శాంతిభద్రతల సమస్య ముందుకొచ్చిన సందర్భంగా టిఆర్ఎస్ నాయకత్వం ఊగిసలాడింది. ఇక్కడి శాంతిభద్రతల బాధ్యత కేంద్రానిదేనన్నప్పుడు కేంద్రం పెత్తనాన్ని సూటిగా ప్రశ్నించలేదు. హోం మంత్రిని కలిసిన టిఆర్ఎస్ ఎంపీల బృందం చిన్నచిన్న సర్దుబాట్లతో సంతృప్తి చెంది వచ్చింది. కేంద్ర, రాష్ట్ర సంబంధాలకు సంబంధించిన మౌలిక ప్రశ్నను విస్మరించింది. రైల్వే బడ్జెట్‌లో

**"అధికారంలోకి వచ్చి ఆరు మాసాలైనప్పటికీ టిఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యమకాలం నాటి ఎత్తుగడలే వేస్తున్నది. ప్రత్యేక తెలంగాణ - సమైక్యాంధ్ర పేరుతో ఆనాడు వివిధ పార్టీలు వారి విధానాలకు అనుగుణంగా ప్రజలను సమీకరించేందుకు భావోద్వేగాలను వినియోగించుకున్నాయి. తెలంగాణకోసం పోరాడిన టిఆర్ఎస్ కూడా అందులో అగ్రభాగాన నిలిచింది. కానీ ఇప్పుడది అధికారంలో ఉన్నది. సమస్యలు పరిష్కరించాల్సిన స్థానంలో ఉన్నది. అయినా, భావోద్వేగాల మీదనే ఇంకా ఆధారపడుతున్నది."**

నిర్దిష్టంగా తెలంగాణకు ఒక్క రూపాయి కూడా కేటాయించకపోయినా మాట్లాడలేదు. వెనకబడ్డ ప్రాంతాల్లో రైల్వేల అభివృద్ధి కోసం ఒత్తిడి చేయలేదు. కేంద్రంతో సత్సంబంధాలు ఉంటేనే కేంద్ర ప్రభుత్వం సహకరిస్తుందని బిజేపీ నాయకులు ప్రకటించినా నిరసన తెలపలేదు. రాష్ట్ర ప్రభుత్వాన్ని లొంగదీసుకునేందుకు కేంద్రం వేస్తున్న ఎత్తుగడల్లో భాగమేనన్న విషయాన్ని లేవనెత్తలేదు. రాజ్యాంగంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధులు, బాధ్యతలు స్పష్టంగా నిర్వచించారు. ఫెడరల్ రాజ్యాంగం మనది. కేంద్రంలో గాని, రాష్ట్రంలో గాని ఏ పార్టీ అధికారంలో ఉన్నదనేదానితో నిమిత్తం లేకుండా రాజ్యాంగం నిర్దేశించిన బాధ్యతలను నిర్వహించాలి. ఇందుకు విరుద్ధంగా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం మీద ఒత్తిడి చేయడాన్ని టిఆర్ఎస్ నాయకత్వం సూటిగా ప్రశ్నించలేదు. ఉపాధి హామీ నిధుల మీద ఆధారపడి చెరువులు పునరుద్ధరించాలనీ, హరితహారం అమలు చేయాలనీ, పేదలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించాలనీ రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు వేసింది. కానీ మోడీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు పూనుకున్నది. అందుకు తొలిమెట్టుగా ఉపాధి హామీ పనులను వెనుకబడిన ప్రాంతాలకు మాత్రమే పరిమితం చేస్తున్నట్లు ప్రకటించింది. బకాయిలు విడుదల చేయడానికి నిరాకరిస్తున్నది. దీనివల్ల రాష్ట్ర ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలుగుతున్నది. గ్రామీణ పేదలకు ఉపాధి కరువయ్యే ప్రమాదం ఏర్పడింది. ఇంత జరిగినా శాసనసభలోనూ, మండలిలోనూ తీర్మానానికే పరిమితమైంది. కేంద్రంతో పోరాటానికి సిద్ధంగా లేదు. ఇదే విషయంలో త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ ఢిల్లీలో దీక్ష చేసారు. రాష్ట్ర మంత్రి ఒకరు హాజరై మద్దతు తెలిపి ఉండాల్సింది. శాసనసభలో చర్చ పేరుతో వెళ్ళలేదు. చిన్నచిన్న సమస్యల మీద శాసనసభను, చర్చనీయాంశాలనూ వాయిదా వేయడం వీరికి కొత్త కాదు. కానీ ఇంత ముఖ్యమైన విషయంలో ఢిల్లీకి వెళ్లడానికి మాత్రం శాసనసభ సమావేశాలు సాకు చెప్పి ఆగిపోయారు. రాష్ట్రంలో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నప్పటికీ కేంద్రం స్పందించలేదు. రిజర్వు బ్యాంకు నిబంధనల పేరుతో అడ్డుకాలు వేసింది. అయినా కేంద్రం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేయలేదు. కేంద్ర ప్రభుత్వం తలచుకుంటే రిజర్వు బ్యాంకు నిబంధనలు ఆటంకం కాదు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం రిజర్వు బ్యాంకు అడ్డుపడు తుందన్నదే



తెలంగాణా సిఎం కె. చంద్రశేఖరరావు

తప్పు, కేంద్ర ప్రభుత్వం సహకరించ డం లేదని చెప్పలేదు. విద్యుత్ సమస్య పరిష్కరించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వం మీద ఉన్నది. 4500 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి కేంద్రం సహకరించకపోవడం వల్లనే ఆగింది. అయినప్పటికీ కెసిఆర్ ప్రభుత్వం చంద్రబాబుమీద విమర్శలతోనే కాలంగడిపింది. కేంద్రం మీద ఒత్తిడి పెంచేందుకు సిద్ధపడలేదు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు డొమెస్టిక్ టర్మినల్‌కు ఎన్టీఆర్ పేరుపెట్టే ముందు మోడీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని మాటమాత్రం కూడా సంప్రదించలేదు. తమ రాజకీయ ప్రయోజనాలకోసం ఈ సమస్యను వాడుకున్నది. కేసీఆర్ ప్రభుత్వం మాత్రం కేంద్రం సంప్రదించ లేదన్న విషయాన్ని మాటవరసకు చెప్పి శాసనసభలో చర్చ మొత్తం ఎన్టీఆర్‌పేరు చుట్టూ తిప్పింది. భావోద్వేగాలకు ఆయుధంగానే వాడు కున్నారు. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించాలని కేంద్రంపై ఒత్తిడి పెంచవలసిన అవసరం ఉన్నది. అయినా ఆ దిశలో చర్యలు కనిపించడంలేదు. చెన్నమనేని విద్యాసాగర్‌రావు మహారాష్ట్ర గవర్నర్‌గా నియమించబడ్డ సందర్భంగా ఆయనను రాష్ట్ర ప్రభుత్వం సన్మానించింది. ఇచ్చంపల్లి ప్రాజెక్టును నిర్మించేందుకు విద్యాసాగర్‌రావు తోడ్పడాలని విజ్ఞప్తి చేసింది. నిజానికి ఈ విషయం గవర్నర్ చేతుల్లోది కాదు. బండారు దత్తాత్రేయ కేంద్ర మంత్రి అయిన సందర్భంగా కూడా ఆయన్ను రాష్ట్ర దూతగా వ్యవహరించాలని కోరింది. కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రక్కనబెట్టి వ్యక్తుల చుట్టూ చర్చను తిప్పింది. విద్యాసాగర్‌రావు గారైనా, బండారు దత్తాత్రేయగారైనా బిజేపీ నాయకులే. కేంద్రంలో ఉన్న బిజేపీ విధానాలకు భిన్నంగా వ్యవహరించజాలరు కదా!

కీలక విషయాల్లో కేంద్రంతో మెతకగా వ్యవహరిస్తున్నది. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించకుండా దాటవేస్తున్నది. కేంద్రంతో సత్సంబంధాలు ఉంటేనే కేంద్రం నుండి సహకారం అందుతుందనడం రాజ్యాంగ విరుద్ధం. అయినా, కేంద్రాన్ని నిలదీయడం లేదు. రాష్ట్రాల హక్కులు, అధికారాలు, ఫెడరల్ రాజ్యాంగంలో రాష్ట్రాల పాత్ర గురించి సూత్రబద్ధమైన చర్చ లేదు. దృఢమైన వైఖరి ప్రదర్శించడం లేదు. పాశ్చాత్యులు, ముస్లింలు, మార్క్సిస్టులు రాసిన చరిత్ర గ్రంథాలు తగులబెట్టాలని బిజేపీ నేత ప్రకటించినప్పుడు గానీ, రామాయణ, భారతాలు, పురాణాలు పాఠ్యాంశాలుగా చేర్చాలని ప్రకటించినప్పుడు గానీ స్పందించలేదు. చరిత్రను తిరగరాసే ప్రయత్నాలను ప్రశ్నించలేదు. ఇవన్నీ ప్రజాస్వామ్యం, లౌకికతత్వం వంటి మౌలిక సూత్రాలకు సంబంధించిన విషయాలు. గ్రేటర్ హైదరాబాదు ఎన్నికల తర్వాత బిజేపీతో స్నేహం ఉంటుందన్న అభిప్రాయాలు కూడా అక్కడక్కడ టిఆర్ఎస్ నేతల నుండి వ్యక్తమవుతున్నాయి. ఇవన్నీ టిఆర్ఎస్ నాయకత్వం, ప్రభుత్వం అనుసరించే విధానాల పట్ల అనుమానాలకు అవకాశం ఇస్తున్నాయి.

రాష్ట్రాల ప్రయోజనాలు, హక్కుల కోసం కేంద్రం మీద ఒత్తిడి చేయాలన్న లక్ష్యం ఉంటే మద్దతు కూడగట్టే ప్రయత్నాలు కూడా ఉంటాయి. ఇతరులు పోరాడుతున్నప్పుడు సంఘీభావం తెలియజేస్తారు. ఏ చిన్న అవకాశాన్నీ వదులుకోరు.

కానీ టిఆర్ఎస్ ప్రభుత్వం నుండి ఇలాంటి ప్రయత్నాలు లేవు. ప్రజాస్వామ్యవాదులు, అభ్యుదయవాదులు సీరియస్‌గా పరిశీలించాల్సిన విషయాలివి.

ప్రపంచ గమనం

# జి20 సమావేశాలు : ప్రమాద సూచికలు



రచయిత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆంధ్ర ప్రదేశ్ కమిటీ సభ్యులు. 'మార్క్సిస్టు' సంపాదకులు.

**ఎస్. వెంకట్రావు**

సంక్షోభం, యుద్ధం... రెండూ పెట్టుబడిదారీ వ్యవస్థ కవల పిల్లలు. ఈ వ్యవస్థ ఉన్నంత కాలం సంక్షోభాలుంటాయి, యుద్ధాలుంటాయి. ఒక్కోసారి మహాసంక్షోభాలు, వాటితోపాటే మహాయుద్ధాలు కూడా వస్తుంటాయి. గత శతాబ్దంలోనే మనం ఒక పెద్ద సంక్షోభాన్నీ దానికి ముందూ వెనుకా రెండు ప్రపంచ యుద్ధాలనూ చూశాం. మొదటి ప్రపంచ యుద్ధం జరిగి ఈ ఏడాదికి వందేళ్లయింది. 21వ శతాబ్దంలో తిరుగులేదనుకున్న పెట్టుబడిదారీ వ్యవస్థ నేడు మరో పెద్ద సంక్షోభంలోకి నెట్టబడుతోందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. 2008 లో ప్రారంభమైన ఈ సంక్షోభంనుండి బయటపడడానికి పెట్టుబడిదారీ దేశాలు చేస్తున్న ప్రతి ప్రయత్నమూ వాటిని మరింత పెద్ద, లోతైన సంక్షోభంలోకి నెడుతున్నాయి. చివరికి యుద్ధంతోనే సంక్షోభాన్ని ముగించగలమనుకుంటున్నాయి. అందుకే మరో యుద్ధానికి అన్ని విధాలా సన్నాహాలు చేస్తున్నాయి. కానీ ఈ సారి యుద్ధమే సంభవిస్తే అది గత యుద్ధాల్లా ఉండదు. భూమ్మీద మానవాళి మొత్తాన్ని నాశనం చేసే మహా వినాశనకరమైన యుద్ధంగానే ఉంటుంది. ఒక వేళ యుద్ధాన్ని కొంతకాలం వాయిదా వేసినా పెట్టుబడిదారీ పోటీ వ్యవస్థ తీసుకువస్తున్న పర్యావరణ వినాశనం నుండి మాత్రం ప్రపంచం తప్పించుకోలేదని నిపుణులు చెబుతున్నారు. అందువల్ల మానవాళి ముందు రెండే దారులున్నాయి. పెట్టుబడిదారీ వ్యవస్థను నాశనం చేయడమా లేక తను నాశనం కావడమా.

### జి20 సమావేశం

నవంబర్ 15, 16 తేదీల్లో ఆస్ట్రేలియాలోని బ్రిస్‌బేన్‌లో జరిగిన జి20 సమావేశం ఇస్తున్న సందేశం ఏమిటి? ప్రపంచంలోని జిడిపిలో 85 శాతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న 20 దేశాలు ఏడాది తరువాత జరిపిన ఈ సమావేశం ప్రపంచాన్ని ప్రస్తుత సంక్షోభం నుండి బయటపడేయడానికి కొన్ని చర్యలు ప్రకటించింది. కానీ అవేవీ ఆచరణలో అమలు జరిగేవి కావని వాటికీ తెలుసు. 1930వ దశకంలో నానాజాతి సమితి సమావేశం మాదిరిగా ఇది జరిగిందని ఒక రాజకీయ వ్యాఖ్యాత పేర్కొన్నాడు. అప్పట్లో ఆర్థిక సంక్షోభం మరింత ముదురుతుందనీ, రెండో ప్రపంచ యుద్ధం జరుగుతుందనీ నానాజాతి సమితిలోని అన్ని దేశాలకూ తెలుసు. యుద్ధానికి అన్ని దేశాలూ సన్నాహాలు చేసుకుని సమావేశాల్లో మాత్రం గంభీరమైన ఉపన్యాసాలిచ్చేవి.

ప్రస్తుతం జి20 సమావేశాన్ని దాదాపు దానితో పోల్చ వచ్చు. గతంలో జి20 సమావేశాల్లో వాతావరణ ఉద్గారాల సమస్య ఎజెండాలో ఉండేది. కానీ ఈసారి ఆస్ట్రేలియా ఈ ఎజెండా పెట్టడానికి అంగీకరించలేదు. ఎందుకంటే బొగ్గు ఉత్పత్తీ, ఎగుమతులూ లేకపోతే ఆస్ట్రేలియా ఆర్థిక వ్యవస్థ కూలిపోతుంది. అందువల్ల ఎజెండాలో ఆ అంశం చేర్చలేదు. కాకపోతే అమెరికాలో ఈ అంశమే పెద్ద చర్చనీయంగా ఉంది. ఒబామా ఆస్ట్రేలియా రావడానికి ముందు వాతావరణ కాలుష్య ఉద్గారాలు తగ్గించాలని అమెరికాలో లక్షలాది మందితో ప్రదర్శనలు జరిగాయి. వచ్చే ఎన్నికల్లో ఇదే అమెరికా ఓటర్లను ప్రభావితం చేసే పెద్ద సమస్యగా ఉండబోతోంది. కాబట్టి ఒబామా జి20 సమావేశానికి ముందుగా నవంబర్ 11న చైనాతో విడిగా ఒక ఒప్పందం చేసుకున్నారు. కానీ ఇది అమలయ్యే ఒప్పందం కాదు. ఎందుకంటే దానికి అంతర్జాతీయ కట్టుబాటేమీ లేదు. గతంలో క్యోటో ఒప్పందాన్నిగానీ, అనేక ఇతర అంతర్జాతీయ ఒప్పందాలను గానీ అమెరికా ఏనాడూ అమలు జరపలేదు. భారాన్నంతా చైనా, భారత్‌ల మీదకు నెట్టడానికి ప్రయత్నించింది. ఈ విధంగా జి20 సమావేశం ఉమ్మడి అంశాలకన్నా దేశాల స్వప్రయోజనాలకే పెద్దపీట వేసింది.

రానున్న అయిదేళ్ల కాలంలో ప్రపంచ జిడిపీని 2.1 శాతానికి, డబ్బు రూపంలో చెప్పాలంటే 2 లక్షలకోట్ల డాలర్ల మేరకు పెంచాలని బ్రిస్బేన్ సమావేశంలో అన్ని దేశాలూ ముక్తకంఠంతో ప్రకటించాయి. కానీ అది జరగేది కాదని వాటికి తెలుసు. సమావేశం నుండి స్వదేశానికి తిరిగి వెళ్లిన వెంటనే జపాన్ ఆర్థిక వ్యవస్థ మాంద్యంలో పడిందన్న వార్తలతో ఆ దేశ ప్రధాని షింజో అబె పార్లమెంటును రద్దుచేసి సరికొత్త ఎన్నికలకు వెళుతున్నట్లు ప్రకటించారు. ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో 7.1 శాతం తగ్గిపోయిన జపాన్ ఆర్థికాభివృద్ధి రెండో త్రైమాసికంలో పుంజుకుంటుదనుకున్నారు. కానీ పుంజుకోకపోగా అది మళ్లీ 1.7 శాతం తగ్గింది. రెండు త్రైమాసికాలు వరుసగా ఆర్థికాభివృద్ధి తగ్గితే ఆ దేశ ఆర్థికవ్యవస్థ మాంద్యంలో పడినట్లే లెక్క. రెండు దశాబ్దాలు తీవ్ర మాంద్యాన్ని ఎదుర్కొన్న జపాన్‌ను తన విధానాలతో గట్టెక్కిస్తానని షింజో అబె గొప్పగా చెప్పారు. మనదేశంలో నరేంద్ర మోడీ మాదిరిగానే ఆ దేశ కార్పొరేట్ మీడియా ఆయనను ఆకాశానికెత్తింది. ఆయన విధానాలకు 'అబెనామిక్స్' అని (మన దేశంలో 'నమో' మంత్రం లాగా) పేరు పెట్టింది. కానీ అబెనామిక్స్ పనిచేయడం లేదని రెండేళ్లలోనే తేలిపోయింది.

ఇప్పటికే తీవ్రమైన మాంద్యంలో ఉన్న ఐరోపా యూనియన్ ఇప్పట్లో కోలుకునే పరిస్థితిలేదని బ్రిటిష్ ప్రధాని డేవిడ్ కామెరూన్

బ్రిస్బేన్‌నుండి స్వదేశం చేరుకున్న వెంటనే ప్రకటించారు. "ప్రస్తుతం నెలకొని వున్న ప్రమాద కరమైన అస్థిరత, సందిగ్ధత పరిస్థితుల్లో" బ్రిటన్ ఆర్థికంగా కోలుకోవడం కష్టమే అని ఆయన అన్నారు. యూరోజోన్‌లో మాంద్యం బ్రిటిష్ ఎగుమతి, దిగుమతులను కృంగదీసిందని చెబుతూ, ఆరేళ్ళ క్రితం వచ్చిన ఆర్థిక సంక్షోభం ప్రపంచాన్ని కృంగదీసినట్లే నేడు మళ్లీ "ప్రపంచ ఆర్థిక వేదికపై ప్రమాదఘంటికలు మోగుతున్నాయి" అని అన్నారు.

బ్రిస్బేన్‌లో నరేంద్ర మోడీ "మేక్ ఇన్ ఇండియా'' నినాదాన్ని మార్మోగిస్తున్న తరుణంలోనే మన దేశ ఉత్పత్తి అక్టోబర్‌లో 5 శాతం తగ్గిందన్న వార్తలు వచ్చాయి. దీపావళి, దసరా సీజన్ నడిచిన అక్టోబర్ నెలలోనే ఫ్యాక్టరీలు 30 శాతం తక్కువ సామర్థ్యంతో నడిచాయన్నది మరోవార్త. అందువల్ల భారత్ జిడిపి 5 శాతం దాటుతుందన్న ఆర్థిక పండితుల అంచనాలు నెరవేరడం అంత సులువు కాదంటున్నారు. చైనా పరిస్థితి కూడా అలాగే వుంది. 10 శాతం అభివృద్ధితో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఇంజనులా పనిచేసిన చైనా వృద్ధిని 7.5 శాతానికి తగ్గించేస్తున్నట్లు ఆ ప్రభుత్వమే ప్రకటించింది. అయితే ఈ ఏడాది అది 71. శాతం దాటక పోవచ్చని అంటున్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాలైన బ్రెజిల్, రష్యా, దక్షిణాఫ్రికా తదితర దేశాల పరిస్థితి కూడా ఇలాగే వుంది.

అమెరికాలో ఆర్థిక పరిస్థితి పుంజుకుంటున్నదని వస్తున్న వార్తలపై ఇటీవలి పరిణామాలు నీళ్లు జల్లుతున్నాయి. ప్రపంచ మాంద్యం మూలంగా ముఖ్యంగా చైనాలో అభివృద్ధి వెనుకపట్టుపట్టినందున అంతర్జాతీయంగా వస్తువుల ధరలు తగ్గడం అమెరికాకు కొంతవరకు లాభించింది. పెట్రోలియం ధరలు తగ్గడం వల్ల అమెరికన్ ప్రజలకు కొంతవరకు వెసులుబాటు లభించింది. చమురు కోసం అధికంగా ఖర్చు చేసే అమెరికన్ల చేతుల్లో కాస్త డబ్బులు మెసులుతున్నాయి. కానీ ఇది ఎంతో కాలం నిలవదని ఇటీవల న్యూయార్క్ టైమ్స్ ఎడిటోరియల్‌లో పేర్కొన్నది. మొదటిది అంతర్జాతీయ విపణిలో చమురు ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. రెండు, ఐరోపా, జపాన్‌లలో మాంద్యం వల్ల అమెరికా ఆర్థికవ్యవస్థ సమస్యలనెదుర్కొంటుంది. ఎందుకంటే అమెరికా ఎగుమతుల్లో 25 శాతం ఈ రెండు ప్రాంతాలకు వెళతాయి. మొత్తం మీద "ఆర్థిక సంక్షోభం నుండి బయటపడటం అనేది అసమానంగానూ, అసంతృప్తి కంగానూ వుంది. చాలా దేశాల్లో పురోగమనం ఆగిపోయింది" అని న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది.

> **❝ రానున్న అయిదేళ్ల కాలంలో ప్రపంచ జిడిపీని 2.1 శాతానికి, డబ్బు రూపంలో చెప్పాలంటే 2 లక్షలకోట్ల డాలర్ల మేరకు పెంచాలని బ్రిస్బేన్ సమావేశంలో అన్ని దేశాలూ ముక్తకంఠంతో ప్రకటించాయి. కానీ అది జరగేది కాదని వాటికీ తెలుసు.❞**



**రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో కెనడా ప్రధాని స్టీవెన్ హార్పర్: జి20 సమావేశంలో సుహృద్భావం కన్నా శత్రుత్వమే ఎక్కువగా కనిపించింది**

అందువల్ల మొత్తం ప్రపంచం 2008 సంక్షోభం తరువాత కోలుకుంటున్నట్లు కనిపించినా అది తాత్కాలికమేననీ, సంక్షోభం తీవ్రంగానూ, సుదీర్ఘంగానూ వుంటుందన్నది సత్యం. బ్రిస్బేన్‌లో సమావేశమైన దేశాధినేతలందరికీ ఈ విషయం తెలుసు. అందరూ కలిసి సంక్షోభాన్ని అడ్డుకోవాలని సంకల్పించినా సాధ్యం కాదని కూడా వారికి తెలుసు. ఎందుకంటే నేడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై పట్టు సాధించిన ద్రవ్యపెట్టుబడి వారిని వెనక్కు మరలనివ్వదు. మాంద్యం అనే రోగానికి జి20 సమావేశం సిఫార్సు చేసిన మందు చూస్తేనే మనకు ఆ విషయం బోధపడుతుంది.

మాంద్య పరిస్థితులనుండి బయటపడాలంటే ప్రభుత్వాల పరంగా ఖర్చులు పెంచాలి. ఆ ఖర్చు కూడా పడిపోయిన బ్యాంకులనూ, ద్రవ్య సంస్థలను లేవనెత్తడానికి కాకుండా ప్రజల కొనుగోలు శక్తి పెంచడానికి పెంచాలి. కానీ ఆయా దేశాలు "తమ జిడిపిలో రుణ శాతాన్ని పెరగ కుండా చూడాలి" అని సమావేశం పిలుపునిచ్చింది. అంటే ఖర్చులు తగ్గించుకోవాలన్న మాట. ప్రభుత్వాల ఖర్చులు తగ్గించడమంటే సంక్షేమం, ఉపాధిపై కోతపెట్టడమే. అంటే గిరాకీ తగ్గడమే. ఫలితంగా మాంద్యం మరింత తీవ్రమవుతుంది."ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడి, ప్రాథమిక సదుపాయాల ఏర్పాటు లోపంగా వుంది. మనం తక్షణం చర్యలు తీసుకోకపోతే ఈ లోటు మరింత పెరుగుతుంది'' అని సమావేశం పేర్కొంది. కనుక "ప్రాథమిక సదుపాయాల ఏర్పాటుకు చొరవ" తీసుకోవాలని అది సిఫార్సు చేసింది. కానీ ఇంకోవైపు ఈ దేశాలమధ్య పెరుగుతున్న శత్రుత్వాలు ఇటువంటి చొరవను చంపేస్తున్నాయి. రష్యాకూ, యూరప్‌కూ మధ్య, చైనాకూ – ఆస్ట్రేలియాకూ మధ్య, అమెరికాకూ –రష్యా, చైనా ఇతర అనేక దేశాలకూ మధ్య సహకారం రోజురోజుకూ తగ్గిపోతోంది. ఆంక్షలు, వైరాల వల్ల అనేక సంయుక్త ప్రాజెక్టులు అటకెక్కుతున్నాయి. చైనా కేంద్రంగా ఏర్పడబోయే ఆసియన్ ప్రాథమిక సదుపాయాల పెట్టుబడుల బ్యాంకులో చేరకూడదని అమెరికా తెచ్చిన ఒత్తిడికి ఆస్ట్రేలియా లొంగిపోయింది. బ్యాంకులో చేరడానికి నిరాకరించింది. అమెరికా నేడు రష్యామీదా, ఇతర అనేక దేశాల మీదా ఆర్థిక ఆంక్షలు విధించి ప్రపంచ ఆర్థిక పురోగమనానికి అడ్డుగా తయారైంది.

ప్రపంచ ఆర్థికవ్యవస్థను గట్టెక్కించడానికి ద్రవ్య విధానాలు ఇంకెంతమాత్రం పనికిరావు ఆర్థిక 'నిర్మాణంలో సంస్కరణలు' (స్ట్రక్చురల్ రిఫార్మ్స్) కావాలి అని ఆస్ట్రేలియా ఆర్థిక మంత్రి జోయ్ హాకీ చెప్పారు. "కార్మిక మార్కెట్ సరళీకరణ", "కార్మికుల అడాప్టబిలిటీ" ఈ సంస్కరణల్లో ప్రధానమైనవని ఆయన పేర్కొన్నారు. దానర్థం కార్మిక చట్టాలు సరళీకరించి ఇప్పటివరకు కార్మికులకు వున్న హక్కులనూ, ఉపాధినీ తగ్గించడమేనన్న మాట. అంటే కార్మికుల కొనుగోలు

> **“ నేటి ప్రపంచ ద్రవ్యపెట్టుబడిదారీ వ్యవస్థ.. రుణాలు, లీవరేజ్‌లు, డెరివేటివ్‌లతో కట్టిన పేకమేడలా ఉందని ఒక ఆర్థికవేత్త వ్యాఖ్యానించాడు. ప్రపంచ జిడిపి ఇప్పుడు 74.91 లక్షలకోట్ల (ట్రినియన్ల) డాలర్లుంది. కానీ ప్రపంచంలోని అప్పు మొత్తం కలిపితే (ప్రభుత్వ, ప్రయివేటు, గృహస్థాయివరకు) 223.3 లక్షలకోట్ల డాలర్లుంది. అంటే జిడిపికి 313శాతం అధికంగా అప్పుఉంది. ”**

శక్తి పెంచి, గిరాకీని సృష్టించే విధానాలు కాకుండా వారి కొనుగోలు శక్తిపై నేరుగా దాడి చేయడం ద్వారా పెట్టుబడి పోగుచేసుకునే విధానాలు మరింత ఉధృతంగా అమలు చేయాలని సిఫార్సు చేస్తున్నారు. నేడు భారత్‌తో సహా అన్ని దేశాల్లోనూ కార్మిక చట్టాల సవరణపేరుతో వారి హక్కులపైనా, ఆదాయాలపైనా నేరుగా దాడి జరుగుతోంది. ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో గిరాకీని సృష్టించకపోగా మాంద్యాన్ని మరింత పెంచుతుంది.

**ఆర్థిక వ్యవస్థలో మహాబుడగ**

నేటి ప్రపంచ ద్రవ్యపెట్టుబడిదారీ వ్యవస్థ.. రుణాలు, లీవరేజ్‌లు, డెరివేటివ్‌లతో కట్టిన పేకమేడలా ఉందని ఒక ఆర్థికవేత్త వ్యాఖ్యానించాడు. ప్రపంచ జిడిపి ఇప్పుడు 74.91 లక్షలకోట్ల (ట్రినియన్ల) డాలర్లుంది. కానీ ప్రపంచంలోని అప్పు మొత్తం కలిపితే (ప్రభుత్వ, ప్రయివేటు, గృహస్థాయివరకు) 223.3 లక్షలకోట్ల డాలర్లుంది. అంటే జిడిపికి 313శాతం అధికంగా అప్పు ఉంది. చట్టావ్యాపారం సాగుతున్న ఫ్యూచర్స్, ఇతర డెరివేటివ్స్ విలువ 600 నుండి 1500 ట్రిలియన్ల వరకు ఉంటుందని ఒక అంచనా. అంటే వాస్తవ ఆర్థిక వ్యవస్థకన్నా చట్టా వ్యాపారం అనేక రెట్లు పెరిగిపోయింది. ఇదో పెద్ద బుడగ. అమెరికా బ్యాంకు ఎకౌంట్లలో నేడు ఉన్న మొత్తం సొమ్ము 9 లక్షలకోట్ల డాలర్లు. కానీ దాని అప్పు సుమారు 56 లక్షల కోట్లు. ఇదో బుడగ. 2008 సంక్షోభం తరువాత బ్యాంకులను, ద్రవ్య సంస్థలను బతికించడం కోసం ప్రభుత్వాలు పెద్ద ఎత్తున ప్యాకేజీలు ఇచ్చాయి. దాంతో ఆయా ప్రభుత్వాలు అప్పుల్లో కూరుకుపోయాయి. స్టాక్‌మార్కెట్లను పెంచడం కోసం “ఈ ఆరు సంవత్సరాల కాలంలో 7 నుండి 10 లక్షలకోట్ల డాలర్ల రుణాలను సెంట్రల్ బ్యాంకులు వడ్డీ లేకుండా లేక కొద్దిపాటి వడ్డీతో ఇచ్చాయి. ఇది మరోసారి ఆర్థికవ్యవస్థ పతనానికి కావలసిన పరిస్థితులు సృష్టించింది” అని హెచ్‌ఎస్‌బిసి చీఫ్ ఎకనామిస్ట్ స్టీఫెన్ కింగ్ ఫైనాన్షియల్ టైమ్స్ పత్రికలో రాశారు. పెట్టుబడిదారీ ప్రభుత్వాలు అనుసరించిన విధానాల వల్ల ద్రవ్య మార్కెట్లలో ‘హింసాత్మకమైన’ ఘటనలు జరుగుతాయని ఆస్ట్రేలియా రిజర్వు బ్యాంకు అసిస్టెంట్ గవర్నర్ గే డెబెల్లె అక్టోబర్ 14న వ్యాఖ్యానించారు.

మొత్తం మీద చూసినప్పుడు చట్టా వ్యాపారం ద్వారా ద్రవ్యపెట్టుబడి గరిష్ట లాభాలకు అవకాశం కల్పించేందుకు ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఈ విధానాలు “ప్రపంచ చరిత్రలోనే అతి పెద్ద ద్రవ్య బుడగను సృష్టించింది. ఇది మొత్తాన్ని తల్లక్రిందులు చేయడానికి ఎంతోకాలం పట్టదు. అదే జరిగితే భూగోళ చరిత్రలో అదే అతిపెద్ద ఆర్థిక వినాశనం అవుతుంది” అని ఆర్థికవేత్త హెచ్చరించారు. కానీ ఈ హెచ్చరికలేవీ పెట్టుబడిదారీ ప్రభుత్వాల చెవికెక్కడం లేదని జి20 సమావేశం చర్చలు తెలియజెప్పుతున్నాయి.

**పెరుగుతున్న ఆర్థిక అసమానతలు**

స్విట్జర్లాండుకు చెందిన ఫైనాన్షియల్ సర్వీసెస్ సంస్థ ‘క్రెడిట్ సూస్సె’ అక్టోబరు రెండో వారంలో ప్రపంచ సంపద రిపోర్టు విడుదల చేసింది. దాని ప్రకారం ప్రపంచంలోని 1 శాతం ప్రజల వద్ద 48.2 శాతం సంపద పోగుపడి ఉంది. గత ఏడాది 46 శాతం నుండి ఈ ఏడాది 48.2 శాతానికి పెరిగింది. ఈ లెక్కన వారి సంపద శాతం పెరుగుతూ పోతే వచ్చే 23 ఏళ్ల కాలంలో ప్రపంచంలోని సంపదంతా ఈ ఒక్క శాతం కుబేరుల చేతుల్లోకి పోతుందని ఆ సంస్థ తెలిపింది. విశేషమేమంటే 2008 ఆర్థిక సంక్షోభం తరువాత ఆర్థిక అసమానతలు బాగా పెరిగాయి. ఈ ఆరేళ్లలో ధనికుల వద్ద చేరిన సంపద విలువ పెరిగింది. కార్మికులు, ఉద్యోగుల వేతనాలు తగ్గాయి. దీనిపై బ్రిటన్‌కు చెందిన స్వచ్ఛంద సంస్థ ఆక్స్‌ఫామ్ అధిపతి ఎమ్మా సీరి మాట్లాడుతూ “సంక్షోభ భారాలన్నీ సామాన్యులకు చేరితే సంక్షోభం నుండి బయటపడేందుకుద్దేశించిన ప్రయత్నాల వల్ల కుబేరులు లాభం పొందారని ఈ సంఖ్యలు తెలుపుతున్నాయి” అన్నారు.

లక్ష డాలర్లకన్నా ఎక్కువ ఆదాయం వచ్చే వారు ప్రపంచ జనాభాలో 8.6 శాతం మంది ఉంటే వారి వద్ద 85 శాతం ప్రపంచ సంపద పోగుపడింది. 10,000 డాలర్ల కన్నా తక్కువ ఆదాయం వచ్చేవారు ప్రపంచ జనాభాలో 70 శాతం మంది ఉంటే వారి వద్దకు చేరింది 2.9 శాతం సంపద మాత్రమే.

అంతకు ముందు సెప్టెంబర్ నెలలో వెల్త్-ఎక్స్ అనే సంస్థ మరికొన్ని ఆసక్తి కరమైన వివరాలు ఇచ్చింది: ప్రపంచంలోని డాలరు శతకోటీశ్వరుల సంపద గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది 12 శాతం పెరిగింది. వీరి సంఖ్య 2009లో 1,360 నుండి 2013లో 2,173కు 2014లో 2,325కు పెరిగింది. అంటే ఆర్థిక సంక్షోభం తరువాత శతకోటీశ్వరులు పెరిగారు, వారి సంఖ్యా పెరిగింది. ఈ కాలంలోనే ప్రజల నిజఆదాయాలు గణనీయంగా తగ్గాయి. అంటే ఆర్థిక సంక్షోభ భారాన్ని పెట్టుబడిదారులు ప్రజల మీదకు నెట్టి తమ లాభాలు మాత్రం కాపాడుకున్నారన్న మాట.

**యుద్ధ ప్రయత్నాలు**

బ్రిస్బేన్‌లో జరిగిన జి20 సమావేశం నేటి ప్రపంచంలో పెరుగుతున్న యుద్ధ ప్రమాదాన్ని కూడా ముందుకు తీసుకొచ్చింది. సమావేశంలో జరిగిన ఒక్క ఘటన ఈ సమావేశం ఎంత వైషమ్యాలతో జరిగిందో తెలుసుకోడానికి ఉపయోగపడుతుంది. జి20 నేతల సమావేశం జరుగుతున్నప్పుడు రష్యా అధ్యక్షుడు వ్లదిమీర్ పుతిన్, కెనడా ప్రధాని స్టీవెన్ హార్పర్‌తో కరచాలనం చేయబోగా “నీతో కరచాలనం చేస్తాను. కానీ ఈ సందర్భంగా ఒక్కమాట చెప్పదలుచుకున్నాను: ఉక్రెయిన్ నుండి వెళ్లిపో” అని హార్పర్ కటువుగా చెప్పారు. దీనికి పుతిన్ బదులిస్తూ “అది అసాధ్యం: ఎందుకంటే మేమక్కడ లేము” అన్నారు. దేశాధినేతలు మర్యాదలు మరిచిపోయి మాట్లాడుకోవడం యుద్ధ సమయాల్లోనే జరుగుతుంది. అమెరికా ఒకవైపు రష్యాకూ, మరోవైపు చైనాకూ బహిరంగ హెచ్చరికలు చేయడం, ఇతర సామ్రాజ్యవాద దేశాలు దానికి వంతకలవడం..ఇవన్నీ కూడా జి20 వేదిక లక్ష్యాన్నే మరుగున పడేసి యుద్ధవాతావరణాన్ని ముందుకు తెచ్చాయి.

వాస్తవానికి పుతిన్‌ను జి20 సమావేశానికి ఆహ్వానించకూడదని ఆస్ట్రేలియా నిర్ణయించుకుంది. ఆ దేశంలో చైనా, రష్యాలకు వ్యతిరేకంగా తీవ్రమైన ప్రచారం జరుగుతోంది. ఫలితంగా 49 శాతం మంది ఆస్ట్రేలియన్లు పుతిన్‌ను

ఆహ్వానించకూడదని ఒక అభిప్రాయ సేకరణలో చెప్పారు. అయినా జి20లో ఏకాభిప్రాయం లేకపోవడం వల్ల పుతిన్‌కు ఆహ్వానం వెళ్లింది. మన దేశ సమావేశం అయితే పిలిచేవాళ్లం కాదు, కానీ ఇది అంతర్జాతీయ సమావేశం, ఏకాభిప్రాయంతో వెళ్లాలి అని ఆస్ట్రేలియా అధ్యక్షుడు టోనీ అబ్బట్ బహిరంగంగానే పేర్కొన్నారు.

పుతిన్ ఆస్ట్రేలియా పర్యటన సందర్భంలో ఆయనకు ఎస్కార్ట్‌గా రష్యా తన యుద్ధనౌకలను ఆస్ట్రేలియా దగ్గరగా అంతర్జాతీయ జలాల్లోకి పంపింది. దానికి ప్రతిగా ఆస్ట్రేలియా తన యుద్ధ నైకలనూ, గూఢచారి విమానాలనూ వాటికి చేరువగా పంపించింది. ఆ విధంగా రెండు దేశాలూ పరస్పరం కవ్వించుకున్నాయి. జి20 సమావేశంలో పశ్చిమ దేశాలు పుతిన్‌ను ఒంటరిపాటు చేయడానికి తీవ్రంగా ప్రయత్నించాయి. "మీరు ఇతర దేశాల్లోకి వెళ్లడం తగదు" అని అమెరికా అధ్యక్షుడు ఒబామా పుతిన్‌ను హెచ్చరించాడు. విశేషమేమంటే నోబుల్ శాంతి బహుమతి పొందిన ఈ శాంతి దూత తన పదవీ కాలంలో ఏడు దేశాలను దురాక్రమించాడు. గత 25ఏళ్ల కాలంలో అమెరికా, దాని మిత్రులు 12 దేశాల మీద బాంబులు కురిపించాయి. ఈ దేశాలే నేడు ఉక్రెయిన్ అంతర్యుద్ధం సమస్యను తీసుకుని రష్యాకు సుద్దులు చెబుతున్నాయి. జర్మన్ ఛాన్సలర్ ఎంజెలా మెర్కెల్ పుతిన్‌తో నాలుగు గంటలు సమావేశమై ఆయనపై తీవ్రంగా విమర్శల వర్షం కురిపించారు. ఆ తరువాత సిడ్నీలో ఒక సమావేశంలో మాట్లాడుతూ 'యూరప్‌లో శాంతికి పుతిన్ విఘాతం కలిగిస్తున్నారని' విమర్శించారు.

అసలింతకీ రష్యా చేసిన నేరం ఏమిటి? అమెరికా, యూరప్ దేశాలు..ఉక్రెయిన్‌లో ఫాసిస్టు మూకలను రెచ్చగొట్టి అక్కడ ఎన్నికల ద్వారా ఏర్పడిన ప్రభుత్వాన్ని కూలదోశాయి. ఫాసిస్టు శక్తులు అధికారంలోకి వచ్చాయి. రష్యన్లపై దాడులు జరిగాయి. దాంతో ఉక్రెయిన్‌లోని రష్యన్‌లు తమకు భద్రత లేదని తిరుగుబాటు లేవదీశారు. క్రిమియా అనే చిన్న భాగం స్వతంత్రం ప్రకటించుకుంది. మిగిలిన భాగంలో రష్యన్లకూ, ఉక్రెయిన్లకూ మధ్య అంతర్యుద్ధం జరుగుతోంది. ఉక్రేనియన్ రష్యన్లకు, రష్యా భూభాగం నుండి మద్దతు లభిస్తోందని పశ్చిమ దేశాల ఆరోపణ. ఈ లోగా ఉక్రెయిన్ గగన తలంమీదుగా వెళుతున్న మలేషియా విమానాన్ని ఒక క్షిపణి కూల్చేసింది. రష్యానే ఆ క్షిపణిని ప్రయోగించిందని పశ్చిమ దేశాల ఆరోపణ. దాన్ని ఉక్రెయిన్ ప్రభుత్వ దళాలే

**"రష్యా మాదిరిగానే చైనాను కూడా సైనికంగా చుట్టుముట్టడానికి సామ్రాజ్యవాదులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. దక్షిణ చైనా సముద్ర జలాలపై సార్వభౌమత్వ సమస్య ఇక్కడ ఫ్లాష్ పాయింటుగా మారే ప్రమాదం కనిపిస్తోంది. జపాన్, తైవాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, ఫిలిప్పీన్స్, భారత దేశాలను చైనాకు వ్యతిరేకంగా కూడగట్టడానికి అమెరికా ప్రయత్నిస్తున్నది. చైనాకు వ్యతిరేకంగా పసిఫిక్ సముద్ర ప్రాంతాన్ని సాయుధం చేస్తోంది."**



మాట్లాట కాదు పోట్లాట : జర్మన్ ఛాన్సలర్ ఎంజెలా మార్కెల్‌తో పుతిన్

ప్రయోగించాయని రష్యా ఆరోపణ. వాస్తవానికి 'నాటో' కూటమిని ఉక్రెయిన్ వరకు విస్తరించి రష్యాను చుట్టుముట్టడానికి పశ్చిమదేశాలు ప్రయత్నిస్తుంటే, రష్యా దాన్ని ప్రతిఘటిస్తోంది. అదీ ఉక్రెయిన్ సమస్య.

ఉక్రెయిన్‌లో ప్రస్తుతం ఏర్పడిన ఫాసిస్టు తరహా ప్రభుత్వానికి జర్మనీద్వారా పశ్చిమ దేశాల పూర్తి మద్దతు లభిస్తోంది. యుద్ధానికి దాన్ని ఒక ఫ్లాష్ పాయింట్‌గా వాడుకోవాలని చూస్తున్నారు. అందుకే ఉక్రెయిన్ దేశాధ్యక్షుడు పెట్రో పొరొషెంకో ఇటీవల ఒక జర్మన్ టాబ్లాయిడ్ మ్యాగజైన్‌కు ఇంటర్వ్యూ ఇస్తూ "రష్యన్ సైన్యంతో యుద్ధం చేయడానికి నాకు భయం లేదు. పూర్తి స్థాయి యుద్ధానికి మేం సిద్ధంగా ఉన్నాం" అన్నారు. అంతేకాదు, "అయిదు మాసాల క్రితం కన్నా ఇప్పుడు మా సైన్యం చాలా మెరుగ్గా ఉంది. మొత్తం ప్రపంచం నుండి మాకు మద్దతు లభిస్తోంది" అని చెప్పారు.

ఇటువంటి శత్రుపూరిత వాతావరణంలో జరిగిన జి20 సమావేశం నుండి పుతిన్ అర్ధంతరంగా వెళ్లిపోయారు. వెళ్లిన వెంటనే ఆయన చైనాతో కలిసి పసిఫిక్ సముద్రంలోనూ, మధ్యధరా సముద్రంలోనూ యుద్ధవిన్యాసాలకు సైన్యాన్ని సిద్ధం చేశారు.

రష్యాకు మాదిరిగానే చైనాను కూడా సైనికంగా చుట్టుముట్టడానికి సామ్రాజ్యవాదులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. దక్షిణ చైనా సముద్ర జలాలపై సార్వభౌమత్వ సమస్య ఇక్కడ ఫ్లాష్ పాయింటుగా మారే ప్రమాదం కనిపిస్తోంది. జపాన్, తైవాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, ఫిలిప్పీన్స్, భారత దేశాలను చైనాకు వ్యతిరేకంగా కూడగట్టడానికి అమెరికా ప్రయత్నిస్తున్నది. చైనాకు వ్యతిరేకంగా పసిఫిక్ సముద్ర ప్రాంతాన్ని సాయుధం చేస్తోంది. జి20 సమావేశం సందర్భంగా నవంబర్ 17న క్వీన్స్‌లాండ్ యూనివర్శిటీలో ఒబామా చేసిన ఉపన్యాసం మొత్తం పరోక్షంగా చైనాను హెచ్చరించినట్లే సాగిందని నిపుణులు చెబుతున్నారు. చైనా ఆర్థికాభివృద్ధిని స్వాగతిస్తున్నాం, కానీ 'ఇతర దేశాలు పాటిస్తున్న నియమాలనే అది కూడా పాటించాలి" అని ఒబామా హుకుం జారీ చేశారు. ఇతర దేశాలు అంటే ఇక్కడ అమెరికా చెప్పే నియమాలే.

మొత్తం మీద ఒకవైపు నుండి తీవ్రమవుతున్న ఆర్థిక సంక్షోభ మేఘాలూ, మరోవైపు నుండి యుద్ధ మేఘాలూ ప్రపంచాన్ని కమ్ముకుంటున్నాయి. వేలాది అణ్వస్త్రాలతో, అత్యంత ఆధునిక ఆయుధాలతో సైన్యాగారాలు నిండిపోయి ఉన్న నేటి ప్రపంచంలో యుద్ధం రావడమంటే అది అత్యంత భయంకరమైన అణుయుద్ధమే అవుతుంది. మానవాళి వినాశనమే అవుంతుంది. అందువల్ల యుద్ధం ఆగాలంటే ఆర్థిక సంక్షోభాన్ని నివారించాలి. సంక్షోభం నివారించబడాలంటే మానవాళి ముందు ఒకే మార్గం వుంది: పెట్టుబడిదారీ వ్యవస్థ స్థానంలో ప్రత్యామ్నాయ వ్యవస్థను నిర్మించడమే.

సామాజికాంశం

# ఉపాధి హామీపై ఎందుకీ దాడి?



బి. వెంకట్, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ సహాయ కార్యదర్శి

కొండూరి వీరయ్య, జాతీయ వర్కింగ్ కమిటీ సభ్యులు

**బి. వెంకట్, కొండూరి వీరయ్య**

ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాలను నిరసిస్తూ త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ నవంబరు 26న పార్లమెంట్ ముందు ధర్నాకు దిగారు. ఒక ముఖ్యమంత్రి దేశవ్యాపితంగా ప్రజలెదుర్కొంటున్న సమస్యపై ధర్నాకు దిగటం బహుశా సమకాలీన జాతీయ రాజకీయాల్లో ఇదే తొలిసారి. ఈ ధర్నాకు సంఘీభావంగా దేశవ్యాప్తంగా లక్షలాదిమంది శ్రమ జీవులు వీధుల్లోకి వచ్చారు. ఒకవైపున దేశంలో మూడోవంతు జనాభాకు ఇంత అన్నం పెట్టే పధకాన్ని అటకెక్కిస్తూ ప్రధాని ఆస్ట్రేలియా పర్యటనలో 'దేశం కోసం జీవిద్దాం' అంటూ పిలుపునివ్వటం మోడీ వంటి వారికే సాధ్యం. దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్ అన్నాడు మహాకవి గురజాడ. మరి ప్రధాని మోడీ దృష్టిలో విదేశీ, స్వదేశీ పెట్టుబడులు, ప్రవాస పరివార్, భూస్వాములు మాత్రమే మనుషులా అన్న సందేహం కలుగుతున్నది. పార్లమెంట్‌లో గత రెండున్నర దశాబ్దాల్లో లేని విధంగా బిజెపి సంపూర్ణ ఆధిపత్యంతో అధికారానికి వచ్చిందే తడవుగా తన కార్పొరేట్ – సంఘ్ పరివార్‌ల ద్వంద్వ ఎజెండాను భుజాన వేసుకుని " దేశానికి ప్రధమ సేవకుడిని" అని బయటికి చెప్తూ కార్పొరేట్ శక్తుల చేతుల్లో ప్రధాన సేవకుడిగా రుణం తీర్చుకోవడం ప్రారంభించారు మోడి. ఉపాధి హామీ చట్టం అమల్లో ప్రభుత్వం తలపెట్టిన మార్పులు కార్పొరేంట్ వర్గాలకూ, గ్రామీణ పెత్తందారీ వర్గాలకూ, అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడికీ చేసే ఊడిగంలో భాగమే. ఉపాధి హామీ చట్టం తెరమీదకు వచ్చినప్పటి నుండీ ఈ దాడి కొనసాగుతున్నా గత సంవత్సర కాలంగా పతాక స్థాయికిచేరుకుని రాజకీయ, ఆర్థిక, సామాజిక, సైద్ధాంతిక దాడిగా మారింది. బహుశా ఉపాధి హామీ చట్టంపై జరిగిన స్థాయిలో విధానపరమైన దాడి మరే విధానంపైనా జరగలేదనటం అతిశయోక్తి కాదు. గాంధీ హంతకులు గద్దెనెక్కిన రోజులు ఇవి. మరి గాంధీ, నెహ్రూ పేర్లున్న పథకాలను విధానాలను బతనిస్తాయా ఈ శక్తులు ? ఈ చట్టంపై ఇంతగా ప్రభుత్వం దాడి కేంద్రీకరించటానికి గల కారణాలు అర్థం చేసుకోవాలంటే ఈ చట్టం తెరమీదకు వచ్చిన నేపథ్యం, చట్టంతోపేదలకు వచ్చిన ప్రయోజనాలు ముందుగా తెలుసుకోవాలి.

**చట్టం నేపథ్యం**

నికరమైన కనీస పనిదినాలు, కనీస వేతనాలు, కనీస ఆదాయం, బడ్జెట్ పరిమితులతో నిమిత్తం లేకుండా పని చేయటానికి సిద్ధమైన వారికి పని కల్పించటం, మూడోవంతుకు తగ్గకుండా మహిళలకు అవకాశాలు కల్పించటం, సామాజిక వనరుల సృష్టి, వలసలను నియంత్రించటం,వలసలు వెళ్ళాల్సిన అవసరం లేకుండా చేయటం కోసం నివాస ప్రాంతాల పరిధిలోనే పని చూపించటం, పంచాయితీరాజ్ సంస్థలకు కీలక బాధ్యతలు ఉపాధి హామీ చట్టంలో మౌలిక అంశాలు. ఈ అంశాలు ఆర్థికాభివృద్ధితోనే కాదు. సామాజిక న్యాయంతో కూడా ముడిపడి ఉన్న అంశాలు.

ఉపాధి హామీ చట్టం ప్రాధాన్యత గురించి సరిగ్గా అర్థం చేసుకోవాలంటే గత రెండు దశాబ్దాల ఆర్థిక సంస్కరణల దుష్ప్రభావాలను కూడా అర్థం చేసుకోవాలి. 1991లో ప్రారంభమైన ఆర్థిక సంస్కరణలు గ్రామీణ భారతాన్ని కుంగదీశాయి. గ్రామీణ భారతానికి ఆయువు పట్టుగా ఉన్న వ్యవసాయాన్ని సంక్షోభ భరితం చేశాయి. లక్షలాది మంది రైతులు ఆత్మహత్యల పాలయినా సంస్కరణల మత్తులో జోగుతున్న ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించాయి. వ్యవసాయానికీ, వ్యవసాయ కార్మికుల శ్రమకు వేతనాలకు అవినాభావ సంబంధం ఉంది. కానీ కాలక్రమంలో వ్యవసాయంలో యాంత్రికీకరణ పెరగటంతో ఉపాధి క్షీణత ప్రారంభమైంది. గతంలో వ్యవసాయ కార్మికుల వేతనాల రూపంలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థలోనే ఉంటున్నమొత్తం నేడు యంత్రాల బాడుగ రూపంలో పట్టణాలకు చేరుతోంది. వ్యవసాయం కునారిల్లటంతో వ్యవసాయాన్ని, రైతును ఆధారం చేసుకుని జీవనం సాగిస్తున్న వ్యవసాయ కార్మికులు, వృత్తిదారుల జీవితాలు మరింత భారమయ్యాయి. రైతే బతకలేని పరిస్థితుల్లో వ్యవసాయంపై ఆధారపడ్డ కూలీలకు పనులు చూయించటం అసాధ్యంగా మారింది. గత రెండు దశాబ్దాలుగా మనం చూస్తున్న వ్యవసాయ సంక్షోభం కేవలం వ్యవసాయాన్ని గిట్టుబాటు కాకుండా మార్చటంతో తలెత్తిన సంక్షోభం మాత్రమే కాదు. గ్రామీణ సంపదను పట్టణ ప్రాంతాలకు, పారిశ్రామిక కేంద్రాలకు తరలించటం ఈ సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేసింది.కోట్లాదిమంది వ్యవసాయ కార్మికులు పల్లెల్లో పొట్టపోసుకోవటం సాధ్యంకాక పట్టణాలకు వలస వెళ్లారు. గుర్తింపు, గౌరవం లేని జీవితానికి సిద్ధపడ్డారు. 2000 సంవత్సరం తర్వాత గానీ ఈ గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న సంక్షోభం నిర్దిష్ట రాజకీయ రూపం తీసుకోవటం ప్రారంభం కాలేదు. దేశవ్యాప్తంగా వ్యవసాయకార్మికోద్యం, ప్రజాసంఘాలూ, ప్రజాతంత్ర వాదులు లేవనెత్తిన డిమాండ్ల ఫలితంగా 2004 ఎన్నికల నాటికి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించటం ప్రధాన రాజకీయ పార్టీల ఎజెండాలో అంతర్భాగం అయ్యింది. అంతకు ముందే ప్రణాళికాసంఘం వంటి పలు కీలక ప్రభుత్వ విభాగాలు చితికిపోతున్న గ్రామీణ ఆర్థిక వ్యవస్థను గుర్తించి, దానికి తగిన పరిష్కారాలు ప్రతిపాదించటం ప్రారంభించాయి. ప్రణాళిక సంఘం రూపొందింన 11వ పంచవర్ష ప్రణాళిక దిశా నిర్దేశ పత్రంలో గ్రామీణ ఆర్థిక సంక్షోభానికి గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కనుమరుగవటం కీలక అంశంగా

భావించి, గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించే ఉపాధిహామీ చట్టం ఒక్కటే ఈ సంక్షోభం నుండి దేశాన్ని బయట పడవేయగలదని నిర్ధారించింది. తదనుగుణంగా రూపొందిందే గ్రామీణ ఉపాధి హామీ చట్టం. గతంలోలాగ ఏదో ఒక సంక్షేమ పథకంతో ఈ సంక్షోభాన్ని తాత్కాలికంగా వాయిదా వేయటానికి పరిమితం కాకుండా నాటి యుపిఏ ప్రభుత్వం వామపక్షాల ఒత్తిడికి తలొగ్గి వ్యవసాయ రంగ ఉత్పాదకతను పెంచేందుకు అవసరమైన పనులు చేపట్టటం ద్వారా అందుకవసరమైన నిధులు ప్రభుత్వం సమకూర్చటం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో చట్టం తెరమీదకు వచ్చింది. కష్టపడేందుకు సిద్ధంగా ఉన్న ప్రతి గ్రామీణ కుటుంబానికీ వర్తించేది ఈ చట్టం. ప్రస్తుతం ఈ చట్టం ఆవశ్యకత, ప్రయోజనాలపై సందేహాలు లేవనెత్తుతున్న శక్తులు, వ్యక్తులే నాడు ఈ చట్టం అవసరాన్ని కూడా ప్రశ్నిస్తూ వచ్చిన విషయాన్ని మనం గుర్తు పెట్టుకోవాలి. అటువంటి వారి వాదన ప్రకారం గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న సంక్షోభానికి, ఆర్థిక సంస్కరణల వైఫల్యానికీ ఏ మాత్రం సంబంధం లేదని నేడు ముందుకు తెస్తున్న వాదన కూడా ఇంచు మించు ఇలానే ఉంది. ఉపాధి హామీ చట్టం అవసరం లేదన్న వాదన ముందుకు తేవటం అంటే ఆర్థిక సంస్కరణలు ఫలప్రదం అయ్యాయన్న మార్కెట్ ఛాందస వాదుల ప్రచారాన్ని ధృవీకరించటం మాత్రమే కాదు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న వాస్తవిక స్థితిని గుర్తించ నిరాకరించటమే. ఉపాధి హామీ చట్టం ద్వారా రైతాంగం నష్టపోతుందని చేస్తున్న ప్రచారం తమ వైఫల్యాలను ఉపాధి హామీ మీదకు నెట్టడమే. ఈ దాడి కార్పొరేట్ ప్రచారమే తప్ప కష్టజీవులకు అక్కరకొచ్చేది కాదు.

ఇటువంటి వారినుద్దేశించే ప్రఖ్యాత ఆర్థిక రాజకీయ వారపత్రిక ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ తన సంపాదకీయంలో " డిమాండ్ ఆధారిత, గ్రామీణ ప్రాంతంలో ప్రజలే లబ్దిదారులను ఎంపిక చేసుకునేందుకు అవకాశం ఇస్తున్న ఇటువంటి చట్టం ప్రయోజనాలను గుర్తించ నిరాకరించే కొందరు విమర్శకులు ఎక్కడో మారుమూల జరిగే లోపాలను ఆధారం చేసుకుని ఈ పథకంపై దుష్ప్రచారం ఎక్కుపెడుతుంటారు" అని హెచ్చరించింది. రెండు సంవత్సరాల క్రితం ఆంధ్రప్రదేశ్‌లోని అమలాపురంలో క్రాప్ హాలీడే పేరుతో ప్రారంభమైన ధనిక రైతాంగం ఆందోళన చివరకు ఉపాధి హామీ వ్యతిరేక ఆందోళనగా మారటం మనం గమనించిందే. ఆ ఆందోళనకు ఆరెస్సెస్ ఇతర పరివార

> **"స్థూలంగా చూస్తే గత తొమ్మిదేళ్ల కాలంలో ఈ చట్టాన్ని అమలు చేయటానికి కేంద్రప్రభుత్వం 2,38,000 కోట్లరూపాయలు వెచ్చించింది. ఇందులో 1,55,000కోట్ల రూపాయలు వేతనాల రూపంలో నేరుగా కార్మికులకు చేరింది. అంటే మొత్తం వ్యయంలో 65.12 శాతం నేరుగా కార్మికుల చేతుల్లోకి చేరింది. మిగిలిన 35 శాతం పరిపాలనా వ్యయం, సామాగ్రి వ్యయం."**




బృందం తెరవెనక పని చేస్తే తాజా ప్రయత్నాలను కార్పొరేట్ సేవకులు బాహాటంగానే బలపరుస్తున్నారు. ఈ చట్టం అమలును సమీక్షించేటప్పుడు హేతుబద్ధత, నిష్పాక్షికత ప్రాథమిక షరతు. ఆర్థిక కోణంలో మాత్రమే చూస్తే విమర్శకుల ప్రశ్నలకు సమాధానాలు దొరకవు. సామాజిక న్యాయం, సామాజిక అభివృద్ధి, మానవీయ అభివృద్ధి కోణంలో చూసినపుడు మాత్రమే ఈ చట్టం ప్రయోజనాలను చూడగలుగుతాము.

**చట్టం అనుభవాలు**

2006లో ఈ చట్టం ప్రారంభమైనప్పటి నుండీ ఈ పథకం తీరుతెన్నులపై విస్తృతమైన పరిశోధనలు జరిగాయి. ఈ పరిశోధనల సారాంశం ఒక్కటే. ఈ పథకం అమల్లో దేశ వైవిధ్యానికి తగ్గట్లు వ్యత్యాసాలు ఉండొచ్చు. స్థూలంగా చూసినప్పుడు ఈ చట్టంవల్ల కలిగిన ప్రయోజనాలను నాల్గురకాలుగా చెప్పుకోవచ్చు. మొదటిది, ఈ చట్టం ద్వారా గ్రామీణ పేదలకు కొంత ఆర్థిక భద్రత కల్పించింది. వ్యవసాయం లోను, బయటా ఉత్పాదకత పెంచే వనరుల సృష్టి జరిగింది. మహిళలు పెద్దఎత్తున ఈ చట్టం ద్వారా లబ్దిపొందటంతో మహిళల సాధికారతతో పాటు శ్రమశక్తి డిమాండ్ పెరిగింది. కనీస వేతనాలను పెంచటంలో ఈ చట్టం కీలక పాత్ర పోషించింది. వలసలు తగ్గాయి. అంతిమంగా బేరమాడే శక్తితో పాటు ఆత్మగౌరవానికి అవకాశం ఇచ్చింది. 2006 ఫిబ్రవరి2న కరువు పీడిత అనంతపురం జిల్లాలో నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్, యుపిఏ ఛైర్‌పర్సన్ చేతుల మీదుగా ప్రారంభమైన ఈ పథకం తొలుత 200 జిల్లాల్లో మొదలై నేడు దేశవ్యాప్తంగా కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు నాగాలాండ్ నుండి నాసిక్ వరకు అన్ని జిల్లాల్లో అమలు జరుగుతోంది. తొమ్మిదేళ్ల కాలంలో ఈ చట్టం గురించి జరిగినన్ని పరిశోధనలు బహుశా మరే చట్టం గురించీ జరగలేదు. ఈ చట్టం ప్రయోజనాలు అధ్యయనం చేయటానికి ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలే కాదు. ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ సంస్థలు కూడా నడుం కట్టాయంటే దేశంలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ఈ చట్టం ప్రభావం ఎంత ఉందో అర్థమవుతుంది.

స్థూలంగా చూస్తే గత తొమ్మిదేళ్ల కాలంలో ఈ చట్టాన్ని అమలు చేయటానికి కేంద్రప్రభుత్వం 2,38,000 కోట్ల రూపాయలు వెచ్చించింది. ఇందులో 155000 కోట్ల రూపాయలు వేతనాల రూపంలో నేరుగా కార్మికులకు చేరింది. అంటే మొత్తం వ్యయంలో 65.12 శాతం నేరుగా కార్మికుల చేతుల్లోకి చేరింది. మిగిలిన 35 శాతం పరిపాలన వ్యయం, సామాగ్రి వ్యయం. సామాగ్రి వ్యయం కూడా పరోక్షంగా వస్తూత్పత్తి రంగానికి చేరుతుంది. అంటే పారిశ్రామిక రంగానికి వెళ్తుంది. 15 శాతం వరకు ఉన్న పరిపాలన వ్యయం కూడా నేరుగా ఉద్యోగుల ఖాతాల్లోకి చేరేదే. ఇక ఎక్కడన్నా అవినీతి ద్వారా నిధుల దుర్వినియోగం జరిగిందంటే అది వస్తు సామాగ్రి కొనుగోళ్లలోనో, కార్మికుల ఖాతాకు వెళ్లే నిధులు పంపకుండా ఉండటం వల్లనో జరిగిన దుర్వినియోగం కూడా పెద్ద మొత్తంలో ఉంది. ప్రత్యక్ష ప్రభావం కోణం నుండి గమనిస్తే ఈ చట్టం వచ్చిన తొమ్మిదేళ్లలో 1565 కోట్ల పనిదినాలు సష్టించబడ్డాయి. 35.45 కోట్ల కుటుంబాలు లబ్ది పొందాయి. ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో చట్టం అమలు పరిశీలిస్తే ఒక్క 2012-13 ఆర్థిక సంవత్సరంలోనే 30 కోట్ల పనిదినాలు కల్పించబడ్డాయి. గత ఆరేళ్ల కాలంలో 50 లక్షల 91 వేల కుటుంబాలకు ఈ చట్టం ద్వారా వంద రోజుల పని

**“సంక్షోభంలో కూరుకుపోయిన గ్రామీణ ఆర్థిక వ్యవస్థ లోకి ఏకంగా రెండు లక్షల కోట్ల రూపాయలు వచ్చి చేరాయి. బహుశా ప్రభుత్వం అమలు జరుపుతున్న పథకాలన్నింటి లోనూ సామాజిక న్యాయాన్ని ఇంతగా ముందుకు తీసుకెళు తున్న పథకం మరోటి లేదు అని స్పష్టంగా చెప్పవచ్చు. దాంతో గ్రామీణ మార్కెట్ లావాదేవీలు కాస్తంత పుంజుకున్నాయి.”**

దొరికింది. ఈ లబ్దిదారుల్లో 53 శాతం మంది మహిళలు, 22 శాతం మంది దళితులు, 16 శాతం మంది ఆదివాసీ వ్యవసాయ కార్మికులు ఉన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అనుభవాలు గమనిస్తే ఉపాధి హామీ లబ్దిదారుల్లో సగానికి సగం మంది వెనకబడిన తరగతులకు చెందిన వారే ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనే 80 శాతం కుటుంబాలు ఉపాధి పనులు చేస్తారు. ఇప్పటివరకు రెండు తెలుగు రాష్ట్రాల్లో రూ. 23,500 కోట్లు వేతనాలుగా పొందారు. 230 కోట్ల పనిదినాలు రెండు రాష్ట్రాల్లో వచ్చాయి. మెటీరియల్‌కు 20 శాతం లోపే ఖర్చు జరిగింది.

సంక్షోభంలో కూరుకుపోయిన గ్రామీణ ఆర్థిక వ్యవస్థలోకి ఏకంగా రెండు లక్షల కోట్ల రూపాయలు వచ్చి చేరాయి. బహుశా ప్రభుత్వం అమలు జరుపుతున్న పథకాలన్నింటిలోనూ సామాజిక న్యాయాన్ని ఇంతగా ముందుకు తీసుకెళుతున్న పథకం మరోటి లేదు అని స్పష్టంగా చెప్పవచ్చు. దాంతో గ్రామీణ మార్కెట్ లావాదేవీలు కాస్తంత పుంజుకున్నాయి. ఈ పరిణామాన్ని గుర్తించిన క్రిసిల్ మార్కెట్ సర్వే సంస్థ “ గత రెండు దశాబ్దాల్లో గ్రామీణ ప్రజల కొనుగోలు శక్తి పట్టణ ప్రాంత ప్రజల కొనుగోలు శక్తికంటే వేగంగా పెరిగింది. దీనికి కారణం వ్యవసాయేతర ఉపాధి అవకాశాలు పెరగటం” అని పేర్కొంది. 2009–2012 మధ్య కాలంలో వ్యవసాయ రంగంలో రెండు లక్షలకోట్లకుపైగా పనిదినాలు పతనం అయినా ఉపాధిహామీ చట్టం కారణంగా గ్రామీణ పేదలు వివిధ అవసరాలు తీర్చుకోవటానికి ఈ కాలంలో 3.75 లక్షల కోట్ల మేర ఖర్చు పెట్టారు. ఆర్థిక విశ్లేషణగా చూస్తే పేదలకు ఈ పథకం ద్వారా సంవత్సరానికి షుమారు 50 వేల కోట్ల రూపాయలు ఆదాయం వస్తే దానికి రెండున్నర రెట్లు అదనపు నిధులు మార్కెట్‌లోకి పంపారు. కానీ ఇదే కాలంలో వివిధ రకాల పన్నుల రాయితీల రూపంలో సంపన్న వర్గాలకు 20 లక్షల కోట్ల వరకు రాయితీలు ఇచ్చినా ఈ వర్గాల ద్వారా మార్కెటలోకి వచ్చింది నామమాత్రమే. సంపన్నులు చేసే వ్యయం కంటే పేదలు చేసే వ్యయం వల్లనే ఆర్థిక వ్యవస్థ మనుగడ సాగిస్తుందని నిర్ధారించటానికి ఈ ఒక్క వివరం సరిపోతుంది.

### ఉపాధి అవకాశాలు

ఈ చట్టం ఆశించిన ప్రయోజనాలు చేకూర్చలేదని, లక్షల కోట్ల రూపాయలు వృధా అయ్యాయన్నది వీరు ముందుకు తెస్తున్న మరో వాదన. ఈ చట్టం 2006లో ప్రారంభమైన నాటి నుండి 2013–2014 ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి ఉపాధి హామీ కోసం కేంద్ర ప్రభుత్వం వెచ్చించిన వ్యయం 238500కోట్లు. మొత్తంగా జాతీయ ఆర్థిక వ్యవస్థను ఇటువంటి కేటాయింపులు సంక్షోభంలోకి నెదుతున్నాయని సంస్కరణవాదులు ప్రచారం చేస్తున్నారు. ఉపాధి హామీ చట్టం అమలుకు ఏటా స్థూల జాతీయోత్పత్తిలో కేవలం 0.5 శాతం మాత్రమే కేటాయిస్తున్నారు. మొత్తం జాతీయ ఆర్థిక వ్యవస్థ కేవలం 0.5 శాతం కేటాయింపుల వల్ల సంక్షోభంలో పడిందని తప్పుడు ప్రచారం చేస్తున్న వాళ్లు కార్పొరేట్ వర్గాలకు కేటాయించిన 34లక్షల కోట్ల గురించి ఎందుకు నోరెత్తటం లేదు ? ఉపాధి హామీ చట్టం అమలుకు కేటాయించిన నిధుల్లో 65 శాతం అంటే 155000 కోట్ల రూపాయలు నేరుగా వ్యవసాయ కార్మికులకు వేతనాల రూపంలో వారి చేతికి చేరింది. 35 కోట్ల కుటుంబాలకు నేరుగా ఆర్థిక ప్రయోజనం చేకూరింది. 1575 కోట్ల పనిదినాలు సృష్టించబడ్డాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో నేరుగా పోగుపడిన మొత్తం 155000 కోట్ల రూపాయలు. దీనివల్ల పైన చెప్పుకున్నట్లు గ్రామీణ ప్రాంతాల్లో కొనుగోలు శక్తి పెరిగింది. ప్రజలు ప్రత్యేకించి వ్యవసాయ కార్మికులు విద్య, వైద్యం వంటి ప్రాథమిక అవసరాలు తీర్చుకోగలుగుతున్నారని పలు పరిశోధనల్లో రుజువు అయ్యింది. ఆ మేరకు వ్యవసాయ కార్మికులు గ్రామీణ పెత్తందారుల ఆధిపత్యం నుండి విముక్తి పొందారు. ఊపిరి తీసుకున్నారు. కానీ సంస్కరణ వాదులకు ఇదంతా “ వృధా వ్యయం”, “ బూడి దలో పోసిన పన్నీరు”లాగా కనిపిస్తోంది. నితిన్ గడ్కరి వంటి వారికి ఇదంతా కేవలం రాజకీయ పక్షపాతం కోసం ప్రభుత్వ నిధుల దుర్వినియో గంలా మాత్రమే కనిపిస్తోంది. కేవలం 0.5 శాతం బడ్జెట్ వ్యయంతో 1575 కోట్ల పని దినాలు సృష్టించగలిగినపుడు పెట్టుబడిదారుల బొక్కసాలు నింపిన 34 లక్షల కోట్ల రూపాయల వ్యయంతో ఎన్ని కోట్ల మందికి ఉపాధి దక్కాలి ? కానీ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగం పరిస్థితి ఏమిటి? ఉపాధి హామీ చట్టంపై తప్పుడు ప్రచారం చేయటం ద్వారా తాము దండుకుం టున్న లాభాలపై ప్రజల దృష్టి పడకుండా చేయటమే కాదు, ఇటువంటి ప్రశ్నలు కూడా లేవనెత్తుకుండా చూడటమే ఉదారవాద మేధావుల లక్ష్యంగా ఉంది. ఈ పథకం మరింత పకడ్బందీగా అమలు జరిగితే ఇంతకాలం ఆయా వర్గాలు సాగిస్తున్న అంతులేని దోపిడీ గురించిన చర్చ ముందుకొస్తుందన్న భయంతో పాటు, గ్రామీణ పేదలపై తమ వర్గ ఆధిపత్యం కొనసాగుతూ ఉండాలన్న రాజకీయ కాంక్షను ఈ ప్రచారం తేటతెల్లం చేస్తోంది. ఈ కుట్రను బహిర్గతం చేయాలి.

ఉపాధి హామీ నిధులు వృధా అవుతున్నాయన్న వాదన పూర్తిగా తప్పుడు వాదన. కేంద్ర, ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ 100 విజయ గాథలు విడుదల చేసింది. ఈ పుస్తకంలో ఉపాధి హామీ నిధుల్లో 35 శాతం భూమి అభివృద్ధికి వెచ్చించినట్లు వివరించింది. 22 శాతం నిధులతో సాంప్రదాయ నీటి వనరులు అభివృద్ధి జరిగింది. మరో 22 శాతం నిధులతో కాలువల పూడిక, గుర్రపుడెక్క ఏరివేత వంటి పనులు చేపట్టారు. 19 శాతం నిధులు వెచ్చించి పంట పొలాలకు, గ్రామాలకు మధ్య ఉన్న లింకు రోడ్ల నిర్మాణం జరిగింది. ఈ వివరాలు పరిశీలిస్తే మొత్తం ఉపాధి హామీ పనుల్లో 79 శాతం నిధులు ప్రత్యక్షంగా వ్యవసాయ అనుబంధ పనులకు వెచ్చించినదే. అందువల్లనే 2014 ఫిబ్రవరిలో అప్పటి యుపిఎ ప్రభుత్వం విడుదల చేసిన నివేదికలో ఈ కాలంలో ఉపాధి హామీ నిధులతో 10 లక్షల ఎకరాల భూమిని సాగులోకి తేవటం జరిగిందని, ఈ నిధులతో వ్యవసాయ కార్మికులే కాక రైతులు, పల్లెసీమలు లబ్ధిపొందాయని వెల్లడించింది. ఈ విధంగా కొంతమేరకు పల్లెలను పచ్చదనంతో నింపటం వృధా పూరిత వ్యయంగా ఎన్డీయే పాలకులకు కనిపిస్తుందంటే ఈ ప్రభుత్వం ఎవరి ప్రయోజనాల కోసం పని చేయనుందో తేటతెల్లమవుతుంది.

**“ ఉపాధి హామీ చట్టం వలన వ్యవసాయ రంగంలో అవసరమైన శ్రమశక్తి అందుబాటులో లేకుండా పోయిందని, శ్రమశక్తి వ్యయం పెరిగిపోయిందని వీరు వాదిస్తున్నారు. ఈ వాదన పరిశీలనకు నిలవదు. పనులు ముమ్మరంగా ఉండే ఒకటి రెండు నెల్లల్లో వ్యవసాయ కార్మికుల కొరత అనాదిగా ఉన్నదే. ఉపాధి హామీ చట్టం వచ్చాక కొత్తగా మొదలైన కొరత కాదు. ”**



గ్రామీణ పేదలకు కాస్త తిండిపెట్టే ఉపాధి పథకం ఉసురు తీయడానికి నరేంద్ర మోడీ ప్రభుత్వం నడుం కట్టింది

వీరు ఉపాధి హామీ చట్టం వలన వ్యవసాయరంగంలో అవసరమైన శ్రమశక్తి అందుబాటులో లేకుండా పోయిందని, శ్రమశక్తి వ్యయం పెరిగిపోయిందన్న వాదిస్తున్నారు. ఈ వాదన పరిశీలనకు నిలవదు. పనులు ముమ్మరంగా ఉండే ఒకటి రెండు నెల్లల్లో వ్యవసాయ కార్మికుల కొరత అనాదిగా ఉన్నదే. ఉపాధి హామీ చట్టం వచ్చాక కొత్తగా మొదలైన కొరత కాదు. సాంప్రదాయంగా చూసుకున్నా గోదావరి డెల్టాలో జులైలోను, కృష్టా డెల్టా ప్రాంతలో ఆగస్టులోనూ పొలం పనులు మొదలయ్యేవి. ఆ సమయంలో వ్యవసాయ కార్మికులు ఒక జిల్లా నుండి మరో జిల్లాకు వలసలు వెళ్లి పనులు చేసేవారు. రుతుపవనాల్లో వచ్చిన మార్పులకు తోడు సాగునీటి పారుదల విషయంలో ప్రభుత్వాల నిర్లక్ష్యం ఫలితంగా రెండు డెల్టా ప్రాంతాల్లోనూ ఏకకాలంలో పనులు ప్రారంభించుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. దాంతో ఏప్రాంతంలోని వ్యవసాయ కార్మికులు ఆప్రాంతంలోనే పనులు చేసుకోవటంతో వ్యవసాయ కార్మికుల కొరత కొట్టచ్చినట్లు కనపడుతోంది. దీన్ని ఉపాధి హామీ చట్టంతో ముడి పెట్టి చట్టం ప్రయోజనంపట్ల దుష్ప్రచారం చేయటానికి పాలకవర్గాలు, ప్రత్యేకించి ధనిక రైతాంగం (ఎవరైతే వలస కూలీలతో తక్కువ వేతనాలకు పనులు చేయించుకుంటున్నారో) సిద్ధపడింది. మధ్యతరగతి ఈ వాదనకు గురియవుతోంది.

చట్టం ప్రకారం పనులు దొరకని సమయంలో వ్యవసాయ కార్మికులు పని వెతుక్కుంటూ గ్రామాలు వదిలిపెట్టి వెళ్లకుండా ఉండటానికి గ్రామం పరిధిలోనే సామాజిక ప్రయోజనంతో కూడిన పనులు చేపట్టాలి. సాధారణంగా వ్యవసాయ పనుల సీజన్ జూన్, జూలైల్లో మొదలై ఫిబ్రవరితో ముగుస్తుంది. ఈ కాలంలో ఉపాధి హామీ చట్టం కింద పనులు జరగవు. వ్యవసాయ పనులు పూర్తయిన తర్వాతనే ఫిబ్రవరి చివరి వారం నుండీ జూన్ మొదటి వారం మధ్యలోనే ఈ చట్టం కింద పనులు చేపట్టడం జరుగుతుంది. ఈ వాస్తవాన్ని పక్కన పెట్టి ఈ చట్టం వచ్చినందునే వ్యవసాయ పనులకు కార్మికులు కరువవుతున్నారన్న వాదన ముందుకుతెస్తున్నారు భూస్వాములు, వారి ప్రాపకం పొందిన పాలకవర్గాలు. ఒక్క ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ వరకే చూసుకుంటే కోటి ఎకరాల్లో వరి, 50 లక్షల ఎకరాల్లో పత్తి, 5 లక్షల ఎకరాల్లో మిర్చి, 5.5 లక్షల ఎకరాల్లో చెరకు పంట వేస్తారు. మొత్తంగా సగటున 200 కోట్ల పనిదినాలు లభ్యమవుతున్నాయి. మొత్తంగా రాష్ట్రంలో ఉపాధి చట్టం ద్వారా ఏటా 30 కోట్ల పనిదినాలు మాత్రమే సృష్టించబడుతున్నాయి. మొత్తం పనిదినాల్లో ఇది కేవలం 15 శాతం. ఈ 30 కోట్ల పనిదినాల్లో కూడా ఏప్రిల్ – జూలై మధ్య కాలంలో 80 శాతం పనిదినాలు కల్పించబడ్డాయి. మిగిలిన సంవత్సరం అంతా కలిపి 20 శాతం పనిదినాలు మాత్రమే కల్పించబడ్డాయి. చూడదల్చుకున్న వాళ్లకు ఈ వాస్తవాలు కనిపించకుండా పోయే పరిస్థితి లేదు. కేవలం వ్యవసాయ కార్మికులు, వృత్తిదారులు, పేదలను అణచివేయటానికి, చట్టం గురించి అవాస్తవాలు, కల్పితాలు ప్రచారం చేయటానికి సిద్ధపడిన వాళ్లకు మాత్రమే ఈ వాస్తవాలు కనిపించవు.

ఇక్కడే మరో విషయం కూడా చెప్పాలి. ఇప్పటి వరకు గ్రామీణ భారతదేశంలో ఎక్కడా కనీస వేతనాల చట్టం అమలు జరుగుతున్న పరిస్థితి లేదు. చట్టం అమలు కాగితాలకే పరిమితం అయింది. ఈ మధ్య కాలంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామీణ సామాజిక ఆర్థిక సర్వేలో కనీస వేతనాల చట్టం ఏ గ్రామంలోనూ అమలు జరపటం లేదని తేటతెల్లం అయ్యింది. రైతులే ఈ విషయాన్ని నిర్ధారించారు. నిర్ధారిత వేతనాల కంటే తక్కువ వేతనాలతో పని చేయించుకుంటున్నారు. కానీ ఈ చట్టం వచ్చిన తర్వాత ఎంతో కొంత వేతనాలు పెంచాల్సిన పరిస్థితి వచ్చిందని రైతులే స్వయంగా వెల్లడించారు. అంటే ఈ చట్టం అమలు ప్రారంభమైన తర్వాత వేతనాల విషయంలో వ్యవసాయ కార్మికులు ఎంతో కొంత బేరమాడగలుగుతున్నారు. గతంలో వలె భూస్వాములు కోరుకున్న పద్ధతుల్లో నామమాత్రపు వేతనాలకు వ్యవసాయ కార్మికులు పనికి వెళ్లటానికి సిద్ధం కావటం లేదు. చిన్న సన్నకారు రైతులకు ఉపాధి హామీ చట్టం ద్వారా వచ్చిన ఆదాయం ప్రారంభ వ్యవసాయ పనులకు పెట్టుబడిగానో, పిల్లల చదువులకు, అకస్మాత్తుగా వచ్చిపడే ఆరోగ్య అవసరాలు తీర్చుకోవటానికి పెద్ద వనరుగా ఉపకరిస్తున్నాయి. ఇటువంటి సందర్భాల్లోనే వ్యవసాయ కార్మికులు అప్పుల ఊబిలోకి కూరుకుపోయి ధనిక రైతాంగం చెప్పుచేతల్లో మనగాల్సిన పరిస్థితి గతంలో ఉండేది. పలు జిల్లాల్లో జీతగాళ్లు, పాలేర్లను పలకరిస్తే ఇవే వెతలు వెలుగు చూశాయి. వ్యవసాయ కార్మికులు తమ చెప్పుచేతల్లో అణిగిమణిగి ఉండాలని కోరుకునే ధనిక రైతాంగం ఈ వాస్తవాన్ని మసిబూసి మారేడుకాయ చేయటానికి ఉదారవాద మేధావులుగా పిలువబడుతున్నవారు అసలు వ్యవసాయ కార్మికులు పనిచేయటానికే సిద్ధం కావటం లేదని బూటకపు ప్రచారానికి దిగారు. ఉపాధిహామీ

> **❝ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను కొంతమేరకు పట్టాల మీదకు తేవడానికి ఉపయోగపడే ఈ చట్టంపై పాలక వర్గాలు పెద్దఎత్తున దాడి ప్రారంభించాయి. ఒక పద్ధతి ప్రకారం జరుగుతున్న ఈ రాజకీయ, ఆర్థిక, సామాజిక, సైద్ధాంతిక దాడికి నాడు ప్రతిపక్షంగా, నేడు అధికార పక్షంగా ఉన్న బిజెపి నాయకత్వం వహిస్తోంది. ❞**

చట్టంపై జరుగుతున్న దుష్ప్రచారం వెనక ఉన్న ఈ వర్గ స్వభావాన్ని గుర్తించలేకపోతే మోసపోయే ప్రమాదం ఉంది. నిజంగా రాష్ట్రంలోనూ, దేశంలోనూ వ్యవసాయ కార్మికులు పని చేయటానికి సిద్ధం కాకపోతే కోట్ల ఎకరాల పంట పొలాలు బీళ్లు బారతాయి. లక్షల టన్నుల ఆహార ధాన్యాలు ఎఫ్‌సిఐ గోదాములకు చేరవు. పత్తి, మిర్చి, పొగాకు వంటి వాణిజ్య ఉత్పత్తుల ఎగుమతుల ద్వారా ప్రభుత్వానికి లక్షల కోట్ల రూపాయల విదేశీ మారకద్రవ్యం సమకూరదు. అంతేకాదు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం నిర్వహించిన అధ్యయనం నుండి ఉపాధి ప్రభావాన్ని అంచనా వేయటానికి ఆరు గ్రామాల్లో వ్యవసాయ కార్మికుల వేతనాలను పరిశీలించటం జరిగింది. ఈ ఆరు గ్రామాల్లో వ్యవసాయ కార్మికులు సంపాదించే మొత్తం ఆదాయంలో 15 శాతం ఉపాధి హామీ చట్టం అమలు ద్వారానే వస్తోంది. ప్రస్తుతం కేంద్రం ప్రకటించిన సవరణల పర్యవసానంగా రానున్న సంవత్సరం నుండి ఈ గ్రామాలో ఉపాధి హామీ చట్టం అమలు కాబోవటం లేదు. అంటే ఆయా గ్రామాల్లోని వ్యవసాయ కార్మికులు 15 శాతం ఆదాయన్ని ఉన్న ఫళంగా కోల్పోతున్నారు. తిరిగి అప్పుల ఊబిలోకి చేరిపోనున్నారు. పాలకవర్గాలు కోరుకుంటున్నది ఇదే. వ్యవసాయ కార్మికులు స్వంత కాళ్లపై నిలబడం ఈ పెత్తందారీ వర్గాలకు కంటగింపుగా వుంది.


గ్రామీణ ఆర్థిక వ్యవస్థను కొంతమేరకు పట్టాల మీదకు తేవడానికి ఉపయోగపడే ఈ చట్టంపై పాలకవర్గాలు పెద్దఎత్తున దాడి ప్రారంభించాయి. ఒక పద్ధతి ప్రకారం జరుగుతున్న ఈ రాజకీయ, ఆర్థిక, సామాజిక, సైద్ధాంతిక దాడికి నాడు ప్రతిపక్షంగా, నేడు అధికార పక్షంగా ఉన్న బిజెపి నాయకత్వం వహిస్తోంది. ఒక వైపున మేడ్ ఇన్ ఇండియాను కాస్తా మేక్ ఇన్ ఇండియా నినాదంగా మార్చిన ప్రధాని ఈ దేశంలో కారుచౌకగా శ్రమ శక్తి అందుబాటులో ఉంచుతామని అమెరికా మొదలు ఆస్ట్రేలియా వరకు జరిగిన అన్ని విదేశీ పర్యటనల్లోనూ విదేశీ, స్వదేశీ పెట్టుబడిదారులకు హామీ ఇస్తున్నారు. శ్రమ శక్తిని కారుచౌకగా అందుబాటులోకి తేవాలంటే శ్రమశక్తి విలువను తెలియచెప్పే ఇటువంటి చట్టాలు ఉండకూడదన్నది పెట్టుబడిదారుల అవగాహన. అంతేకాదు. ఈ చట్టం శ్రామికులకు నిర్దిష్ట హక్కులు కల్పిస్తోంది. ప్రభుత్వంపై నిర్దిష్ట బాధ్యత మోపుతోంది. ఉదారవాద సంస్కరణలు అంటేనే మొత్తం మార్కెట్‌కు వదిలేయటం. ప్రభుత్వానికి ఏ విషయంలోనూ ఎటువంటి పాత్ర ఉండకూడదు. ఒక్క పెట్టుబడికి లాభాలు సమకూర్చే బాధ్యత తప్ప మరే బాధ్యతా ఉండకూడదు. కానీ ప్రపంచీకరణ విధానాల్లోని ఈ మౌలిక స్వభావానికి భిన్నంగా ఉంది ఉపాధి హామీ చట్టం. ప్రతి ఏటా అర్హత కలిగిన వారందరికి అడిగిందే తడవుగా ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై పెడుతోంది ఈ చట్టం. అందుకే విదేశీ గుత్తపెట్టుబడికి ఊడిగం చేయదల్చుకున్న ఈ ప్రభుత్వానికి ఉపాధి హామీ చట్టం అంటేనే మోయలేని భారంగా ఉందని మాట్లాడుతున్నారు. ఉపాధి నిధులు కత్తిరించి కార్పొరేట్‌లకు కట్టబెట్టేందుకే ఈ గోబెల్స్ వాదనలన్నీ. ప్రభుత్వం ప్రతిపాదించిన సవరణలు చట్టాన్ని బలోపేతం చేసే సవరణలు కాదు. చట్టానికి ఉన్నకోరలు పీకి నిర్వీర్యంచేసే చర్యలు. క్లుప్తంగా చూస్తే ప్రభుత్వం ప్రతిపాదించిన సవరణలు ఇలా ఉన్నాయి.

డిమాండ్ ఆధారిత చట్టంగా కాకుండా ప్రభుత్వ ఇష్టాయిష్టాలతో అమలు జరిగే చట్టంగా మార్చాలన్న ప్రతిపాదన మొదటిది. అందుకే గ్రామ గ్రామాన ఈ చట్టం అమలు జరిపేందుకు స్థానిక స్వపరిపాలనా సంస్థలే నిర్ణయం తీసుకునే పద్ధతి నుండి అధికారులే ఎక్కడ ఏ పని చేపట్టాలి అన్నది ప్రభుత్వ అధికారులే నిర్ణయించే పద్ధతికి మార్చాలన్న ప్రతిపాదన ముందుకు తెచ్చింది. ఇందులో భాగంగా వచ్చే ఆర్థిక సంవత్సరానికి కనీసం 60 శాతం పనులు జిల్లా స్థాయిలోనే నిర్ణయించాలని తాజా సవరణలు నిర్దేశిస్తున్నాయి. ఒక రెండో ముఖ్యమైన సవరణ దేశవ్యాప్తంగా అమలు జరుగుతున్న చట్టాన్ని పీల్చి పిప్పి చేసి దేశంలోని కొన్ని మారు మూల ప్రాంతాలకు పరిమితం చేయాలన్న సవరణ. తద్వారా మిగిలిన దేశంలోని శ్రమశక్తిని కబళించటానికి దేశీయ, విదేశీ ప్రైవేటు పెట్టుబడికి పూర్తి అవకాశం కల్పించాలన్నది ప్రభుత్వం యోచనగా ఉంది. ఇది చట్టాన్ని ఉల్లంఘించటం తప్ప వేరుకాదు. అందుకే ప్రభుత్వం "సమర్థవంతమైన అమలు" కోసం ఈ చట్టాన్ని కొన్ని ప్రాంతాలకు పరిమితం చేస్తున్నామని సన్నాయి నొక్కులు నొక్కుతోంది. విస్తారంగా అమలు జరిగినందునే ఈ పథకం ఆశించిన ప్రయోజనాలు ఇవ్వలేక పోయిందన్న నిరాధారమైన విశ్లేషణలను ఈ సందర్భంగా ముందుకు తెస్తున్నారు. ఇక మూడో ముఖ్యమైన సవరణ మొత్తం బడ్జెట్‌లో శ్రమశక్తి వాటా 51 శాతానికి పరిమితం చేసి యంత్రాలు, సామాగ్రి వాటా 49 శాతానికి పెంచటం. ఇప్పటి వరకు కేటాయించిన మొత్తంలో శ్రమశక్తి వాటా 60 శాతంగా ఉండేది. 70 శాతం వరకు వ్యవసాయ కార్మికులకు వేతనాల రూపంలోనే అందింది. సామాగ్రి, యంత్రాల వాటా 40 శాతంగా నిర్ధారించుకున్నప్పకీ 20 శాతానికి మించి ఈ పద్దుకింద ఖర్చు కాలేదు. అటువంటిది ఇప్పుడు ప్రభుత్వం ఏకంగా 49 శాతం వరకు తప్పనిసరిగా యంత్రాలు, సామాగ్రి కోసం వెచ్చించాలని సవరణ చేసింది. అంతేకాదు. శ్రమశక్తితో పూర్తి చేయలేని పనులను పూర్తి చేయటానికి యంత్రాలు ఉపయోగించాలన్న సవరణ కూడా తెచ్చింది. ఇప్పటి వరకు ఈ పథకంలో రెండున్నరలక్షలకోట్ల రూపాయల మేర ఖర్చు జరిగినా కాంట్రాక్టర్ల వ్యవస్థ ఆధిపత్యం వహించలేదు. తాజా సవరణల వల్ల ఇంతకాలం ఎండిన చెరువులో నోళ్లు తెరుచుకున్న కప్పల మాదిరిగా ఉన్న కాంట్రాక్టర్లు అవినీతి ద్వారా పెద్దఎత్తున సంపాదించుకునేందుకు అవకాశం కలుగుతోంది. తాజాగా ముగిసిన ఎన్నికల్లో ఈ కాంట్రాక్టర్ల లాబీయే అటు తెలుగుదేశం, ఇటు బిజెపిలకు బాహటంగా మద్దతు పలికిందన్న వాస్తవాన్ని ఇక్కడ గుర్తుకుతెచ్చుకోవటం సముచితంగా ఉంటుంది. ఈ పథకం అమల్లో అవినీతి లేదని చెప్పలేము. అవినీతి నిధులు విడుదల చేయటం మొదలు వేతనాలు బ్యాంకుల్లో డిపాజిట్ చేయటం వరకు వివిధ దశల్లో జరుగుతుంది. మొత్తం పథకం కల్గించిన సానుకూల ప్రయోజనాలు కొండంత అయితే చోటుచేసుకుంటున్న అవినీతి కూడా క్రమంగా

> **"తాజా సవరణల ద్వారా దేశవ్యాప్తంగా 6,576 బ్లాకుల్లో అమలు జరుగుతున్న ఈ చట్టాన్ని 2,500 బ్లాకులకు పరిమితం చేయనున్నారు. ఇందులో భాగంగా తెలంగాణలో 443 మండలాల్లో అమల్లో ఉన్న ఈ పథకాన్ని 78 మండలాలకు, ఆంధ్రప్రదేశ్‌లో 655 మండలాల్లో కొనసాగుతున్న ఉపాధి హామీని 146 మండలాలకు కుదించనున్నారు."**

పెరుగుతోంది. అదికూడా అధికారులు, రాజకీయ నాయకుల చేతివాటం వల్ల జరుగుతున్న అవినీతే తప్ప లబ్దిదారుల ద్వారా జరుగుతున్న అవినీతి చాలా స్వల్పం. దీన్ని నియంత్రించటం, సదరు నిధులు కూడా లబ్దిదారులకు అందేలా చూడటం సాధ్యమైన పనే. నాడు రాజీవ్‌గాంధీ మొదలు నిన్న చిదంబరం, నేడు అరుణ్‌జైట్లీ వరకు అందరూ సంక్షేమ పథకాల గురించి చేసే విమర్శ ఒక్కటే. రూపాయి సంక్షేమం కోసం ఖర్చు పెడితే 25 శాతం కూడా లబ్దిదారులకు చేరటం లేదు అన్నది. ఈ చట్టం ఇటువంటి ప్రభుత్వ ప్రచారాన్ని పటాపంచలు చేస్తోంది. మొత్తం వ్యయంలో పైన చెప్పుకున్నట్లు కేవలం వేతనాల రూపంలో లబ్దిలదారులకు 65 శాతం చేరుతోంది. సామాజిక వనరుల సృష్టి ద్వారా కలిగిన ప్రయోజనాలు కూడా కలుపుకుంటే లబ్దిదారులకు కలుగుతున్న ప్రయోజనం ఎక్కువగానే ఉంటుంది. ఇంత మొత్తం నిధులు నేరుగా పేదలకు చేరుతున్నాయి కాబట్టే పాలక వర్గాలకు, పెత్తందార్లకు కంటగింపుగా ఉంది.

ఇక తాజా సవరణలు రెండు తెలుగు రాష్ట్రాలపై ఏ విధమైన ప్రభావాన్ని చూపించనున్నాయో పరిశీలిద్దాం. తాజా సవరణల ద్వారా దేశవ్యాప్తంగా 6576 బ్లాకుల్లో అమలు జరుగుతున్న ఈ చట్టాన్ని 2500 బ్లాకులకు పరిమితం చేయనున్నారు. ఇందులో భాగంగా తెలంగాణలో 443 మండలాల్లో అమల్లో ఉన్న ఈ పథకాన్ని 78 మండలాలకు, ఆంధ్రప్రదేశ్‌లో 655 మండలాల్లో కొనసాగుతున్న ఉపాధి హామీని 146 మండలాలకు కుదించనున్నారు. అంటే మొత్తం 1108 మండలాల్లో వ్యవసాయ కార్మికులకు ప్రయోజనం కల్పించే ఈ పథకం రానున్న కాలంలో కేవలం 224 మండలాల వ్యవసాయ కార్మికులకు మాత్రమే పరిమితం కానుంది. పైన చెప్పినట్లు బాగా వెనకబడిన మండలాలు, బ్లాకుల్లో ఫలప్రదంగా అమలు జరుపుతామని ప్రభుత్వం వెనకబాటుతనానికి కొన్ని కొలబద్దలు నిర్ధారించింది. అత్యధికంగా దళిత, ఆదివాసీ జనాభా కలిగి ఉండటం మానవాభివృద్ధి సూచికల్లో వెనకబడి ఉండటం వంటి కొలబద్దలు అవి. ఈ ప్రాతిపదికన చూసుకున్నా తెలంగాణలో 31 ఎస్సీ, ఎస్టీ గ్రామీణ రిజర్వుడు నియోజకవర్గాలు ఉన్నాయి. వీటిల్లో 157 మండలాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 36 ఎస్సీ, ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గాల్లో 172 మండలాలు ఉన్నాయి. ఇందులో తాజా సవరణల ప్రకారం వచ్చే సంవత్సరం నుండి ఉపాధజ హామీ చట్టం 47 మండలాల్లో మాత్రమే ఈ పథకం అమలు జరగనుంది.




ప్రభుత్వ పోస్టర్ : గ్రామీణ ఉపాధిపథకం ప్రభుత్వం ఇచ్చిన దానం కాదు పేదల హక్కు

రెండు తెలుగు రాష్ట్రాల్లో కేంద్ర ప్రభుత్వ సవరణల వల్ల 884 మండలాలు నష్టపోతాయి. ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల్లో కూడా 248 మండలాల్లో ఉపాధి రద్దవుతుంది. పైగా కొత్త ప్రాతిపదిక ప్రకారం పర్వతప్రాంత గిరిజనులు, ఆదివాసీలు, అక్షరాస్యత వంటి అనేక సూచికల్లో బాగా వెనకబడిన ప్రాంతాల్లో మాత్రమే అమలు జరుగుతుంది. ఈ లెక్కన యాభై శాతానికి పైగా ఒబిసిలు నివసిస్తున్న మండలాలన్నీ ఈ పథకం పరిధి నుండి మినహాయించబడ తాయి. ఈ మేరకు బడ్జెట్ కేటా యింపులు కూడా కుదింపుకు గురి కానున్నాయి. ఆశ్చర్యం ఏమిటంటే ఈ మండలాలు కూడా వెనకబడిన మండలాల జాబితాలో స్థానం సంపాదించు కోవటంలో విఫలం అయ్యాయి. ఈ ఒక్క ఉదాహరణ చాలు ప్రభుత్వం ఎంపిక చేసిన మండ లాల జాబితా ఎంత అవకతవక లతో నిండి ఉందో తెలుసుకోవటానికి. నిరంతరం కరువుపీడిత ప్రాంతంగా గుర్తింపు పొంది లక్షలాది మంది వలసకూలీలకు కేంద్రమైన మహబూబ్‌నగర్ జిల్లాలో 64 మండలాలకు గాను కేవలం 10 మండలాలు మాత్ర మే ఈ జాబితాలో చేర్చారు. ఇటువంటి గోబెల్స్ ప్రచారంతో నందిని పందిగా పందిని నంది గా చూపటంలో సిద్ధహస్తులైన సంఘపరివారానికి సంతకెళ్లే రైతు భుజాన ఉన్న మేకను కుక్కపిల్లగా చూపించగల కార్పొరేట్ మీడియా తోడైతే పేదల గొంతులు కోయటానికి తడిగుడ్డ కూడా అవసరం ఉండదు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి అంత చిత్తశుద్ధి ఉంటే వీరికి ఉపాధి పనిని 200 రోజులకు పెంచ వచ్చు.

అంతేకాదు. వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం వద్ద వివిధ మంత్రిత్వ శాఖల్లో అనేక పథకాలు ఉన్నాయి. వాటికి బడ్జెట్ కేటాయింపులూ ఉన్నాయి. కానీ ప్రభుత్వం ఆయా పథకాలు ద్వారా వెనకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేయటానికి బదులు ఉపాధి హామీ నిధుల ద్వారా ఈ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని చూస్తోంది. అంటే ఆయా పథకాలు ఇప్పటి వరకు కొనసాగిస్తూ వచ్చిన స్వతంత్ర ప్రాతిపదిక ఇకపై రద్దు కానున్నదని బిజెపి ప్రభుత్వం చెప్పకనే చెప్తోంది. అదే విధంగా ఈ పథకాన్ని వ్యవసాయ రంగంతో అనుసంధానం చేయాలని, చిన్న మధ్య తరహా నీటిపారుదల సౌకర్యాలను ఈ నిధుల ద్వారా అభివృద్ధి చేయాలని కూడా ప్రభుత్వం వాదిస్తోంది. ఫలితం రానున్న కాలంలో చిన్న మధ్యతరహా నీటి పారుదల పథకాలకు ప్రభుత్వ కేటాయింపులు శూన్యం కానున్నాయి. ఈ విషయాలను కప్పిపుచ్చటం కోసం ఉపాధి హామీ అమలుపై కాకిలెక్కలు విడుదల చేస్తున్నారు. స్థూలంగా చూసినపుడు ఈ చట్టాన్ని నీరుగార్చటానికి కేవలం ప్రభుత్వ దయాదాక్షిణ్యాలతో అమలు జరిగే పథకంగా మార్చటానికి ప్రభుత్వం భూమిక సిద్ధం చేసింది. ప్రజా పంపిణీ వ్యవస్థ మొదలు పెన్షన్ల వరకు ఇలా ప్రభుత్వ దయా

> **"కేంద్రప్రభుత్వం ప్రతిపాదిస్తున్న సవరణల వల్ల నష్టపోతోంది కేవలం వ్యవసాయ కార్మికులే కాదు, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా. ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి చట్టం ద్వారా వచ్చే నిధులను అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగించాయి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు. ప్రత్యేకించి ఉమ్మడి తెలుగు రాష్ట్రాలు. ఇప్పుడు ఐపిపిఇ కసరత్తు పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా అమలు జరుగుతున్న ఈ పథకాన్ని కుదిస్తున్నారు. గత సంవత్సరం కేటాయించిన నిధులతో పోల్చి చూస్తే సగం నిధులు కోత పడనున్నాయి."**

దాక్షిణ్యాలపై ఆధారపడి అమలు జరిగే పథకాలు అనేకం ఉన్నాయి. వీటన్నింటిలో వస్తున్న మార్పులు మనం గమనించవచ్చు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా తమ ఇష్టం వచ్చినట్లు ఈ పథకాలను, ప్రయోజనాలను కుదిస్తూ పోతున్నాయి. నేడు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో లక్షలాది మంది అర్హులైన పెన్షన్‌దారులు పెన్షన్ పొందే పరిస్థితి లేదు. అర్హులైన పేదలు ప్రజా పంపిణీ వ్యవస్థ నుండి సరుకులు తీసుకునే పరిస్థితి లేదు. ఒక వైపున స్వచ్ఛ భారత్ అభియాన్ పేరుతో ప్రధాని వాడవాడలా మరుగుదొడ్లు నిర్మించుకోమని పిలుపునిస్తున్నారు. మరోవైపున రాష్ట్ర ప్రభుత్వాలు ఇంట్లో మరుగుదొడ్డి ఉంటే పెన్షన్‌దారులను లబ్దిదారుల జాబితా నుండి తొలగిస్తున్నారు. గ్రామీణ విద్యుదీకరణ పథకం ద్వారా ప్రతి ఇంట్లో దీపం పెడతామని వాగ్దానాలు చేసి అధికారానికి వచ్చిన ప్రభుత్వాలు అదే పేదల ఇంటికి కరెంట్ కనెక్షన్ ఉండి కాబట్టి రేషన్ కార్డు కోత కోస్తున్నారు. రానున్న కాలంలో ఉపాధి హామీ చట్టం విషయంలో ఇలా చేయాలంటే పార్లమెంట్ ఆమోదం లేనిదే సాధ్యం కాదు. ఆఖరికి అమెరికాతో కుదుర్చుకున్న అణు ఇంధన ఒప్పందాన్ని సైతం ప్రభుత్వం ప్రధాని కార్యాలయంలో కూర్చుని మార్పులు చేర్పులు చేయగలుగుద్దేమో కానీ ఉపాధిహామీ చట్టంలో మార్పులు చేయాలంటే మాత్రం పార్లమెంట్‌కు ఖచ్చితంగా వచ్చి తీరాలి. అందుకేప్రభుత్వం పార్లమెంట్ బయట చేయగలిగిందంతా చేస్తోం ది. తద్వారా బక్కచిక్కిన, బలహీనపడ్డ ఈ చట్టం ప్రతిపాదిత లక్ష్యాల సాధనకు సరిపోవటం లేదని అప్పుడు పార్లమెంట్‌లో సవరణలు తెచ్చేందుకు, చట్టాన్ని పథకంగా మార్చేందుకు, రాష్ట్రాలకు ఈ పథకాన్ని వదిలేసి కేంద్రం కొంత గ్రాంట్ ఇన్‌గా ఇచ్చి బలహీనపరిచేందుకు, రాష్ట్రాలపై భారం పెంచి తనపై వ్యతిరేకత రాకుండా చూసుకోడానికి కేంద్ర ప్రభుత్వం నడుం బిగించింది.

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న సవరణల వల్ల నష్టపోతోంది కేవలం వ్యవసాయ కార్మికులే కాదు. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా. ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి చట్టం ద్వారా వచ్చే నిధులను అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగించాయి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు. ప్రత్యేకించి ఉమ్మడి తెలుగు రాష్ట్రాలు. ఇప్పుడు ఐపిపిఇ కసరత్తు పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా అమలు జరుగుతున్న ఈ పథకాన్ని కుదిస్తున్నారు. గత సంవత్సరం కేటాయించిన నిధులతో పోల్చి చూస్తే సగం నిధులు కోత పడనున్నాయి. తాజాగా కర్నాటక ప్రభుత్వం 550 కోట్లకు ప్రతిపాదనలు పంపితే కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కేవలం ఒక్క కోటి రూపాయలు విడుదల చేసింది. ఉపాధి హామీ చట్టం అమల్లో అగ్రగామిగా ఉన్న త్రిపురకు కేటాయించిన నిధుల్లో దాదాపు సగం నిధులు కోతపడ్డాయి. రెండు తెలుగు రాష్ట్రాలకూ గతంలో 7 వేల కోట్లు ఇస్తే ఇప్పుడు 4 వేల కోట్లకు కత్తిరించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలు ఉపాధి హామీ నిధులు దృష్టిలో పెట్టుకుని గ్రామీణ ప్రాంతాలకు పలు వరాలు ప్రకటించాయి. ముందే చెప్పుకున్నట్లు ఉపాధి హామీ నిధుల్లో 44 శాతం నిధులు నీటివనరుల అభివృద్ధికి వెచ్చించాయి ప్రభుత్వాలు. ఇదే తరహాలో తెలంగాణ ప్రభుత్వం మావూరు – మా ప్రణాళికకు, చెరువుల మరమ్మతుకు ఉపాధి హామీ నిధులు వెచ్చించేందుకు సిద్ధమైంది. అదేవిధంగా పేదలకు ఇందిరా ఆవాస్ యోజన పథకం ద్వారా కేటాయించే ఇళ్ల నిర్మాణానానికి, హరిత తోరణం వంటి పథకాలకు కూడా ఈ నిధులు వెచ్చించే విధంగా బడ్జెట్ ప్రతిపాదించింది. కానీ కేంద్ర ప్రభుత్వం చర్యలతో తెలంగాణ ప్రభుత్వంపై పెద్దఎత్తున ఆర్థిక భారం పడనుంది. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ కేంద్ర సవరణలను వ్యతిరేకిస్తూ తీర్మానం చేసింది. మణిక్ సర్కార్ చేపట్టిన నిరసనను సమర్థించటం ఈ కోణంలో చూడాల్సి ఉంది. చంద్రబాబు వైఖరి దీనికి పూర్తిగా భిన్నంగా ఉంది. ఉపాధి హామీ చట్ట సవరణ పట్ల కనీస నిరసన కూడా వ్యక్తం చేయలేదు. కానీ జన్మభూమి – మావూరు పేరు మీద పల్లెలను అభివృద్ధి చేస్తామని ఓటిపలుకులు పలుకుతున్నారు. ఈ సంవత్సరం ప్రతిపాదించిన బడ్జెట్‌లో గ్రామీణాభివృద్ధి శాఖకు కనీస నిధులు కూడా కేటాయించలేదు. నిధులు లేకుండా, కేంద్ర ప్రభుత్వ మద్దతు లేకుండా గ్రామీణాభివృద్ధి అంటే సదరు పనులన్నీ కాంట్రాక్టర్లకు అప్పగించి ఆ భారాన్ని పంచాయితీలపై మోపటమే తప్ప మరోటి కాదు. ఇటువంటి కుతంత్రాలను బట్టబయలు చేయాలి. ఉపాధి హామీ పరిరక్షణలో కలిసి వచ్చే రాష్ట్రాలను కలుపుకోవాలి. ఉపాధి హామీ ప్రయోజనాల గురించి పలువురు మేధావులు, పలు సంస్థలు అనేక విశ్లేషణాత్మక ప్రచురణలు వెలువరించాయి. ప్రభుత్వ దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టేందుకు ఈ సమాచారాన్ని విరివిగా ప్రజల ముందుకు తేవాలి. పథకం పైన చెప్పుకున్నట్లు ఉపాధి హామీ గురించి వచ్చిన అధ్యయనాలు కోకొల్లలు. ఈ అధ్యయనాల సారాంశాన్ని క్రోడీకరిస్తూ ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ తన సంపాదకీయంలో ఇలా చెప్పింది. ఈ చట్టం వల్ల గ్రామీణ పేదలకు కాస్తంత ఆదాయ భద్రత సమకూరింది. వ్యవసాయంలోనూ, వ్యవసాయం బయటా సామూహిక సామాజిక ప్రయోజనాలు సమకూర్చే వనరుల నిర్మాణం జరిగింది . పెద్దఎత్తున ఈ పథకం ద్వారా లబ్దిపొందిన మహిళలు ఆర్థికంగా చైతన్యవంతులయ్యారు. సాధికారవంతులయ్యారు. శ్రమికుల వేతనాలు కొంత మెరుగయ్యాయి. అంతేకాదు. నవంబరులో గ్రామీణాభివృద్ధి శాఖ ఆధీనంలో పనిచేసే జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ (ఎన్ఐఆర్‌డి) నిర్వహించిన జాతీయ సెమినార్‌లో పాల్గన్న వక్తలు ఈ చట్టం వల్ల ఆయా రాష్ట్రాల్లో కలిగిన ప్రయోజనాలను ఏకరువు పెట్టారు. ప్రత్యేకించి ఈ చట్టం ద్వారా వెచ్చించే ప్రతి రూపాయికి ఆర్థిక వ్యవస్థలో రెండు రూపాయల మేర ప్రయోజనం చేకూరిందని ఇద్దరు విశ్లేషకులు సెమినార్ దృష్టికి తెచ్చారు. అలా అని ఈ చట్టం అమలో సమస్యలే లేవనుకుంటే పొరపాటు. అయితే ఈ సమస్యలు ఎవరిద్వారా వస్తున్నాయన్న విషయాన్ని గమనిస్తే తప్ప సరైన పరిష్కారం చూపించటం సాధ్యం కాదు. ప్రభుత్వ విధానాలు, పరిపాలన చర్యల ఫలితంగా తలెత్తే సమస్యలకు కూడా వ్యవసాయ కార్మికులను బాధ్యలను చేసి వారిని బలిచేయటానికి ప్రభుత్వం పూనుకోవటం దాని వర్గ స్వభావాన్ని బట్టబయలు చేస్తోంది. ఈ కుట్రలను బహిర్గతం చేసి ఉపాధి హామీ చట్ట పరిరక్షణకు విశాల దేశవ్యాపిత ఉద్యమం నిర్మించాల్సిన సమయం ఆసన్నమైంది. ●

**ఈ మాసం ప్రత్యేకం**

# చైనాలో చతుర్రుగ్మతలపై 'మాస్ లైన్ 'ఉద్యమం : ఒక పరిశీలన



రచయిత చైనాలోని కన్మో విశ్వవిద్యాలయంలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు.

**డా॥ కె. రవీంద్ర బాబు**

**చైనా సమాజంలో చెలరేగుతున్న ఈ చతుర్రుగ్మతలకు చెక్ పెట్టడంలో చైనా పార్టీ చేపట్టిన 'మాస్ లైన్' ఉద్యమం కొంతమేరకు విజయవంతం అయిందనడంలో సందేహం లేదు. ఈ ఉద్యమం యువతరానికి కొత్త ఉత్సాహాన్ని ఇవ్వడంతోబాటు నిజాయితీగా పనిచేస్తున్న లక్షలాది పార్టీ సభ్యుల్లో ఆత్మ విశ్వాసాన్ని నింపింది.**

చైనాలో గత సంవత్సరం నుండి ప్రభుత్వం, పార్టీ చేపట్టిన 'మాస్ లైన్' కార్యక్రమానికి ప్రజలనుండి అనూహ్య స్పందన వచ్చింది. అనేక దేశాల్లో అధికారంలో ఉన్న వామపక్ష పార్టీలు చైనా పార్టీ చేపట్టిన 'మాస్ లైన్' కార్యక్రమాన్ని లోతుగా అధ్యయనం చేస్తున్నాయి. భారత దేశంలోని వామపక్ష పార్టీలకు కూడా చైనా పార్టీ కృషీ, వారి అనుభవాలూ కొంతైనా ఉపయోగపడగలవు. 2013-14 మాస్ లైన్ ఉద్యమం గురించి రాయడమంటే మూడు కోణాలలో వివరించాల్సి వుంటుంది. ఒకటి, నేడు మార్కెట్ ఆర్థిక సంస్కరణల పర్యవసానంగా సోషలిస్టు దేశంలో సంభవిస్తున్న అనుచిత చతుర్రుగ్మతల (రూపవాదం, బ్యూరాక్రసీ, సౌఖ్య వాదం, దుబారా సమస్యల) మూలాలు వెతకడం. రెండవది, చతుర్రుగ్మతలకు వ్యతిరేకంగా చేపట్టిన 'మాస్ లైన్ కార్యక్రమ పద్ధతిని పరిశీలించడం. మూడవది, 'మాస్ లైన్' ఉద్యమంలో సాధించిన విజయాలను గమనించడం. ఈ చతుర్రుగ్మతల గురించీ, సాధించిన విజయాల గురించీ ఈ వ్యాసంలో రాయడం లేదు. ఎందుకంటే ఈ రెంటిపై మాస్ మీడియాలో విస్తారంగా వార్తలు, వ్యాఖ్యలు వచ్చాయి. మాస్ లైన్ కార్యక్రమం ప్రధానంగా పార్టీ శాఖా బాధ్యులు, సభ్యుల పని విధానాన్ని మెరుగు పరుచుకునేందుకు ఉద్దేశించింది. తద్వారా ప్రజలతో పార్టీకి సజీవ సంబంధాలు వృద్ధి అవుతాయనేది పార్టీ ఉద్దేశం. 'మాస్ లైన్' ఉద్యమంలో గత ఏడాది నుండి ఇప్పటివరకు చైనా పార్టీ చేపట్టిన పద్ధతులను సంక్షిప్తంగా వివరిస్తాను:

### 'మాస్ లైన్' కార్యక్రమం

చైనా విప్లవ నేత మావో జెడాంగ్ 'ప్రజల నుండి ప్రజల వద్దకు' అన్నాడే తప్ప వాస్తవానికి ఏనాడూ 'మాస్ లైన్' అనే పదాన్ని ఎక్కడా వాడలేదట. మావో మాటల్లో చెప్పాలంటే 'ప్రజలలో వుండే భావాలను తీసుకోవాలి, వాటిని సమీక్షించాలి, అధ్యయనం ద్వారా వాటిని సమన్వయపరచి, క్రమమైన భావాలుగా మలచి, తిరిగి ప్రజల వద్దకు తీసుకు వెళ్లాలి. ప్రజలు వాటిని తమవిగా భావించి, స్వీకరించే వరకూ వాటి కోసం నిలబడి, కార్యాచరణ తలపెట్టే వరకూ ఆ భావాలను ప్రజలలో ప్రచారం చేస్తూ వివరించాలి. ఈ భావాలు సరైనవో కావో ఆచరణలో పరీక్షించాలి. తరువాత మళ్లీ ప్రజల నుండి భావాలను గ్రహించి సమీక్షించాలి. ఈ విధంగా మళ్లీ మళ్లీ ఎడతెరిపి లేకుండా చేయడం వలన భావాలు మరింత సరైనవిగా, మరింత శక్తివంతంగా, మరింత సంపన్నంగా తయారవుతాయి'.

చైనా నాయకుడు డెంగ్ 'మాస్ లైన్', 'ప్రజా దృక్పథం' అనేవి మన తరతరాలకు లభించిన సజీవ ఆస్తిగా పరిగణించాలి' అన్నాడు. చైనా పార్టీ 'మాస్ లైన్'లో ఉన్న ముఖ్య లక్షణాలు 1. ప్రజాసేవలో బూర్జువా పార్టీలకంటే భిన్నంగా ఉండడం. 2. జనమే పార్టీకి ప్రాణంగా భావించడం. 3. ప్రజలను విశ్వాసంలోకి తీసుకోవడంతోబాటు, గౌరవంతో వారిని అంటిపెట్టుకొని ఉండడం. 4. ప్రజలపై ఆధారపడుతూ వారి సమస్యలను నిత్యం పరిష్కరించడం. 5. నూతన పరిస్థితులకు అనుకూలంగా నూతన పద్ధతులతో వారిని ఆర్గనైజ్ చేయడం.

### 'మాస్ లైన్' భావం ఆవిర్భావం

మార్క్స్, ఎంగెల్స్, లెనిన్ రాసిన రచనలు పార్టీకీ, ప్రజలకూ మధ్య ఉండాల్సిన సజీవ సంబంధాల ప్రాధాన్యతను వివరిస్తాయి. మార్క్సిజం-లెనినిజం సిద్ధాంతాన్ని అధ్యయనం చేసిన మావో, కమ్యూనిస్టు పార్టీ ప్రజల పార్టీగా ఎలా అవతరించాలో అనేక సందర్భాల్లో తన రచనల్లో స్పష్టం చేశాడు. 1927 మార్చిలో 'హూనాన్ రైతాంగ ఉద్యమ నివేదిక' అన్న విశ్లేషణాత్మక రచనను చేసి పార్టీలోని అన్ని శ్రేణులను ఆకట్టుకున్నాడు. 1928లో జరిగిన పార్టీ మహాసభ అనంతరం తొలిసారిగా 'మాస్ లైన్' అనే భావనను అధికారికంగా అమల్లోకి తీసుకొచ్చాడు. 1943లో 'నాయకత్వ పద్ధతులకు సంబంధించిన కొన్ని సమస్యలు' అనే వ్యాసంలో ప్రజా బాహుళ్యంతో పార్టీ మమేకం కావాలని వివరిస్తూ 'ప్రజల నుండి ప్రజల వద్దకు' అన్నాడు. ఇది ఒక మార్క్సిస్టు జ్ఞాన సిద్ధాంతంగా పేర్కొన్నాడు. మావో ఆలోచనా విధానాన్నీ, మార్క్సిజం లెనినిజం సిద్ధాంతాన్నీ అధ్యయనం చేసిన లి షావ్‌చీ ఆ తరువాత డెంగ్ సియావో పింగ్‌లు దానికి 'చ్యున్ జంగ్ లూశ్యేన్' అని నామకరణం చేసే పార్టీ కార్యక్రమంలో పొందుపరిచారు.

> **"చతుర్రుగ్మతల్లాంటి ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు కట్టుబడిన వారందరూ అన్ని విషయాలనూ అధ్యయనం చేయాలి. అధికారులు తాము అధ్యయనం, పరి శోధన చేసే క్రమంలో వాటిని తమ పనికి అన్వయించుకొని, పని విధానాన్ని మెరుగు పరుచుకోవాలి. ఆ విధంగా ప్రజలకు మార్పునూ, మంచి ఫలితాలనూ అందేట్లు చూడాలి. తక్షణం పరిష్కరించగలిగే సమస్యలు, దీర్ఘకాలంలో పరిష్కరించగల సమస్యలను వర్గీకరించుకోవాలి."**

చైనా భాషలో 'చ్యున్ జంగ్ లూశ్యేన్' అంటే 'మాస్ లైన్' (ప్రజా పంథా) అని అర్థం.


మావో కాలంలో అనేక ఆటుపోట్లకు గురైన చైనా కమ్యూనిస్టు పార్టీపై 1981లో పార్టీ కేంద్ర కమిటీ సమగ్ర సమీక్ష చేసింది. 'చైనా కమ్యూనిస్టు పార్టీ చరిత్రకు సంబంధించి కొన్ని సమస్యలు' అనే (1981) తీర్మానంలో మావో ఆలోచనా విధానంలోని మూడు మౌలిక అంశాలను కలిపి 'సజీవ స్ఫూర్తి (లివింగ్ సోల్)'గా కేంద్ర కమిటీ అభివర్ణించింది. ఆ మూడు మౌలిక అంశాలలో 'మాస్ లైన్' ఒకటి. మిగతా రెండు: వాస్తవాల నుంచి సత్యాన్ని గ్రహించడం, స్వతంత్రతను నిలబెట్టుకోవడం.

**జిన్ పింగ్ ఆధ్వర్యంలో 'మాస్ లైన్'**

'మాస్ లైన్' కార్యక్రమాన్ని 2014 వరకు ఒక ఉద్యమంగా నిర్వహించాలనీ, 2013, ఏప్రిల్ 19న జరిగిన చైనా కమ్యూనిస్టు పార్టీ (సిపిసి) పొలిట్ బ్యూరో సమావేశం నిర్ణయించింది. జూన్ 18న పీపుల్స్ డైలీ మాస్ లైన్‌పై ప్రత్యేక వెబ్‌సైట్‌ను ప్రారంభించింది.

2013-14 'మాస్ లైన్' ఉద్యమాన్ని ఎలా నిర్వహించాలో సిపిసి ఈ క్రింది విధంగా శాఖలకు సూచించింది. 18వ సిపిసి మహాసభ తీర్మానాలతోబాటు ఈ సూచనలు చేసింది: మార్క్సిస్టు అవగాహనతో నేటి సమాజంలోని నూతన పరిస్థితులను లోతుగా అధ్యయనం చేయాలి. చైనా లక్షణాలతో కూడిన సోషలిజం దాని సైద్ధాంతిక స్వరూపాన్ని మనఃపూర్తిగా అధ్యయనం చేయాలి. నేటి సమాజంలో అనవసరమైన ఖర్చులను తగ్గించి, ఆర్థిక వనరులను ఎలా పొదుపుగా వాడాలో బాగా అధ్యయనం చేయాలి.

పార్టీ స్ఫూర్తి, పనివిధానం, క్రమశిక్షణ, నైతిక ప్రవర్తనపై అధ్యయనాన్ని ఆదర్శ విశ్వాసంతో లోతుగా ప్రారంభించాలి. ఈ అధ్యయనం మూడు అంశాల చుట్టూ తిరగాలి. అవి ప్రపంచం, జీవితం, విలువలు. ఇవి సమ్మిళితమైన మెయిన్ స్విచ్‌గా ఉండాలి. పార్టీ




పార్టీ ఇచ్చే ప్రతి పిలుపునూ నినాదాలుగా మార్చడం చైనా కమ్యూనిస్టు పార్టీకి అలవాటు: చతుర్రుగ్మతలు గురించి చైనా పార్టీ రూపొందించిన నినాదం

సభ్యులనూ, కార్యకర్తలనూ చైతన్యవంతం చేసే క్రమంలో పార్టీకున్న ఘనచరిత్ర, గొప్ప సాంప్రదాయాలను సమీక్షించాలి. ఈ సమీక్షలో పార్టీ ప్రణాళిక, జనాశయం, ఆదర్శ జీవితం, చరిత్రను దర్పణాలుగా తీసుకోవాలి. ఎవరికివారే స్వయంగా పార్టీ స్ఫూర్తిని, నైతికతను, క్రమశిక్షణ ను బలోపేతం చేసుకోవాలి. విచక్షణా సామర్థ్యాన్నీ, రాజకీయ సంభావ్యతనూ, ఆచరణ సామర్థ్యాన్నీ పెంచుకోవాలి. ఇలా చేయాలంటే సిద్ధాంతాన్నీ, ఆచరణనూ అనుసంధానం చేసుకుంటూ ఆత్మ పరిశీలనతో ఆలోచనలను పరస్పరం ఇచ్చిపుచ్చుకోవాలి.

మార్క్సిజం కోణం నుంచి జనబాహుళ్య దృక్పథంపైనా, పార్టీ కోణం నుంచి 'మాస్ లైన్' భావనపైనా విస్తారంగా చర్చ ప్రారంభించాలి. స్థానికంగా ఉన్న విభాగాలను, యూనిట్లను కలిపి సమస్యలపై చర్చాంశాన్ని తయారుచేసుకోవాలి. నేటి 'మాస్ లైన్' సహజార్థం చుట్టూ చర్చ జరగాలి అంటే స్థానిక ప్రభుత్వ, ప్రభుత్వేతర రంగాలలో ప్రమాదకరంగా మారి, జడలు విప్పుతున్న చతుర్రుగ్మతల (సాంప్రదాయిక వాదం, బ్యూరాక్రసీ, సౌఖ్యవాదం, దుబారా) చుట్టూ చర్చ జరగాలన్నమాట. నిజాయితీతో పనిచేస్తున్న వారి నిర్దిష్ట ఆకాంక్షల చుట్టూ కూడా చర్చలు జరపాలి. ప్రపంచం, జీవితం, విలువలతో కూడిన మెయిన్ స్విచ్‌లోని మూల సమస్యలకు పరిష్కారం కనుగొంటూ, మరింత లోతైన అవగాహన చేసుకుంటూ, వ్యత్యాసాలను వెదుకుతూ మార్గాన్ని సుగమం చేసుకోవాలి.

**ప్రజల సలహాలు, సూచనలు స్వీకరించడం ఎలా?**

'మాస్ లైన్'పై లోతైన అవగాహనతో సుపరిపాలనకు అవసరమైన సూచనలను, సలహాలను ప్రజల నుండి స్వీకరించాలి. పైన పేర్కొన్న చతుర్రుగ్మతల పరిష్కారానికి ప్రజల విమర్శలు, వారిచ్చే సలహాలు, సూచనలే పార్టీకి మూలం.

**వినేటప్పుడు గమనించాల్సిన ప్రధానాంశాలు**

నాయకత్వ ప్రధాన విభాగాలు, కోర్ నాయకత్వం, క్యాడర్ స్థాయి, నాయకత్వ పని విధాన సమస్యల పట్ల ప్రజల స్పందన ప్రధానమైంది. పార్టీ కేంద్ర కమిటీ పేర్కొన్న సూత్రాలపై ప్రజలు చేసే సూచనలను వినాలి. అంతేగాక చతుర్రుగ్మతలకు వ్యతిరేకంగా పార్టీ చేపట్టిన 'మాస్ లైన్' కార్యక్రమం పట్ల ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవాలి. చతుర్రుగ్మతల వ్యతిరేక కార్యక్రమంపై ప్రజల సూచనలలో ఉన్న విషయాలపట్ల దృష్టి పెట్టాలి. ప్రజలతోబాటు కింది స్థాయిలో ఉన్న శాఖాసభ్యులు, క్యాడర్ చెప్పే విషయాలనూ శ్రద్ధగా వినాలి. అవసరమైతే వారితో వ్యక్తిగతంగా భేటీ కావాలి. సర్వేలు, సలహా బాక్సులు, ఈ-మెయిల్, ఆన్‌లైన్, హాట్‌లైన్ ద్వారా చతుర్రుగ్మతలపై వారు చెప్పే సమాచారాన్ని రికార్డు చేయాలి. అన్ని విభాగాల నుంచీ తీసుకున్న సమాచారాన్ని విశ్లేషించి, పరిశోధనను పరిపుష్టం చేయాలి. అస్పష్టమైన వాటిని పక్కనపెట్టి, కీలక సమస్యల పట్ల దృష్టి సారించి, పరిష్కార మార్గాలను వెతకాలి.

చతుర్రుగ్మతల్లాంటి ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు కట్టుబడిన వారందరూ అన్ని విషయాలనూ అధ్యయనం చేయాలి. అధికారులు తాము అధ్యయనం, పరిశోధన చేసే క్రమంలో వాటిని తమ పనికి అన్వయించుకొని, పని విధానాన్ని మెరుగు పరుచుకోవాలి. ఆ విధంగా ప్రజలకు మార్పునూ, మంచి ఫలితాలనూ అందేట్లు చూడాలి. తక్షణం పరిష్కరించగలిగే సమస్యలు, దీర్ఘకాలంలో పరిష్కరించగల సమస్యలను వర్గీకరించుకోవాలి. చతుర్రుగ్మతలుగా ఉన్న ప్రధాన సమస్యలను పరిష్కరించటాన్ని, అధ్యయన క్రమాన్ని మిళితం చేసుకొని ఉమ్మడిగా 'మాస్ లైన్' కార్యక్రమాన్ని ముందుకు తీసుకుపోవాలి. తప్పనిసరిగా పురోగతిని సాధించాలి. అదే సమయంలో అధ్యయన క్రమమూ, ఒక కొత్త వ్యవస్థను నిర్మించడమూ ఏక కాలంలో జరగాలి. ఆ విధంగా బలహీనతలను గమనించి, పాత

పద్ధతులను విసర్జించి, పార్టీ పని విధానాన్ని మెరుగుపరచుకోవాలి.

వివిధ విభాగాల్లో పనిచేస్తున్న పార్టీ సభ్యుల అవసరాలను పరిగణలోకి తీసుకుని అధ్యయనం చేసేట్లు సైద్ధాంతికంగా పరిపుష్టం కావాలి. ఇది చేసే క్రమంలో శాఖలు ఇతరులకు ఆదర్శంగా ఉండాలి. ఇతరులు పరిశీలించేలోపే మన శాఖ లు ముందుగా పార్టీ నూతన పద్ధతులతో లోతు గా అధ్యయనం చేయాలి. పరిశీలించిన అంశా లను స్థానికంగా సమావేశాలు, సెమినార్లు పెట్టి వీడియోల ద్వారా నిపుణుల సహాయంతో మన అధ్యయనాన్ని పరిపుష్టం చేసుకోవాలి. అవసర మైతే సైద్ధాంతికవేత్తలను పిలిపించుకొని బలంగా పరిశోధనలు చేయాలి. వార్తా పత్రికలు, టీవీ, రేడియోలతోబాటు సోషల్ మీడియా, ఇంటర్నెట్‌ను ఉపయోగించి జనాశయానికి అనుకూలంగా ప్రజలకు దగ్గరకావాలి.

పైన పేర్కొన్న లక్ష్యాల ఆధారంగా చైనాలో అన్ని స్థాయిల్లో వున్న పార్టీ సభ్యులకు 'మాస్ లైన్' అధ్యయన కేంద్రాలు ప్రారంభించారు. ఆ కేంద్రాలకు 'మాస్ లైన్'పై కొన్ని లక్షల బుక్‌లెట్స్ పంపిణీ చేశారు. అన్ని స్థానిక పార్టీ పాఠశాల ఉపాధ్యాయులూ, పార్టీ సభ్యులూ ఈ అధ్యయన కార్యక్రమంలో పాల్గన్నారు. ప్రతి పుస్తకంలో 'మాస్ లైన్'పై చైనా కమ్యూనిస్టు పార్టీ (సిపిసి) ప్రధాన కార్యదర్శి జిన్ పింగ్ ఉపన్యాసం ముద్రించి వుంది. తన ఉపన్యాసంలో పార్టీ సభ్యులు, ముఖ్యంగా నాయకత్వ శ్రేణులు 'మాస్ లైన్' ప్రాధాన్యతను గుర్తించి, సైద్ధాంతిక అధ్యయనం సమిష్టిగా చేయాలని కోరారు. ఇటీవల జరిగిన 18వ పార్టీ మహాసభ తీర్మానాలను అమలు చేయమని అందులో ఆయన కోరారు.

చైనా పార్టీ ఈ కార్యక్రమాన్ని ఒక సవాలుగా తీసుకుంది. పార్టీ కార్యకర్తలు ఎంతో పట్టుదలతో, క్రమశిక్షణతో కార్యక్రమాన్ని నడిపారు. అక్కడక్కడా ఈ ఉద్యమాన్ని నీరుగార్చేందుకు ప్రయత్నించిన కొంతమంది కమ్యూనిస్టు వ్యతిరేకులు, అవినీతిపరులు, ఉదారవాదులు ప్రజాగ్రహానికి ఉడాయించాల్సి వచ్చింది. అవకతవకలకు పాల్పడ్డ కొంతమంది తమ తప్పులను నిజాయితీగా ఒప్పుకోగా మరికొందరు కోర్టుల్లో సవాలు చేయడానికి సిద్ధపడ్డారు. అక్రమాలకు పాల్పడ్డ అనేక మంది జైలు పాలయ్యారు.

**విజయాలు**

దుబారా వ్యయాన్ని నివారించనందుకు పార్టీ పాలనా రంగంలో వున్న 74 వేల మంది

> **“ దుబారా వ్యయాన్ని నివారించనందుకు పార్టీ పాలనా రంగంలో వున్న 74 వేల మంది పార్టీ సభ్యులకు శిక్షపడింది. ఇళ్ల తొలగింపు, ఆరోగ్య సంరక్షణ వంటి రంగాల్లో ప్రజా ప్రయోజనాల ఉల్లంఘనకు పాల్పడినట్లు ఆరోపణలున్న 3,86,000 కేసులు పరిష్కరించబడ్డాయి. రెండు లక్షల మంది అధికారులకు శిక్షపడింది. కాగితాలకే పరిమితమైన 1,62,629 మంది అక్రమ సిబ్బంది ప్రభుత్వ ఉద్యోగాల నుండి తొలగించబడ్డారు. ”**



నాడు మాస్ లైన్ అమలు చేయడానికి ప్రజల్లో మావో (చిత్రం), నేడు మాస్ లైన్ అమలులో భాగంగా ప్రజలతో చైనా పార్టీ అధ్యక్షుడు సి జింగ్‌పిన్

పార్టీ సభ్యులకు శిక్షపడింది. ఇళ్ల తొలగింపు, ఆరోగ్య సంరక్షణ వంటి రంగాల్లో ప్రజా ప్రయోజనాల ఉల్లంఘనకు పాల్పడినట్లు ఆరోపణలున్న 3,86,000 కేసులు పరిష్కరించబడ్డాయి. రెండు లక్షల మంది అధికారులకు శిక్షపడింది. కాగితాలకే పరిమితమైన 1,62,629 మంది అక్రమ సిబ్బంది ప్రభుత్వ ఉద్యోగాల నుండి తొలగించబడ్డారు.

'మాస్ లైన్' కార్యక్రమంలో భాగంగా అక్రమాలకు పాల్పడ్డ 5,86,000 మంది అధికారులను తొలగించారు. ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేసిన 8,200 మంది అధికారులపై చర్యలు చేపట్టి, కోర్టులు చుట్టూ తిరిగేలా చేశారు. ప్రభుత్వ వాహనాలు, అధికారుల విదేశీ పర్యటనలు, అధికార విందులు, వినోద కార్యక్రమాలపైనా, ప్రభుత్వం పేరుతో పెట్టే ఖర్చును తగ్గించుకోవడం ద్వారా 5,300 కోట్ల యువాన్లు (53,000 కోట్ల రూపాయలు) ఈ ఏడాదిలో ఆదా చేయగలిగారు.

ఉదాహరణకు, గతవారం ఒక ఊరి సర్పంచ్ నాతోబాటు నలుగురిని భోజనానికి ఆహ్వానించాడు. ఆ సర్పంచికి (అధి కార ఖాతా కింద తినే) విందు భోజన సమయం లో మందు తీసుకోందే ముద్ద దిగదు. సొంత ఖర్చులతో మందు కొనడానికి సాహసించలేదు. అలాంటి మనిషి మొహంలో ఈసారి కళాకాం తులు కరువయ్యాయి. గతంలో గంటల తరబడి చేసే విందు భోజనం ఈసారి అరగంటలో పూర్తయిపోయింది. ఈ చిన్న ఉదాహరణతో చైనాలో 'మాస్ లైన్' ఔషధం పనిచేస్తోందని నాకు అర్థమయింది.

చైనా ప్రజానీకం అధికారుల అక్రమ చర్యలను ఎండగట్టే కార్యక్రమం కోసం గత దశాబ్దకాలంగా ఎదురుచూస్తున్నారు. పార్టీ పేరుతో అవినీతి అధికారులు చేసే వికృత చేష్టలనూ, వీరిపై చైనా పార్టీ చేపట్టిన చర్యలనూ నేడు ప్రతి రోజూ టీవీలో ప్రత్యక్షంగా వీక్షిస్తున్న సామాన్య ప్రజలకు కనుల పండుగలా ఉంది. దీనికి సోషల్ మీడియా ప్రధాన పాత్ర వహించింది. అంటే మాస్ లైన్ కార్యక్రమాన్ని ప్రజలే పరోక్షంగా విజయవంతం చేశారనడంలో సందేహం లేదు. 'మాస్ లైన్' విజయాలతో ఒకవైపు సామాన్యులు సంబరాలు చేసుకుంటుంటే మరోవైపు (అవినీతిని ప్రోత్సహించే) కుబేరులకు కంట్లో కారం చల్లినట్లుంది.

చైనా సమాజంలో చెలరేగుతున్న ఈ చతుర్రుగ్మతలకు చెక్ పెట్టడంలో చైనా పార్టీ చేపట్టిన 'మాస్ లైన్' ఉద్యమం కొంతమేరకు విజయవంతం అయిందనడంలో సందేహం లేదు. ఈ ఉద్యమం యువతరానికి కొత్త ఉత్సాహాన్ని ఇవ్వడంతోబాటు నిజాయితీగా పనిచేస్తున్న లక్షలాది పార్టీ సభ్యుల్లో ఆత్మ విశ్వాసాన్ని నింపింది. ఈ ఉద్యమాన్ని భవిష్యత్‌లో కూడా కొనసాగించాలని పార్టీ నిర్ణయించింది.

కార్మిక రంగం

# కార్మిక హక్కులపై ముప్పేటదాడి

**టి.కె. రాజాలక్ష్మి**

**2014** అక్టోబర్ 16వ తేదిన భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపకుడు, భారతీయ జనసంఘ్ సిద్ధాంతకర్తలలో ఒకరైన "పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ్" పేరుతో ప్రధానమంత్రి నరేంద్రమోడీ కార్మిక చట్టాల సవరణల పరంపరను అట్టహాసంగా ప్రారంభించారు. ఆ కార్యక్రమం పేరు "శ్రమయేవ జయతే". కార్మిక వర్గాన్ని పొగడ్తలతో ముంచెత్తినట్లు కని పించే ఈ కార్యక్రమంలో మోడీ 'కనిష్ట ప్రభుత్వం-గరిష్ట పాలన' అనే తన ఎజెండాకి కట్టుబడి ఉన్నానని ప్రకటించారు. "శ్రమ యోగి", "రాష్ట్ర యోగి", "రాష్ట్ర నిర్మాత" అనే ముద్దు పేర్లు కార్మికవర్గానికి పెట్టారు. మరోపక్క పరిశ్రమాధిపతులు "ఇండియాలో తయారు చేయండి" అనే నినాదంలో మునిగి అలసి పోతున్నారు. ఈ ప్రకటనలలో ఎటువంటి తప్పూ లేదు, కానీ ఈ ప్రకటనలు దేశంలోని కార్మికవర్గ నిజ జీవితాలకు, వారి రక్షణకు సంబంధం లేనటువంటివిగా ఉన్నాయన్నది సుస్పష్టం.

ఈ మార్పులలో ముఖ్యమైనవిగా పేర్కొనదగినవి పరిశ్రమలను తనిఖీలు చేసే బహుముఖ వ్యవస్థ రద్దు చేసి ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి సరళరీతిలో ప్రత్యామ్నాయ వ్యవస్థ రూపొందించటం, ప్రావిడెంట్ ఫండ్ ఖాతాదారులందరికి శాశ్వత ప్రాతిపదికన నంబర్లు కేటాయించడం (యు.ఎ.ఎన్), ఒక ప్రత్యేక వెబ్‌సైట్ ద్వారం ప్రారంభించి పరిశ్రమాధిపతులు కార్మిక చట్టాలన్నిటినీ అమలు చేస్తున్నామని పదహారు రకాలైన పత్రాలను పూర్తి చేసి సమర్పించే ప్రక్రియను ఎత్తివేసి ఒకే ఒక పత్రం ద్వారా తామే తనిఖీ చేసుకున్నట్లుగా యజమాని ప్రకటించుకునే విధానాన్ని ప్రారంభించటం, రిటర్న్లు దాఖలు కూడా ఈ-ఫైలింగ్ ద్వారా చేయటం, ఇప్పటి దాకా అకస్మాత్తుగా తనిఖీలకు వచ్చే ఇన్‌స్పెక్టర్ల వ్యవస్థను రద్దు చేయటం. ఈ కొత్త నియమ నిబంధనల వల్ల నిర్ద్వందంగా తేలినదేమిటంటే ఇప్పటి దాకా ఉన్న ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ సంస్థ (ఇపిఎఫ్ఒ), ది ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పోరేషన్ (ఇఎస్ఐసి) కార్మిక సంక్షేమ కార్యాలయములలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారవర్గం, చివరికి ఛీఫ్ లేబర్ కమిషనర్ (కార్మికశాఖాధికారి) కూడా వ్యర్థంగా మిగిలిపోతారు. సాలీన దాదాపు ఎనిమిది లక్షల తనిఖీలు జరుగుతున్నటువంటి పరిస్థితి నుండి తనిఖీలు దాదాపుగా నిలిచిపోయే వ్యవస్థకి మళ్ళుతున్నాం.

విచారించదగ్గ అంశం ఏమిటంటే, పరిపాలన సరళీకరణ పేరుతో ప్రధానమంత్రి ఒక కలం పోటుతో ఇప్పుడున్న కార్మిక అధికారుల తనిఖీ అధికారాలను తుంగలో తొక్కివేయటం. ఇక నుండి ఏ ఫ్యాక్టరీని ఎప్పుడు తనిఖీ చేయాలి, ఏ కార్మిక అధికారి తనిఖీ చేయాలి అనేది అంతర్జాలంలో లాటరీ పద్ధతి ద్వారా నిర్ణయిస్తారు. అలా తనిఖీ చేసిన అధికారులు 72 గంటలలోపు ఆ రిపోర్టును అంతర్జాలంలో క్రోడీకరించిన తరువాత కేంద్ర సంస్థ ఆ రిపోర్టును (ఆ ఫ్యాక్టరీ యజమాని స్వీయ ప్రకటిత సర్టిఫికేట్‌ను కూడా పరిశీలించి) ఆ ఫ్యాక్టరీపై చర్య తీసుకోవాలా, లేదా అని నిర్ణయిస్తుంది. ఈ నిర్ణయాన్ని పరిశ్రమాధిపతులు స్వాగతిస్తూ, అంతకు ముందున్న బహుళ వ్యవస్థ తనిఖీ రాజ్యం వలనే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు భారతదేశంలో అడుగు పెట్టడానికి భయపడ్డారని ప్రకటించారు. కాని దేశంలోని కార్మిక సంఘాలు ఈ వాదనతో ఏకీభవించటం లేదు.

గత కొద్దికాలంగా ఒక క్రమ పద్ధతిలో దేశంలో ఉన్న 40 కేంద్ర కార్మిక చట్టాలు, రాష్ట్రాలలో ఉన్న సుమారు 150 కార్మిక చట్టాలు వ్యర్థ పూరితమైనవని అభిప్రాయం కలిగించేలా ప్రచారం సాగుతోంది. ట్రేడ్ యూనియన్స్ నొక్కి వక్కాణించినట్లుగా కార్మిక చట్టాల సంస్కరణల ఉద్దేశం కార్మికుల రక్షణ కాదనీ, ఎప్పుడు కావాలంటే అప్పుడు నియమించడం, తొలగించడం సులభతరం చేయటానికేనని ప్రకటించాయి. త్రైపాక్షిక చర్చలలో కార్మిక సంఘాలు ప్రతిపాదించిన సవరణలు, ముఖ్యంగా చిన్నతరహా పరిశ్రమలలో ఉన్న కార్మికవర్గం గురించి చేసిన ప్రతిపాదనను ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. అందుకు పూర్తి భిన్నంగా కార్మికశాఖామంత్రిగారి వెబ్‌సైట్‌లో ప్రవేశపెట్టిన ప్రతిపాదిత పత్రంలో 40 మంది కార్మికులు పని చేస్తున్న చిన్నతరహా పరిశ్రమలన్నింటిలో మౌలికమైన 14 కార్మిక చట్టాలను మినహాయించారు. అవి ఫ్యాక్టరీ చట్టం, పారిశ్రామిక వివాదాల చట్టం, ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ చట్టం, మెటర్నిటీ బెనిఫిట్ చట్టం. దీని వల్ల అసంఖ్యాకమైన కార్మికులు ముఖ్యమైన కార్మిక చట్టాల పరిధిలో నుండి బయటకు నెట్టివేయబడ్డారు. అంతేకాదు చట్టబద్ధత లేని సాధికార సంస్థ అయిన ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ, డెవలప్‌మెంట్ అథారిటీ ద్వారా నియంత్రించబడే కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్, ఆరోగ్య పథకాలకు కూడా అందకుండా పోయారు.

ప్రభుత్వం చాలా పెద్ద ఎత్తున కార్మిక చట్టాలను సరళీకరిస్తోంది. కాని ఇంతవరకు కార్మిక సంఘాలను గుర్తించటం తప్పనిసరి అని చెప్పే చట్టం మాత్రం చేయలేదు. అంతర్జాతీయ కార్మిక సంస్థ నిబంధనలు 87, 98 ప్రకారం

సంఘాలు పెట్టుకునే హక్కు ద్వైపాక్షిక చర్చలు, సంబంధాలు హక్కులను అన్ని దేశాలు గుర్తించాలని పేర్కొంది. భారతదేశం ఇంత వరకు దానిని ఆమోదించలేదు. దేశ రాజధాని పరిసర ప్రాంతాల్లో ఈ మధ్య జరిగిన పారిశ్రామిక వివాదాల్లో ముఖ్యమైనది గుర్గావ్‌లో (ఈ సిటీ అభివృద్ధిని సింగపూర్‌తో పోలుస్తారు) జరిగింది. కార్మికవర్గానికి ప్రజాస్వామ్యయుతంగా తమ హక్కుల కోసం సంఘాలను స్థాపించుకోవటమే ఈ వివాదానికి ప్రధాన కారణం. ఇక్కడ ఉన్న ప్రముఖ ఆటో మొబైల్ దిగ్గజంలో పని చేస్తున్న 147 మంది కార్మికులు 2012 జూలై నుండి జైళ్ళలో మగ్గుతున్నారు. దేశంలో మరో ప్రక్క ఉన్న నైవేలీ లిగ్నైట్ కార్పోరేషన్‌లో పని చేస్తున్న 13,000 మంది కాంట్రాక్టు కార్మికులు, ప్రభుత్వ రంగ నవరత్నాలలో ఒకటిగా ఉన్న ఈ పరిశ్రమలో ఉద్యోగాల క్రమబద్ధీకరణ కోసం పోరాటం ప్రారంభించారు. ప్రధాన మంత్రి కార్యాలయం, కేంద్ర కార్మిక శాఖా మంత్రి కార్యాలయం ఈ నిజాలు తెలిసినా కళ్ళుమూసుకుని ఉన్నాయి.

కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనలు కార్మిక వర్గానికి చేటు చేస్తాయనేది ఎంత వాస్తవమో, అదే సమయంలో ఈ ప్రతిపాదిత ప్రకటనలు కేంద్ర కార్మిక సంఘాలతో ఎటువంటి చర్చలు జరపకుండానే రావటం పరంపరగా వస్తున్న జాతీయ కార్మిక సమావేశాలలో త్రైపాక్షిక కమిటీ సూచనలను గౌరవించే విధానాన్ని ప్రధానమంత్రి పూర్తిగా చిన్న చూపు చూడటం నిరంకుశం. బి.జె.పి.కి అనుబంధంగా ఉన్న కార్మిక సంఘంతో సహ అన్ని కేంద్ర కార్మిక సంఘాలు ఈ ప్రతిపాదనలను తీవ్రంగా వ్యతిరేకించటంతో, ఈ సంస్కరణలు ఎవరికి లాభం కలిగించనున్నాయో వారికి స్పష్టంగా అర్థమయ్యిందనేది తెలుస్తోంది. సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ జాతీయ అధ్యక్షులు ఏ.కె.పద్మనాభన్ ఫ్రంట్‌లైన్ విలేఖరితో మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులు, అందులో అత్యధికంగా ఉన్న మహిళలకు కనీస వేతనాలు కూడా ఇచ్చే పరిస్థితి లేదన్నారు.

ఫ్యాక్టరీస్ చట్టం, అప్రంటీస్ చట్టం మార్పులను ఇప్పటికే కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. 2014 ఫ్యాక్టరీస్ సవరణ బిల్లు ప్రకారం విద్యుత్తుతో పని చేసే పరిశ్రమలలో 10 నుండి 20కి మించి, విద్యుత్తు లేని పరిశ్రమలలో 20 నుండి 40 మంది కార్మికులకు మించి ఉంటేనే ఈ చట్టం అమలవుతుంది. ఈ సవరణ వల్ల లక్షలాది కార్మికులు, పరిశ్రమలు ఈ ఫ్యాక్టరీస్ చట్టం పరిధి నుండి బయటకొచ్చారు.

**"ఫ్యాక్టరీస్ చట్టం, అప్రంటీస్ చట్టం మార్పులను ఇప్పటికే కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. 2014 ఫ్యాక్టరీస్ సవరణ బిల్లు ప్రకారం విద్యుత్తుతో పని చేసే పరిశ్రమలలో 10 నుండి 20కి మించి, విద్యు త్తు లేని పరిశ్రమలలో 20 నుండి 40 మంది కార్మికులకు మించి ఉంటేనే ఈ చట్టం అమలవుతుంది. ఈ సవరణ వల్ల లక్షలాది కార్మికులు, పరిశ్రమలు ఈ ఫ్యాక్టరీస్ చట్టం పరిధి నుండి బయటకొచ్చారు."**



**నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను సవరించడం వల్ల భారత దేశంలో కార్మికులకు పూర్తిగా రక్షణ లేకుండా పోతుంది.**

ఈ చిన్న పరిశ్రమల్లో పని పద్ధతులు నిర్దేశించే ఈ కొద్దిపాటి వసతి ఈ చట్ట సవరణ వలన నియంత్రణ కోల్పోబోతోంది.

కార్మిక సంఘాలతో ఎటువంటి చర్చలు లేకుండానే పార్లమెంట్‌లో అప్రంటీస్ చట్టం ప్రవేశపెట్టబడి ఆమోదం కూడా పొందింది. ఫ్యాక్టరీస్ సవరణ బిల్లు లోక్‌సభలో ప్రవేశ పెట్టిన తరువాత పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పరిశీలనకి పంపించబడింది.

నిజంగా ప్రభుత్వం కార్మికవర్గ పక్షపాతే అయితే జాతీయ కార్మిక సమాఖ్య, త్రైపాక్షిక కమిటీ సూచించన విధంగా కాంట్రాక్టు కార్మిక చట్టానికి సవరణలు జరిపి కాంట్రాక్టు కార్మికులకు సమాన పని, ఒకే పని చేసే వారికి సమాన వేతనాలను ఇచ్చేవారు. గత జాతీయ కార్మిక సమాఖ్య త్రైపాక్షిక కమిటీ సమావేశం నుండి నేటి వరకు ఈ ప్రతిపాదనలన్నీ ప్రధానమంత్రి కార్యాలయంలో పడి ఉన్నాయని ఏ.కె.పద్మనాభన్ తెలిపారు. ఈ త్రైపాక్షిక సమావేశాన్ని ప్రారంభిస్తూ అప్పటి ప్రధాని డా॥మన్మోహన్ సింగ్ కార్మికవర్గాన్ని ఒక ఏమాత్రమూ పక్కన పెట్టలేమని తెలిసే అనేక చతురోక్తులు విసురుతూ ఉపన్యసించారు. కేంద్ర కార్మిక సంఘాలు ప్రతిపాదించిన పది పాయింట్ల కోర్కెల ప్రతాన్ని ఆయన "అసాధ్యమైన డిమాండ్లు"గా వర్ణించారు. 2013లో కేంద్ర కార్మిక సంఘాల పిలుపుతో జరిగిన రెండు రోజుల దేశవ్యాపిత సమ్మె తరువాత, కొంత మంది మంత్రులతో కమిటీని ఏర్పాటు చేశారు. కాని కార్మిక సమస్యలను పరిష్కరిస్తామన్న ప్రమాణాలన్నిటినీ గాలికొదిలేసిన పరిస్థితి, నేడు కేంద్రంలో అధికారంలోకి వచ్చిన కొత్త శక్తులు, యు.పి.ఏ ప్రభుత్వం నిర్వాకం కన్నా రెండాకులు ఎక్కువే చేస్తానంనే సూచన లిస్తోంది. కాంగ్రెస్ పార్టీ ఈ సంస్కరణల గురించి నోరు మెదపడం లేదు. ఇందులో ఆశ్చర్యపడాల్సిన అంశం ఏమీ లేదు. మాజీ కేంద్ర మంత్రి శ్రీ మణిశంకర్ అయ్యర్ ఒక్కరే వీటిని తీవ్రంగా వ్యతిరేకించారు.

ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ సంస్థ నిర్వహణలో నేడు సూచిస్తున్న సవరణలు కొత్తవేమీ కాదు. జేవియర్ కార్మిక సంబంధాల ఇనిస్టిట్యూట్ ప్రొఫెసర్ కె.ఆర్.శ్యామసుందర్ ఫ్రంట్‌లైన్‌తో మాట్లాడుతూ కార్మిక చట్టాలు పరిపాలనా సంస్కరణలు మిశ్రమ సంచిలాంటివని, అంతర్జాలం ద్వారా ఈ.పి.ఎఫ్. ఎకౌంట్స్ మేనేజ్‌మెంట్ అనే డిమాండు ఎప్పటి నుంచో ఉన్నదని, సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన నేపథ్యంలో ఇప్పుడది అమలు జరిగిందని పేర్కొన్నారు. పత్రికా సమాచారం ప్రకారం సంఘటిత రంగ కార్మికవర్గమంతా ఈ పథకం పరిధిలోకి వస్తారు. ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి మారే ఉద్యోగులందరూ ఈ-పరిపాలన సంస్కరణల వలన లాభపడతారు. కానీ అభద్రతలో ఉన్న కాంట్రాక్టు, క్యాజువల్ కార్మికుల ప్రావిడెంట్ ఫండ్ బకాయిలు ఏరకంగా విడుదల చేస్తారన్న దానికి సమాధానం లేదని శ్యామసుందర్ పేర్కొన్నారు. ఈ-పరిపాలన అనేది మంచి పరిణామమే అయినా, టెలికాం సర్వీసుల సమర్థత మీద ఇది ఆధారపడి ఉంటుంది. ఈ-పరిపాలన ద్వారా జరిగిన లావాదేవీలు పరిశీలిస్తే అది ప్రశ్నార్థకంగా మిగిలింది. మహారాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన ఈ-గవర్నెన్స్ దేశవ్యాపితంగా ప్రశంసలు అందుకుంది. కాని అమలులో అది ఘోరంగా విఫలమయ్యింది. ఒక ప్రైవేటు టెలికం కంపెనీ నడిపిన ఈ-పోర్టల్ తీవ్ర సమస్యలకు దారితీసి, కార్మికవర్గం

> **“ కార్మికశాఖ అధికారిక సమాచారం ప్రకారం, భారత దేశం ఇంతవరకు ఐ.ఎల్.ఓ నిబంధనల ప్రకారం కార్మికుల సంఖ్యను బట్టి తనిఖీ అధికారులను నియమించే మార్గదర్శకాలను చేరుకోలేదు. 1948 కనీస వేతనాల చట్టం అమలు పర్యవేక్షణ కొరకు 2012లో 77 లక్షల పరిశ్రమలను తనిఖీ చేయటానికి కేవలం 3,171 మంది కార్మికశాఖ అధికారులు ఉన్నారు. అంటే ప్రతి 2,428 పరిశ్రమలకు ఒక తనిఖీ అధికారి లెక్కన ఉన్నారు. ”**

న్యాయస్థానాలను ఆశ్రయించవలసి వచ్చింది.

శ్యామసుందర్‌గారు “ఇన్‌స్పెక్టర్ల రాజ్యం”లో తీసుకువస్తున్న సవరణలు, ఆశావాహ పెట్టుబడిదారులకు సంకేతాలనీ, మరీ ముఖ్యంగా నరేంద్రమోడీ జపాన్, అమెరికా పర్యటనల నేపథ్యంలో ఈ ప్రభుత్వం సంస్కరణలను వేగవంతంగా ముందుకు తీసుకెల్తోందని స్పష్టంగా తెలియచేయటానికేననీ తెలిపారు. తనిఖీల రిపోర్టులను పంపడంలో దాదాపు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు పాలనా యంత్రాంగం విఫలమయ్యిందని, తనిఖీల రేటు రిజిష్టర్ అయిన కంపెనీల లెక్కల ప్రకారం చూస్తే 1986లో 63% ఉన్నది 2008 వచ్చే సరికే 18%నికి పడిపోయిందని తెలిపారు. సమాచార వైఫల్యం ఎలా ఉన్నప్పటికీ రాష్ట్రాలలో తనిఖీల తీరును ఇది ప్రతిభింభిస్తోందని విమర్శించారు.

అంతేకాదు, ప్రభుత్వ నిర్ణయం ప్రకారం ఇక నుండి తనిఖీల ప్రక్రియలన్నిటిని కేంద్రం నుండే నియంత్రిస్తే, అవి ఎప్పుడు జరగాలో కూడా వారే నిర్ణయిస్తే, అది ప్రపంచ కార్మిక సంస్థ యొక్క కార్మిక తనిఖీ ప్రక్రియ నిబంధన 81ని ఉల్లంఘించినట్లేనని తెలిపారు. ఇందులో భాగస్వాములైన సభ్యదేశాలన్నీ తప్పనిసరిగా ఎటువంటి అంతర్గత, బహిర్గత శక్తుల ఒత్తిళ్ళు లేనటువంటి కార్మిక తనిఖీ అధికార వ్యవస్థను నెలకొల్పాలని, అది ఏ ప్రాంతంలోనైనా, ఏ సమయంలోనైనా, అవసరమెన సందర్భాన్ని బట్టి తనిఖీలు చేసే విధంగా ఉండాలని స్పష్టంగా సూచించింది. భారతదేశం 1947లోనే ఈ చట్టాన్ని అంగీకరించింది. కార్మికశాఖ అధికారిక సమాచారం ప్రకారం, భారతదేశం ఇంతవరకు ఐ.ఎల్.ఓ నిబంధనల ప్రకారం కార్మికుల సంఖ్యను బట్టి తనిఖీ అధికారులను నియమించే మార్గదర్శకాలను చేరుకోలేదని విమర్శించారు. 1948 కనీస వేతనాల చట్టం అమలు పర్యవేక్షణ కొరకు 2012లో 77 లక్షల పరిశ్రమలను తనిఖీ చేయటానికి కేవలం 3,171 మంది కార్మికశాఖ అధికారులు ఉన్నారని, అంటే ప్రతి 2,428



దుస్తుల ఫ్యాక్టరీలో మహిళా కార్మికులు: వారికి ఉన్న కొద్దిపాటి ప్రత్యేక సదుపాయాలను కూడా ఎత్తివేయాలని కార్పొరేట్ రంగం మోడీ ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తోంది

పరిశ్రమలకు ఒక తనిఖీ అధికారి లెక్కన ఉన్నారని తెలిపారు. ఆయన చెప్పిన ప్రకారం చర్చించాల్సిన అంశం ఏమిటంటే కార్మికుల నైపుణ్యత ప్రమాణాలలో హెచ్చుతగ్గుల వలన కంపెనీలకు జరిగే నష్ట నివారణ చర్యలు, కార్మిక చట్టాల సవరణ మీద దృష్టి పెట్టేకన్నా, కార్మికుల నైపుణ్యాన్ని పెంచే శిక్షణకై పెట్టుబడి పెడితే దేశానికి ఉపయోగమని సెలవిచ్చారు.

### మహిళా కార్మికులు

అఖిల భారత శ్రామిక మహిళా కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ హేమలతగారు మాట్లాడుతూ ప్రభుత్వం ఒక ప్రక్క మహిళల హక్కుల గురించి మాట్లాడుతూనే, మరోప్రక్క మెజారిటీ మహిళలు పని చేసే అసంఘటితరంగాన్ని కార్మిక చట్టాల పరిధిలో లేకుండా చేయటం విచారించాల్సిన అంశమన్నారు. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఇంటి పని వారికి కొన్ని రక్షణ చట్టాలను కల్పించినప్పటికీ, వ్యవసాయ రంగంలో పని చేస్తున్న మహిళలకు చట్టాలలో ఎటువంటి హక్కులు కల్పించబడలేదన్నారు. మరోప్రక్క ప్రభుత్వ పథకాలన్నిటినీ ప్రజల వద్దకు తీసుకెళ్ళే స్కీమ్ వర్కర్లు కోటికిపైగా ఉన్నారనీ, వారి మీద ప్రత్యేక శ్రద్ధ ప్రభుత్వం చూపాలన్నారు. ప్రభుత్వం కార్మిక చట్టాల సవరణల గురించి మాట్లాడుతోంది. ప్రభుత్వ పథకాలను క్రింది స్థాయిలో అమలు చేసే మహిళలకు మాత్రం రక్షణ ఇచ్చే కార్మిక చట్టాలేవీ లేవని విమర్శించారు. ఉదాహరణకు సమగ్ర శిశు అభివృద్ధి పథకంలో పని చేసే అంగన్‌వాడీలు, హెల్పర్లు, ఆశా పథకంలో చేసే ఆశా వర్కర్లు, (జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకంలో) ఇందిరాక్రాంతి పథం లేదా గ్రామ దీపిక వర్కర్లు(జాతీయ గ్రామీణ జీవన పథకం) ఇంకా అనేక పథకాలలో ప్రాథమిక విద్యారంగంలో చేసే శిక్షా కార్మీస్ లేదా విద్యా వాలంటీర్లు, జాతీయ బాల కార్మిక పథకంలో చేసే వారికి ఎటువంటి చట్టాలు లేవని విమర్శించారు.

సమగ్ర శిశు అభివృద్ధి పథకం వచ్చే సంవత్సరానికి 40 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంలో ఎంతోమంది మహిళలు ఉద్యోగ విరమణ చేయనున్నారు లేదా చేయబడుతున్నారు. కాని వారికి ఎటువంటి ఉద్యోగ విరమణ ప్రోత్సాహకాలు లేకుండానే ఇంటికి పంపుతున్నారు. భారతదేశంలో భావి భారత పౌరులుగా ఎదిగే పసి వారిలో పౌష్టికాహార లోపం లేకుండా చేసే కార్మికవర్గానికి ఎటువంటి భద్రత లేని పరిస్థితి శోచనీయం. అంగన్‌వాడీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఎ.ఆర్.సింధు మాట్లాడుతూ స్కీము వర్కర్ల దీర్ఘకాల డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని, కనీస వేతనాలు, సామాజిక భద్రత లాంటివి, కేంద్ర శిశు, మహిళాశాఖ మంత్రికి ఇవ్వటం జరిగిందని తెలిపారు. స్కీము వర్కర్ల పని పెరిగిందని, కాని వారి వేతనాలు గతంలో ఎలా ఉన్నాయో అలాగే కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

## ‘మార్క్సిస్టు’కు మీ సందేహాలు రాయండి!

‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి.

మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,**

‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రిక,

ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

> "అప్రంటీస్ చట్టం సవరణలు అనేక ప్రశ్నలు లేవనెత్తు తున్నాయి. ఈ చట్టాన్ని అతిక్రమించిన వారికి పెనాల్టీని తగ్గించివేశారు. ప్రభుత్వ అనుమతి అవసరం లేకుండా యజమానులు తమకు నచ్చిన విభాగాలలో శిక్షణ ఇచ్చే అనుమతి పొందారు. యజమానులు శిక్షణనిచ్చే పేరుతో ఐ.టి.ఐల నుండి ఉత్తీర్ణులైవచ్చిన వారిని చేర్చుకొని శిక్షణ పేరుతో దీర్ఘకాలంపాటు పని చేయించుకోవటం, కనీస వేతనాలలో కొంత భాగమే ఇచ్చే అవకాశాలు ఎక్కువని కార్మిక సంఘాలు భయపడుతున్నాయి."



తమిళనాడులోని శ్రీపెరంబదూర్‌లో నొకియా సీమెన్స్ నెట్‌వర్క్ ఫ్యాక్టరీ గేటువద్ద హక్కుల సాధనకై సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న కార్మికులు

45వ ఇండియన్ లేబర్ సమావేశం స్కీము వర్కర్లను కార్మికులుగా గుర్తించాలనీ, వారికి గౌరవప్రదమైన వేతనాలు, సామాజిక భద్రత కల్పించాలనీ కేంద్రానికి సూచించింది. అత్యవసర సర్వీసుల పేరుతో గార్మెంట్ పరిశ్రమలు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగాలలో పని చేసే మహిళలను కార్మికచట్టాల పరిధిలోనుండి ఎలా తప్పించారో, వారిలాగే స్కీము వర్కర్ల పరిస్థితి ఉందని తెలిపారు. అలాగే అనేక మంది మహిళలు, వారి పిల్లలు, గృహ పరిశ్రమలలో పని చేస్తున్నారనీ, వారికి ఎటువంటి కార్మికచట్టాలు, హక్కులు లేవని పేర్కొన్నారు. వారికిచ్చే వేతనాలు కూడా రోజువారీ కూలిగానే ఉంటోంది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కొన్ని జిల్లాలకే పరిమితం చేయటం కూడా లక్షలాది మహిళలు, ఉపాధి పొందుతున్న కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపబోతోంది. మహిళా సాధికారత, ఆత్మగౌరవం అనేవి కేవలం మరుగుదొడ్ల నిర్మాణంతోనేరాదు.

అప్రంటీస్ చట్టం సవరణలు అనేక ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ఈ చట్టాన్ని అతిక్రమించిన వారికి పెనాల్టీని తగ్గించివేశారు. ప్రభుత్వ అనుమతి అవసరం లేకుండా యజమానులు తమకు నచ్చిన విభాగాలలో శిక్షణ ఇచ్చే అనుమతి పొందారు. కార్మిక సంఘాలు భయపడేదేమిటంటే, యజమానులు శిక్షణనిచ్చే పేరుతో ఐ.టి.ఐల నుండి ఉత్తీర్ణులైవచ్చిన వారిని చేర్చుకొని శిక్షణ పేరుతో దీర్ఘకాలంపాటు పని చేయించుకోవటం, కనీస వేతనాలలో కొంత భాగమే ఇచ్చే అవకాశాలు ఎక్కువని పేర్కొన్నాయి. ఒక కార్మికుడు మాట్లాడుతూ, తనని ట్రైనీ అప్రంటీస్‌గా చేర్చుకున్నారని, ఆరు నెలల్లోనే శిక్షణ పూర్తి చేసుకుని ఉత్పత్తి ప్రక్రియలో పని చేయటం మొదలు పెట్టానని, అటువంటి నైపుణ్యత పెంపొందించుకోవటానికి అంతకన్నా ఎక్కువ కాలం అవసరం లేదని తెలిపారు. ఎటువంటి విద్య లేని సామాన్యుడు కూడా ఒక టెక్స్‌టైల్ లేదా స్పిన్నింగ్ మిల్లులో కొద్ది నెలల కాలంలో నైపుణ్యం సంపాదించుకోగలడని పేర్కొన్నాడు. అందువల్ల అప్రంటిస్‌షిప్ కాలాన్ని పెంచటమంటే దోపిడీని చట్టబద్ధం చేయటమే. ఐ.టి.ఐ.లను ఆధునీకరించాల్సిన అవసరం ఉంది కానీ, ప్రైవేటు రంగం అందుకు పెట్టుబడి పెట్టడానికి సిద్ధంగా లేదు. అంతకు ముందు కాలంలో ప్రభుత్వ సహకారంతో కొన్ని కంపెనీలు ఐ.టి.ఐలను ఆధునీకరించడానికి ప్రయత్నించాయి. కాని ఆ ప్రధాన బాధ్యత ప్రభుత్వమే స్వీకరించాలి, పెట్టుబడి పెట్టాలి. పరిశ్రమలు వారి అవసరాలకు అనుగుణంగానే శిక్షణ ఇస్తాయి. ఒకసారి ఆ నైపుణ్యతతో కూడిన ఉత్పత్తి ప్రక్రియ ముగియగానే కార్మికుడు అవసరం లేకుండాపోతుందని యూనియన్ నాయకులు పేర్కొన్నారు.

అక్టోబర్ 20వ తేదీన కేంద్ర కార్మిక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసిన సమావేశంలో 1980 పాలనాయంత్రాంగంలో కార్మికుల పాత్ర నిర్వచించే చట్టంపై ఒక ఒప్పందం కుదుర్చడానికి ప్రయత్నం చేయగా యాజమాన్య సంఘాలు దానిని తీవ్రంగా వ్యతిరేకించాయి. అటువంటి ఏర్పాటు కేవలం షాపులకే పరిమితమని వాదించాయి. యాజమాన్య వైఖరిని గమనించిన కార్మిక మంత్రి శ్రీ నరేంద్ర సింగ్ తోమర్ కార్మిక సంఘాల నేతలు కూడా ఉన్నారు కాబట్టి సన్నాయి నోక్కులు నొక్కుతూ పరిశ్రమలలో అత్యున్నత స్థాయిలో కార్మికవర్గం పాలుపంచుకోవడం అనేది యజమానుల నుండి స్వచ్ఛందంగా రావాలి కాని, తప్పనిసరిగా కాకూడదు అని సెలవిచ్చారు.

భారతీయ మజ్దూర్ సంఘ్ ప్రధాన కార్యదర్శి విర్జేష్ ఉపాధ్యాయ కూడా ఇతర కార్మిక సంఘాల మాదిరి, ప్రభుత్వం తలపెడుతున్న కార్మిక చట్టాల సవరణలు ప్రభుత్వ రంగ సంస్థల వాటాల విక్రయాలపై వ్యతిరేకత తెలియచేశారు. ఫ్రంట్‌లైన్‌తో మాట్లాడుతూ ఇటువంటి చర్యలు తీసుకునేటప్పుడు ప్రభుత్వం కార్మిక సంఘాలతో మాట్లాడాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రభుత్వం ఒంటెద్దు పోకడతో చేసిన పద్ధతిని తాము వ్యతిరేకిస్తున్నామని, త్రైపాక్షిక చర్చలు జరిపి ఉండాల్సిందని పేర్కొన్నారు. పరిశ్రమలను తనిఖీ చేసే అధికారాలను తగ్గించటాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని, కార్మిక శాఖ అధికారులు పరిశ్రమలలో కార్మిక చట్టాలు అమలు జరిపే వారిని, వారి అధికారాలు తొలగించటం తప్పని తెలిపారు. ప్రస్తుత సవరణలు పారిశ్రామిక వర్గానికి పగ్గాలు లేకుండా చేస్తుందని తెలిపారు. అదే సందర్భంలో అప్రంటీస్‌లకు శిక్షణ ఇవ్వటానికి పరిశ్రమలు ఎందుకు ముందుకు రావటం లేదని ప్రశ్నించారు. 4.9 లక్షల మంది అప్రంటీస్‌ల్లో కేవలం 2.81 లక్షల మందికి మాత్రమే కొద్దిపాటి శిక్షణ ఇచ్చారనీ, ఈ స్థితికి కారణం శిక్షణ పొందిన వారిని ఇంతవరకు పరిశ్రమలు స్వీకరించలేదనీ తెలిపారు. అప్రంటీస్‌లకు ఎటువంటి కార్మిక చట్టాలు అమలుకావు. అందువల్ల ప్రభుత్వమే ఒక పద్ధతి ప్రకారం పరిశ్రమలకు చౌకగా లభించే కార్మిక వర్గాన్ని తీసుకునే విధంగా ప్రోత్సహిస్తోందని

విమర్శించారు. మేము పారిశ్రామికవర్గానికి వ్యతిరేకం కాదు కాని, కార్మికవర్గానికి కూడా ఎంతోకొంత చేయాలికదా అని అన్నారు.

అప్రంటీస్ చట్టంలో తీసుకువచ్చిన సవరణలు అనాలోచితంగా చేసినట్లుగా ఉన్నాయని, ప్రభుత్వం తలపెట్టిన కార్మిక చట్టాల సవరణలు ఈ మధ్యకాలంలో పారిశ్రామిక వర్గానికి కార్మికవర్గం దగ్గరయ్యే ప్రక్రియ ఏదైతే జరిగిందో దానికి నష్టం కలిగించేలా ఉందని వ్యాఖ్యానించారు. యు.పి.ఏ ప్రభుత్వ కాలంలో 2013 లో ఒక అనధికార కమిటీ ఏర్పాటు అయిందని, ప్లానింగ్ కమిషన్ సభ్యులయిన అరుణ్ మైరా నాయకత్వంలో పారిశ్రామిక వర్గానికి, కార్మిక సంఘాలకు సయోధ్య కుదిర్చే పని కొంత ముందంజ వేసిందని తెలిపారు. పారిశ్రామిక వివాదాలు పెద్ద ఎత్తున పెరిగిన నేపథ్యంలో ఈ కమిటీని వేశారు. రెండవ జాతీయ లేబరు కమిషన్ సమగ్రంగా అన్ని చట్టాలను పరిశీలించి చాలా అంశాలమీద ఒక ఉమ్మడి అవగాహనకు వచ్చింది. ప్రభుత్వం ఎందుకు ఈ ప్రతిపాదనలను పరిశీలించటం లేదని ఆయన ప్రశ్నించారు. మేము అభివృద్ధికి వ్యతిరేకం కాదు, కాని "అందరివెంట" ఉండాలి కదా అన్నారు బి.ఎమ్.ఎస్ నాయకుడు. మోడీ నిరంతరం వాడే పదజాలాలు గుర్తు చేస్తూ ఆమాట అన్నారు. (సబ్‌కా సాత్)

వీటన్నిటినిబట్టి స్పష్టంగా అర్థమవుతోంది ఏమిటంటే, ఎన్.డి.ఏ ప్రభుత్వ ప్రాధాన్యత పారిశ్రామికవర్గానికి అనుకూలమైన వాతావరణం కల్పించటమే. పారిశ్రామిక రంగంలో ఇబ్బందులకు గురవుతున్న కార్మికవర్గ సమస్యలపై మాట్లాడేందుకు కేంద్ర కార్మిక సంఘాలను పిలవటం లేదు. అసంఘటిత కార్మిక వర్గాన్ని పూర్తిగా మర్చిపోయారు. కేంద్ర కార్మిక సంఘాలైన సిఐటియు, ఎఐటియుసి, ఐయన్‌టియుసి, బిఎంఎస్ ఎత్తి చూపుతున్న సమస్యలను తృణప్రాయంగా చూడటం, మరోవైపు పారిశ్రామికవర్గాల అతిశయం, ఆధిక్యం ఆశ్చర్యం కలిగిస్తోంది. అంతేకాదు, కోటానుకోట్ల రిజర్వు ఆర్మీ లాంటి కార్మికవర్గానికి ఇచ్చిన హామీలతో అత్యధిక మెజారిటీ సాధించిన ఎన్.డి.ఏ ప్రభుత్వం పారిశ్రామికవర్గానికి అండగా నిలబడటం, ప్రజలను వంచించటమే. ఎన్.డి.ఏ ప్రభుత్వ తీరుతెన్నులు చూసిన తరువాత గత యు.పి.ఏ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక బాటలోనే పయనిస్తోందని, దానిని మరింత పదునుగా అమలు చేయటానికి సిద్ధమైందని అర్థమవుతోందనీ అర్థమవుతోంది.

**(ఫ్రంట్‌లైన్ వ్యాసం నుండి**
**అనువాదం: ఎల్.ఎస్.భారవి)**

## అభిప్రాయాలు

## ఏచూరి వ్యాసం విజ్ఞానదాయకంగా వుంది

అక్టోబర్ 'మార్క్సిస్టు' సంచికలో కామ్రేడ్ సీతారామ్ ఏచూరిగారు '50 ఏళ్ల సిపిఐ(ఎం) సాధించిన విజయాలు, ముందున్న సవాళ్లు' పేరుతో రాసిన వ్యాసం చాలా ఎడ్యుకేటివ్‌గా వుంది. భారత దేశ సమకాలీన రాజకీయ పరిస్థితుల గురించి పరిశీలనాత్మకంగా విశ్లేషించారు. ఈ 50 ఏళ్ల చరిత్రలో సిపిఐ(ఎం) ప్రపంచంలోని కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీల మధ్య సహృద్భావ సంబంధాలు ఏర్పాటు చేయడానికి జరిపిన కృషినీ, మన పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఈ యాభై ఏళ్లలో పొందిన అనుభవాలనూ, మూడు దశాబ్దాలపాటు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ నిర్వహణలో పొందిన అనుభవాలను కూడా వ్యాసంలో వివరించి వుంటే బాగుండేది.

ముస్లింలపై ఇర్ఫాన్ ఇంజినీర్ రాసిన వ్యాసం మతోన్మాదుల ఆగడాలను మరింత వెలుగులోకి తెచ్చింది. కమ్యూనిస్టు పార్టీలో అంతరంగిన ప్రజాస్వామ్యం గురించి కామ్రేడ్ వీరయ్యగారు రాసిన వ్యాసం, లెనిన్ పేరిట లెనినిజంపై దాడి పేరుతో కామ్రేడ్ తెలకపల్లి రవిగారు రాసిన వ్యాసాలు కూడా బాగున్నాయి. ఇక గుజరాత్ విద్యార్థులపై కాషాయ సేన ప్రయోగాల గురించి వ్యాసాన్ని ముఖ్యంగా విద్యార్థులకూ, ఉపాధ్యాయులకూ, మేధావులకూ బాగా నచ్చచెప్పి వారిని ఎడ్యుకేట్ చేయాలి. మొత్తం మీద అక్టోబర్ మాసం మార్క్సిస్టు సంచిక ఎంతో ఉపయోగకరంగా వుంది.

**కమ్మ నరశింహారావు,** పండితవెల్లూరు,
పశ్చిమ గోదావరి జిల్లా.

## ఏచూరి చెప్పింది వాస్తవం

మార్క్సిస్టు సంపాదకులకు, నవంబర్ సంచికలో సీతారాం ఏచూరిగారు చెప్పినట్లు ప్రభుత్వరంగాన్ని ఉపయోగించుకొని ప్రైవేటు పెట్టుబడిదారులు లాభపడింది అక్షరాలా నిజం. మనకు స్వాతంత్ర్యం వచ్చేనాటికి టాటా ఆస్తి సుమారుగా 30 కోట్ల రూపాయలు. బిర్లా ఆస్తి 7 కోట్లు మాత్రమే. ఉదాహరణకు చిన్న ప్రభుత్వరంగ సంస్థ ఐడిపిఎల్‌కే 30 కోట్ల పైగా పెట్టుబడి పెట్టడం జరిగింది. ప్రభుత్వ పాలసీ ప్రకారమే ఉత్పత్తయిన మందులలో అధికశాతం (బల్క్)గా ప్రయివేటువారికి అమ్మి, కొద్ది మోతాదులో ట్యాబ్లెట్లుగా చేసి స్వయంగా అమ్మేవారు. మార్కెటింగ్ ఖర్చు మొత్తం ఖర్చులో ఒక శాతానికి మించి వుండకూడదని నియంత్రణ వుండేది. అందువలన అన్ని ఐడిపిఎల్ యూనిట్లు కలిపి సుమారు 14 వేలమంది కార్మికులు పనిచేస్తే దానికి 250కి మించి మెడికల్ రిప్రజెంటేటివ్‌లు వుండేవారు కారు. అదే యూనిశాంకో లాంటి 30 మంది పనిచేసే కంపెనీల్లో మందుల అమ్మకం, ప్రచారానికి 150 మందికి పైగా రిప్రజెంటేటివ్‌లు వుండేవారు. ఐడిపిఎల్ వద్ద ప్రయివేటు వారు మందులు (పౌడర్లు) కొని ట్యాబ్లెటింగ్, స్ట్రిప్పింగ్‌చేసి వారి వారి కంపెనీల బ్రాండ్ నేమ్‌తో అధిక ధరలకు అమ్మి సొమ్ము చేసుకొని కోట్లు సంపాదించారు. ఆల్కహాలు, యాసిడ్లు లాంటి రామెటీరియల్ సప్లయ్ చేసే ఆంధ్రా షుగర్స్, ధర్మసీ మొరార్జీ కెమికల్ కంపెనీలు కోట్లు సంపాదించాయి.

మొదట్లో ప్రభుత్వం ఇన్స్యూరెన్స్, మైన్స్, బ్యాంకులు జాతీయంచేసి పెట్టుబడులు సమీకరించి, రష్యా, ఇతర కమ్యూనిస్టు దేశాల సహకారంతో ప్రభుత్వరంగ సంస్థలను ఏర్పాటు చేసి మౌలిక సదుపాయాలు కల్పించి ప్రయివేటు వారిని పైకి తీసుకురావటం జరిగింది. అలాగే ప్రభుత్వం వేలకోట్లు ఖర్చుపెట్టి అంతరిక్ష పరిశోధనలు చేసి కమ్యూనికేషన్ ఉపగ్రహాలను పంపితే దాని ఫలాలు మాత్రం ప్రింటు, ఎలక్ట్రానిక్ మీడియా, టెలిఫోన్ కంపెనీల వారు, ఐ.టి. వారు ఉపయోగించుకొని వేలు, లక్షల కోట్లు సంపాదిస్తున్నారు. 80వ దశకం వచ్చేసరికి పెట్టుబడిదార్లు తెగ బలిసి తమకు ఇబ్బడిముబ్బడిగా లాభాలు రావాలంటే తమకు అడ్డుగా వున్న ప్రభుత్వరంగ సంస్థలను నాశనం చేయాలని ప్రయత్నించి సఫలీకృతం అవుతున్నారు. కుక్కను చంపాలంటే ముందు దానిని పిచ్చి కుక్కగా ప్రచారం చేసినట్లుగా ప్రభుత్వరంగ సంస్థలు కాలం చెల్లినవనీ, సోషలిజం, ట్రేడ్ యూనియన్లు మూస వాదనలనీ ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వాలు అందుకు తందాన అంటున్నవి.

**- తుమ్మల మోహనరావు,** హైదరాబాద్

# ఆరుట్ల కమలాదేవి

(2వ పేజీతరువాయి)


తెలంగాణా సాయుధ పోరాటంలో మహిళా గెరిల్లాలు: మల్లు స్వరాజ్యం తదితరులు



ప్రథమ చికిత్స మొదలైన వాటిలో శిక్షణ పొందారు. శిక్షణా కాలమంతా ప్రతి మహిళా ఖాకీ రంగు నిక్కరు, అదే రంగు షర్టు విధిగా ధరించారు. శిక్షణ పొంది వచ్చాక భువనగిరిలో జరిగిన ఆంధ్ర మహాసభకు హాజరయ్యారు. ఆ మహాసభ నిర్వహణకు ఆమె భర్త రామచంద్రారెడ్డి ఎంతో ప్రచారం చేశారు. ఆ మహాసభ రాజకీయ పోరాట వేదికగా మారింది.

దొరలు, దేశ్‌ముఖ్‌ల దౌర్జన్యాలు, వెట్టిచాకిరీ, నిర్బంధ వసూళ్లకు వ్యతిరేకంగా ఉద్యమం నడపాలని ఆంధ్రమహాసభ పిలుపునిచ్చింది. అలా ఆరుట్ల కమలాదేవి కమ్యూనిస్టు పార్టీ సభ్యురాలుగా భర్తతో కలిసి ఉద్యమంలోకి వచ్చారు. దేవులపల్లి వెంకటేశ్వరరావు నిర్వహించిన రాజకీయ తరగతులకూ ఆమె హాజరయ్యారు. 1945లో భర్తను అరెస్టు చేశారు. అప్పటికా దంపతులకు ఏడాది వయసుగల కుమారుడు విప్లవ్ ఉన్నాడు.

1946 నాటికల్లా నల్గొండ జిల్లాలో నిజాం నిర్బంధం పెరిగింది. విడుదలైన భర్త రహస్య జీవితంలోకి వెళ్లారు. ఆ పరిస్థితుల్లో కమలాదేవి తన బిడ్డను కృష్ణాజిల్లాలో ఉన్న అన్న వద్ద కొంతకాలం, మధిరలో ఉద్యోగిగా ఉన్న మేనల్లుడి వద్ద మరికొంతకాలం వదిలిపెట్టి, ఉద్యమంలో పనిచేశారు. తెలంగాణాలో నిర్బంధకాండ వల్ల ఆమె ఆంధ్రలోని కృష్ణాజిల్లాలో రహస్యంగా ఉండాల్సి వచ్చింది.

భర్త రామచంద్రారెడ్డికి తుపాకీ దెబ్బ తగిలిందని తెలిసి ఆమె హైదరాబాద్ వచ్చారు. కొంతకాలానికి ఆయన కోలుకున్నారు. అప్పుడామె భర్తతో కలిసి భువనగిరి, ఆలేరు ప్రాంతాల్లో దళాల్లో పనిచేశారు. తుపాకీ పేల్చ డంలో శిక్షణ పొందారు. ఓ రోజు భువనగిరి ప్రాంతంలోని చల్లూరు గుట్టల్లో భార్యాభర్తలు రక్షణ తీసుకుంటున్నారు. కొరియర్ జాడ లేదు. మిలటరీ చుట్టేసింది. పట్టుబడితే ప్రాణాపాయం తప్పదనుకొని భర్తను వెళ్లిపోవలసిందిగా కోరారు కమలాదేవి. ఆయన కమలాదేవిని వదిలి వెళ్లేందుకు అంగీకరించలేదు. ఎలాగో మిలటరీ బారి నుంచి వారు తప్పించుకోగలిగారు.

కొన్ని రోజులయ్యాక దళంలో ఉండగానే కమలాదేవికి జ్వరం వచ్చింది. ఎంతో బాధపడుతోంది. ఈ పరిస్థితుల్లో పుట్టింటి వద్ద వదిలి పెట్టేందుకు నిర్ణయించి, రామచంద్రారెడ్డి ఆమెను తీసుకువెళ్తున్నారు. ఆలేరు వద్ద పోలీసులకు చిక్కారు. ఆయనను ఖమ్మం క్యాంపుకూ, ఆమెను వరంగల్ జైలుకూ పంపారు. ఆమె ఏడాదిపాటు ఆ జైల్లోనే ఉన్నా రు. తర్వాత ఔరంగాబాద్ జైలుకు మార్చారు. అక్కడ మరో సంవత్సరం శిక్ష అనుభవించారు. తిరిగి సికిందరాబాద్ జైలుకు తీసుకొచ్చారు.


ఆయుధాలు కలిగి ఉన్నట్లు భార్యాభర్త లిరువురి మీదా నేరం మోపి, ప్రత్యేక కోర్టులో కేసు నడిపారు. అది రుజువు కాకపోవడంతో చివరికి (1951 చివర్లో) విడుదలయ్యారు. 1952 ప్రథమ ఎన్నికల్లో ఆమె భువనగిరి శాసనసభా నియోజకవర్గం నుంచి పోటీ చేసి, గెలుపొందారు. ఆ తర్వాత వరుసగా మూడు సార్లు ఆలేరు నుంచి శాసనసభకు ఎన్నికయ్యారు.

1962లో సుందరయ్యగారు శాసనసభలో ప్రతిపక్ష నాయకులుగా ఎన్నికైతే, ఆమె ఉప నేతగా ఎంపికయ్యారు. ఆ తర్వాత సుందరయ్య గారు చికిత్స నిమిత్తం మాస్కో వెళ్లినప్పుడు ఆమె ప్రతిపక్ష నాయకురాలిగా పనిచేశారు. తరువాత పార్టీ సైద్ధాంతిక విభేదాలతో చీలిపోయింది. ఆమె సిపిఐలో ఉన్నారు. ఆ పార్టీ రాష్ట్ర, నల్గొండ జిల్లా సమితి సభ్యురాలిగా ఆమె చాలాకాలం పనిచేశారు.

1966 తరువాత రాష్ట్ర మహిళా సంఘం ప్రధాన కార్యదర్శిగా కొంతకాలం పనిచేశారు. ఓపికున్నంత వరకూ శక్తికొలదీ ఆమె పార్టీలో పనిచేశారు. 1956లో బల్గేరియా, చెకొస్లొ వేకియా, జర్మన్ డెమొక్రటిక్ రిపబ్లిక్, ఆస్ట్రియా దేశాల్లో పర్యటించారు. 1983లో భర్త రామ చంద్రారెడ్డితో కలిసి సోవియట్ యూనియన్ వెళ్లారు.

వీర వనిత కమలాదేవి 2001 జనవరి 1నకన్నుమూశారు.

# విప్లవ రాజకీయాలను పునరుద్ధరించాలంటే దోపిడీకి గురయ్యే వారిపై సాగుతున్న సాంస్కృతిక దాడిమీద కూడా పోరాడాలి



– జేమ్స్ పెట్రాస్

[illegible]

(పై వాక్యాలు జేమ్స్ పెట్రాస్ రచించిన '20వ శతాబ్దపు చివరిలో సాంస్కృతిక సామ్రాజ్యవాదం' వ్యాసం నుండి గ్రహించబడ్డాయి.)

Marxistu, monthly organ of Communist Party of India (Marxist) A.P . State Committee.
Printer & Publisher B.V. Raghavulu. RNI Reg.No. APTEL/2006/17554. Vol.9, No.8. Published on December 1, 2014